
బేతాళ పంచవింశతి

గ్రంథకర్త

కౌతా. శ్రీరామశాస్త్రిగారు





చెన్నపురి

ఇండియన్ పబ్లిషింగ్ హౌస్ లిమిటెడ్

1929

[వెల 9 అణాలు.

B

బేతాళ పంచవింశతి

ఉజ్జయినీ నగరాధినాథుని పేరు గంధర్వసేనుఁడు. ఆతని పుత్రులార్గురును సమస్త విద్యావిశారదులై యుండిరి. పెద్ద వాని పేరు శంఖుఁడు. తండ్రి మరణానంతర మాతఁడు రాజ్యమును నలంకరించెను. రెండవవాని పేరు విక్రమాదిత్యుఁడు. ఆతఁడు సకల సద్గుణ సంపన్నుఁడు. సర్వవిద్యా విశారదుఁడు; మహాపరాక్రమ ధనుఁడు. అందువలన నాతని ఖ్యాతి దేశ దేశములయందు వ్యాపింపఁ జొచ్చెను. సింహాసనము నలంకరించిన శంఖుఁడు సోదరుని శక్తి సామర్థ్యములను, విద్యాబుద్ధులను ...ంచి ఓర్వఁజాలక ఆతని రహస్యముగ వధించుటకనేక ...ట్రలు పన్నెను. కాని యాతని పన్నుగడలన్నియు వ్యర్థమాయెను. చివరకు విక్రమాదిత్యుఁడు శంఖుని వధించి సింహాసనమెక్కెను.

విక్రమాదిత్యుఁడు మహావీరుఁడు; శూరుఁడు; రాజ్యతంత్రజ్ఞుఁడు; మహత్తరగుణ సమన్వితుఁడు. అందువలన కొలఁది కాలములో జంబూద్వీపమునంతయు వశపఱచుకొని రాజ్యపరిపాలనం బొనర్చుచుండ, ప్రజలు పరమ సుఖమునఁ గాలము గడుపుచుండిరి.

విక్రమాదిత్యునకుఁ దన పరిపాలనమున ప్రజ లేవిధముగ జీవించుచుండిరను విషయమును స్వయముగఁ దెలిసికొనవలయునను సంకల్పము గలిగె. వెంటనే సోదరులయందు చిన్నవాఁడగు భర్తృహరిమీఁద రాజ్యభారమును మోపి సన్యాసివేషమును ధరించి ప్రజలతోడ కలసి మెలసి తిరుగుచు వారి

కష్టసుఖములను హృదయంగమ మొనర్చుకొనుచుండెను. విక్రమాదిత్యుని పరిపాలనమున కడుపునీరు కదలక హాయిగ జీవించుచున్నా మని ప్రజ లనుకొనుటను స్వయముగ విని కొలంది ఆనందించుచుఁ దిరుగుచుండెను.

భర్తృహరి భార్యతోఁ గలహించి విరాగియై రాజ్యమును వీడి దేశాంతరగతుఁడాయెను. ఆ వార్త విక్రమాదిత్యుని చెవి సోకెను. వెంటనే విక్రమాదిత్యుఁడు బయలుదేరి యుజ్జయినీ నగరమును బ్రవేశించునప్పటికి రాత్రి రెండు జాములు దాటెను. నగరద్వారమును బ్రవేశింపఁబోవ భయంకర రూపుఁడగు యక్షుఁడొకఁడాతని నడ్డగించి యిట్లనియె. "నీ వెవఁడవు? అర్ధరాత్రమున పురప్రవేశ మొనర్చుటకుఁ గారణ మేమి

విక్రమాదిత్యుఁడు:—నీ వెవ్వఁడవు; నన్నడ్డగించుట గారణ మేమి?

యక్షుఁడు:—నేను యక్షుఁడను. దేవేంద్రుని యాజ్ఞానుసార మీపురమును రక్షించుచున్నాను. కావున నీవు ప్రవేశ మొనర్చుటకు వీలులేదు. భర్తృహరి రాజ్యమును సన్యాసమును గైకొని విదేశముల కేఁగియున్నాఁడు.

విక్రమాదిత్యుఁడు:—నా పేరు విక్రమాదిత్యుఁడు. లేవిధముగఁ గాలము గడపుచున్నారో కనుఁగొనవలయును తలంపున భర్తృహరిమీఁద రాజ్యభార ముంచి దే బొనర్చుచుంటిని. కాని భర్తృహరి రాజ్యమును వీడి సిసియై యుజ్జయినీ నగరమునుండి యెచ్చటికో పోయి వార్త విని యిటకు వచ్చితిని. మార్గమును వీడుము. ప్రవేశించెదను.

యక్షుఁడు:—విక్రమాదిత్యుఁడు మహాపరాక్రమ సంపన్నుఁడు గదా? నిజముగ నీవు విక్రమాదిత్యుఁడవే యైనచో మల్లయుద్ధమున నన్ను జయింపుము. నగరప్రవేశ మొనర్పవచ్చును. నన్ను జయింపఁజాలవా ముందడుగు వేయఁజాలవు.

విక్రమాదిత్యుఁడు వెంటనే మల్లయుద్ధమునకు సిద్ధకొనెను. అత్యంత కౌశలమున నిర్వురును పోరఁజొచ్చిరి. ముహూర్తకాలములో విక్రమాదిత్యుఁడు యక్షుని క్రిందఁ బడవైచి వక్షస్థ్సలముమీఁద గూర్చుండి వానిని నొక్కిపట్టెను. అప్పుడు దీనస్వరమున యక్షుఁ డిట్లనియె. "మహారాజా! నీవు నిజముగ విక్రమాదిత్యుఁడవే. నన్ను విడిచి పురమును బ్రవేశింపుము. కాని నిన్ను నేను బ్రతికించితి నను విషయమును మరువఁజనదు."

అను మాటలకు నవ్వుచు విక్రమాదిత్యుఁ డిట్లు "యక్షుఁడా! నిన్ను నేను చిత్తుచేసి నీ యెదురు రొమ్మువి గూర్చుండియుంటిని. ఒక్క త్రుటిలో నిన్ను యమసదనమునకుఁ బంపఁగలను. కాని నిన్ను వీడఁదలఁచితిని. అందువలన నిన్ను బ్రతికించినవాఁడను నేనుగాని నన్ను నీ వెట్లు బ్రతికించితివి"?

అను ప్రశ్నకు నవ్వుచు యక్షుఁ డిట్లనియె. "మహారాజా! నేను సత్యమునే వచించుచున్నాను. నన్ను వీడుము. నేను చెప్పినట్లు ప్రవర్తించినచో పుడమి చక్రవర్తి వగుదువు. చిరకాలము రాజ్యపరిపాలనం బొనర్చెదవు."

విక్రమాదిత్యుఁ డాశ్చర్యమును బొందుచు యక్షుని వక్షస్థలముపైనుండి దిగెను. యక్షుఁడు లేచి కూర్చుండి యొకింత విశ్రాంతి గైకొని యిట్లు చెప్పఁదొడఁగెను. "మహా

రాజా! భోగవతీ నగరమును చంద్రభానుఁడను రాజు పాలించు చుండెను. ఆతఁడు మిక్కిలి పరాక్రమశాలి. చంద్రభానుఁ డొకదినమున సైన్యసామంతులతోడ వేటకేఁగి మహారణ్యమం దొక యాశ్చర్యదృశ్యమును గాంచెను. ఒక తాపసి కాళ్లు చెట్టుకొమ్మకుఁ దగిలించుకొని క్రిందికి వ్రేలాడుచు ధూమపాన మొనర్చుచుండఁ జూచి రాజు మిక్కిలి విస్మయము నొందుచు రాజధానికిఁ దిరిగివచ్చెను. పిమ్మట ననేకులవలన నా తాపసి మహానియతి యనియు, అనేక వత్సరములుగ ఘోరతప మాచరించుచున్నాఁడనియు వినిన కొలఁదిని యాతఁ డాశ్చర్యమును బొందఁజొచ్చెను.

ఒక దినమున చంద్రభానుఁడు కొలువుకూటమునఁ బుండి సభాసదులకు తాను గాంచిన యోగి వృత్తాంత మెలియఁజెప్పి యిట్లనియె.—"ఇచ్చటి కాయోగిని దీసి కొని రాఁగలిగినవాని కొక లక్షవరహాలను బహుమతి నొసంగుదును."

ఆ పురమందలి యొక వేశ్య యీ విషయమును విని రాజసభ కేఁగి యిట్లు విన్నవించెను. "మహారాజా! ఆజ్ఞ నొసంగినయెడల నాతని నే నిచటకుఁ దీసికొనిరాఁగలను." అన రాజు వేశ్యకాంత రూపలావణ్యములఁ దిలకించి తాపసుని దీసికొని రాఁగల దని దలంచి యాజ్ఞ నొసంగెను.

వెంటనే యావేశ్య బయలుదేరి యోగి తప[illegible] రించు స్థలమును జేరి యాతని సమీపించి చూచె[illegible] నేత్రములు మూఁతలుపడియుండెను. శరీరమందలి [illegible] తయు నశించి యెముకలు చర్మముమాత్రము మిగిలి[illegible]

అట్టివాని కాకస్మికముగ ధ్యానభంగ మొనర్చుట యకార్య మని యావేశ్య తలంచి యా వృక్షమునకు సమీపమం దొక కుటీరమును నిర్మించుకొని యందు నివసించుచు యోగికి సేవఁ జేయుచు ప్రతిదినమును పాయసమువండి కొలఁదిమాత్ర మా యోగినోటఁ బెట్టుచుండెను. అతఁడు దానిని భుజించుచుండెను. ఇట్లు కొన్నిదినములు గడచునప్పటికి నాతని కొకింత శరీర బలము వృద్ధియాయెను. పిమ్మట నొక దినమున నాతఁడు నేత్రములుదెరచి సమీపమందుఁ గూర్చుండియుండిన వేశ్యాంగనను గాంచి మోహించి తపము చాలించి చెట్టునుండి దిగివచ్చి యిట్లు ప్రశ్నించెను. "రమణీమణీ, ఈ మహారణ్యమునం దొంటరిగ నివసించుటకుఁ గారణమేమి?"

వేశ్య:—తాపసోత్తమా! నేను దేవకన్యను. తప మాచరించుట కిట వచ్చితిని. ఆ కుటీరమునందు నివసించు చున్నాను. తమ దర్శనమువలన ధన్యనైతిని.

తాపసి:—సుందరీ! నీవు నా కొనర్చిన సేవకు మిక్కిలి సంతృప్తచిత్తుఁడ నైతిని. నీ యాశ్రమమును చూడవలయునని యున్నది. అభ్యంతరము లేనియెడల నన్నటకుఁ దీసికొని పొమ్ము.

అంతట నావేశ్య యోగిని వెంట నిడుకొని కుటీర మును బ్రవేశించెను. మిక్కిలి శ్రద్ధాభక్తులతోడ యోగికి సేవ జేయఁ జొచ్చెను. ఇట్లు కొలఁదికాలము జరిగిన పిమ్మట యోగి సంతసించి సంతృప్తినొంది యామెను గాంధర్వ విధిని వివాహ మాడెను. కందమూలఫలములు మొదలగువానిని దినుచు వా రాకుటీరమందే సుఖముగఁ గాలము గడపుచుండిరి. కొంత

కాలము గడచిన పిమ్మట నా దంపతుల కొక పుత్రుఁడు గలిగెను.



ఒక దినమున వేశ్య తాపసుని చూచి యిట్లనియె. ‘‘నాథా! మనము నిరంతరము సంసార సౌఖ్యములయందు మునింగియుండి పరమును మఱచియున్నాము. సంసార భోగ

ము లనిత్యములే గదా? కావున నాకు, తీర్థయాత్రల కేఁగి పుణ్యము నార్జించుకొనవలయు నను కోరిక గల్గినది. నా మనో వాంఛను బూర్తిచేయుఁడు."

భార్య మాటలు సత్య మని నమ్మి యోగి పుత్రుని మూఁపుపై నెక్కించుకొని భార్యవెంట నడచుచు బయలు దేరెను. ఆయాపట్టణములను పుణ్యతీర్థములను దిలకించుచు చివరకు వారు భోగవతీ నగరమును బ్రవేశించి రాజసభ కేఁగిరి. అచ్చట నున్నవారెల్ల రాశ్చర్యాన్వితచిత్తులై తిలకించుచుండ రాజు సభాసదులఁగాంచి యిట్లనియె. "మెచ్చితిఁగదా ఈ వేశ్య శక్తి సామర్థ్యములు? ప్రతిజ్ఞానుసారము యోగికి తపో విఘ్నము గలిగించి యాతని గాంధర్వవిధిని వివాహమాడి సంతానమును బడసి వెంట నిడుకొని వచ్చినది. ఈమె చాతుర్య మునకును, బుద్ధికుశలతకును నే నెంతయు సంతసించుచున్నాను." అని కోశాధ్యక్షుని బిలిచి లక్షవరహాలను బహుమతి యొసంగు మని యాజ్ఞాపించెను.

చంద్రభానుని మాటలు వినినంతనే యా యోగికి తెలివి గలిగి తుచ్ఛభోగములయందుఁ దగుల్కొంటి నని విచారించిన కొలఁదిని యాతనికి దుఃఖము పొంగి పొరలఁజొచ్చెను. ఈ చంద్రభానుఁడే తన తపమును చెరచుట కీ వేశ్యను బంపెనని గ్రహించి క్రోధాన్వితుఁడై శరీరము కంపించుచుండ వడవడ వణంకుచు భుజముమీఁద నున్న పుత్రుని క్రిందఁ బడవైచి తలవంచుకొని తీవ్రగమనమున నటనుండి నిర్గమించెను. మహా రణ్యమున కేఁగి ఘోరతప మాచరించి తపోబలమువలన చంద్ర భానుని సంహరించెను.

మహారాజా! నీవును, చంద్రభానుఁడును, యోగియు నొక్క నగరమున నొక్క ముహూర్తమున జన్మించితిరి. నీవు సింహాసన మలంకరించి ప్రజాపాలనం బొనర్చుచున్నావు. చంద్రభానుఁడు తెలికల కులమందుఁ బుట్టియు అదృష్టవశమున భోగవతీ నగరనాథుఁడై యుండెను. కుమ్మరి కులమందుఁ బుట్టిన యోగి, యోగబలమువలన చంద్రభానుని సంహరించి అతని శరీరము నొకశ్మశానమందలి శిరీషవృక్షమునకుఁ దలక్రిందుగ వ్రేలాడఁగట్టి ఇప్పుడు నిన్ను సంహరించుటకుఁ బ్రయత్నించుచున్నాఁడు. నిన్ను సంహరింపఁ గలిగినచో ఆతఁడు విద్యాధరులకు రాజగును. ఆతనినుండి నీవు తప్పించుకొనఁగలిగినయెడల పెక్కువేలయేండ్లు చక్రవర్తివై సర్వసుఖముల ననుభవింతువు. రాజా! నీకీ విషయము తెలియదు. కావున నీకీ విషయమును జెప్పి నిన్ను బ్రతికించితిని." అని నుడివి యక్షుఁడు స్వస్థానమున కేఁగెను.

విక్రమాదిత్యుఁడు విస్మయచిత్తుఁడై పలువిధముల చింతించుచు స్వీయసౌధమును బ్రవేశించెను. అంతఃపురమున నానంద కోలాహలము మిన్ను ముట్టెను. పురజను లపూర్వానందమున మునింగి యానందోత్సవములు చేయఁజొచ్చిరి.

ఒక దినమున విక్రమాదిత్యుఁడు కొలువుదీర్చియుండ శాంతశీలుఁ డను సన్యాసి యటకు వచ్చి విక్రమాదిత్యమహారాజుచేతియం దొకఫలము నుంచి యాశీర్వదించెను. కొంతవడి యథోచితసంభాషణ జరిగిన పిమ్మట నా సన్యాసి యటనుండి నిర్గమించెను. వెంటనే యక్షుఁడు చెప్పిన విషయము తలంపునకు రాఁగా విక్రమాదిత్యుఁ డిట్లు యోచింపఁ జొచ్చెను. "వీఁడు యక్షుఁడు చెప్పిన సన్యాసియై యుండవచ్చును. కావున

నీ ఫలము నిప్పుడే తినుట యుక్తము గాదు." అని తలంచి యా ఫలమును కోశాధ్యక్షుడగు ఉగ్రాణికునిచేతి కిచ్చి దాచి యుంచుమని నుడివెను. ఆత డాఫలమును ధనాగారమున నొకమూలc బడవైచెను.

ఆ దినము మొదలు ప్రతిదిన ముదయమునను శాంత శీలుcడు సభాభవనమునకు వచ్చి విక్రమాదిత్యునకు ఫలము నిచ్చి యేగుచుండెను. విక్రమాదిత్యుcడు వానిని కోశాధ్యక్షున కిచ్చుచుండెను. ఒకదినమున రాజు మంత్రి సామంతులతోడ వన విహారమునకు బయలుదేరcబోవు సమయమున శాంతశీలుcడు వచ్చి యాశీర్వదించి ఫలము నొసంగెను. వెంటనే పెంపుడు కోతి యటకు రాcగా, విక్రమాదిత్యు డాఫలమును దాని సమ్ముఖమునc బడవేయ నది పగిలి యందలి రత్నము బయల్పడెను. దానిని దీసిచూడ నది యత్యద్భుత రత్నమై యుండెను. అప్పుడు విక్రమాదిత్యుcడు యోగిని చూచి యిట్లనియె. "మహాశయా! ఈ యమూల్యరత్నమును నా కేల నొసంగితివి?" అని ప్రశ్నింప శాంతశీలుc డిట్లనియె. "మహారాజా! శూన్యహస్తముల ప్రభు దర్శనము చేయరా దని శాస్త్రములు చెప్పుచున్నవి. అందు వలన రత్నముల నిముడ్చిన ఫలములc దెచ్చి తమ కొసంగుచు న్నాను." వెంటనే రాజు సభాభవనమున కేcగి కూర్చుండి కోశా ధ్యక్షునికడ నిల్వయున్న ఫలము లన్నిటిని దెప్పించి చూడc బ్రతి ఫలమందును స్వచ్ఛమగు నపూర్వరత్న మొక్కటియుండెను. ఆ రత్నములన్నిటిని చూచి విక్రమాదిత్యుcడు మొదలగువా రెల్ల రాశ్చర్యాన్విత చిత్తులైరి. అప్పుడు రాజు యోగిని చూచి యిట్లు ప్రశ్నించెను. "మహాశయా! తాము యోగులు. ఈ యమూల్య రత్నములు తమ కెట్లు లభించినవి? వీనిని నా

కొసంగుటకుం గారణ మేమి?" అన యోగి రాజును రహస్య ప్రదేశమునకుం దీసికొని యేఁగి యిట్లనియె. "మహారాజా? నేను గోదావరీతీరమందొక శ్మశానమందు మంత్రసాధన కుపక్రమింపఁ దలఁచితిని. ఇదివఱకు ధనసిద్ధి యైనది. అందువలన రత్నముల తను కొసంగితిని. కాని యిప్పు డష్టసిద్ధులు లభించుటకొఱకు మంత్రసాధనకుఁ గడంగెదను. మీరు నా కుటీరమునకువచ్చి యొకరాత్రి యటనుండిన నాకష్టసిద్ధులు లభ్యమగును."

విక్రమాదిత్యుఁడు :—మహాశయా! అది యెంతటి కార్యము? తప్పక వచ్చెదను కాని నే నెప్పుడు రావలయును?

యోగి:-భాద్రపదబహుళచతుర్దశి సాయంకాలమునకు రావలయును.

విక్రమాదిత్యుఁడంగీకరించెను. యోగి యటనుండి నిర్గమించెను. భాద్రపదబహుళచతుర్దశి వచ్చెను. ఆ దినమున విక్రమాదిత్యుఁడు కరవాలమును చేధరించి యొంటరిగ బయలుదేరి సాయంకాలమునకు గోదావరీతీరమందు శ్మశానములోని యోగి కుటీరమును బ్రవేశించెను. విక్రమాదిత్యునిఁ గాంచి యోగి పరమానందభరితుఁడై శ్మశానమందలి మఱ్ఱిచెట్టుక్రిందఁ గూర్చుండెను. ఆతనిచుట్టు భూతప్రేత పిశాచములు సంతసమున నృత్యము సలుపుచు అనేకవిధ వికటనాదములు చేయసాగెను. యోగి చర్మముగప్పిన తల పుఱ్ఱెను వాయింపఁజొచ్చెను. ఆ భయంకర దృశ్యమును గాంచి విక్రమాదిత్యుఁ డణుమాత్ర మైనను భయపడక యోగికి ప్రణామం బాచరించి యిట్లనియె. "మహాశయా! నే నొనర్పవలసిన కార్యమును సెలవిండు. అది యెట్టి దుర్ఘట కార్య మైనను సాధింతును".

యోగి:—మహారాజా! సత్పురుషు లాడినమాటఁ దప్పరు. మీ సత్యనిష్ఠకు నే నెంతయు సంతసించుచున్నాను. ఇప్పుడు మీ రొనర్పవలసిన కార్య మిది. ఇచ్చటికి దక్షిణ దిక్కున రెండు యోజనముల దూరమం దొకశ్మశాన మున్నది. అందలి శిరీషవృక్షమున నొక శవము వ్రేలాడుచుండును. దానిని మౌనముగ నిటకుఁ దీసికొని రావలయును.

అన, వెంటనే రాజు బయలుదేరెను. భాద్రపదమాసము, బహుళ చతుర్దశి, ఘోరాంధకారము. దట్టముగ మేఘము లల్లుకొని కుంభవృష్టి కురియుచుండెను. తీవ్రముగ గాలి వీచుచుండ మేఘము లుఱుముచుండెను. మెఱుపులు మెఱయుచుండఁ బిడుగులు పడుచుండెను. ఆ నిశీథిసమయమున నణుమాత్ర మైనను చలింపక విక్రమాదిత్యుఁడు నడచుచు ముందునకుఁ బోవుచుండెను. పోయిన కొలఁదిని భూతప్రేత పిశాచముల యుపద్రవము మిక్కుటము కాఁ జొచ్చెను. కాని వాని నణుమాత్రమైనను సరకుగొనక విక్రమాదిత్యుఁడు యోగి నుడివిన శ్మశానమును బ్రవేశించి శిరీష వృక్షమును సమీపింప నా వృక్ష మొక్కనిముసను తళ తళ ప్రకాశింపఁ జొచ్చెను. మరుసటి నిముసమున నంధకార బంధుర మగుచుండెను. వివిధవికటధ్వను లొక్కమారుగ జెలరేఁగెను. పిమ్మట చంపు, నఱుకు, చీల్చు - అను పల్కులు భయంకరముగ విననయ్యెను.

విక్రమాదిత్యుఁ డణుమాత్రమైనను జంకక, భయమొందక, శిరీష వృక్షమున తలక్రిందుగ వ్రేలాడుచున్న శవమును గాంచి, వెంటనే చెట్టెక్కి కరవాలమున చెట్టుకొమ్మకుఁ గట్టి

యున్న శవము కాలి త్రాటిని నరికెను. శవము క్రిందఁబడి మిక్కుట ముగ రోదనము చేయుచుండ విక్రమాదిత్యుఁ డాశ్చర్యాన్వితచిత్తుఁడై యా వృక్షమునుండి దిగి శవమును సమీపించి నీ వెవ్వరని ప్రశ్నింప శవము పక పక నవ్వుచు విక్రమాదిత్యుని చూచి యిట్లనియె. ‟మహారాజా! నీకీ దురవస్థ వచ్చుటకుఁ గారణమేమి?” అనఁగా రాజు మిక్కిలి యాశ్చర్యముఁబొందుచు నివ్వెరపడి చూచుచుండ నా శవము వెంటనే మీది కెగసి చెట్టున యథాప్రకారము వ్రేలాడఁ జొచ్చెను. అప్పుడు విక్రమాదిత్యుఁడు బేతాళుఁ డీశవమున ప్రవేశించి నిరుత్సాహపఱుపఁజూచుచున్నాఁడని తలఁచి వెంటనే వృక్షము నెక్కి శవము కాలికిఁ గట్టియున్న త్రాటిని నఱికి రెండవ చేత శవమును బట్టుకొని క్రిందికి దిగివచ్చెను. శవము నెన్ని విధములనో ప్రశ్నించెను. కాని ప్రత్యుత్తర మేదీ? అప్పుడు విక్రమాదిత్యుఁ డిది యక్షుఁడు చెప్పిన చంద్రభానుని శవము. ఇందు బేతాళుఁడు నివసించుచున్నాఁడని తలఁచి యా శవమును భుజముపై నిడికొని రెండవచేత ఖడ్గము దేదీప్యమానముగ వెలుంగుచుండ మహాపరాక్రమసంపన్నుఁ డగు విక్రమాదిత్యుఁడు బయలుదేర భూత ప్రేత పిశాచముల ఛీత్కారము లడంగెను. వర్ష మాగెను. మేఘములు విడిపోయెను. నక్షత్రములు మినుకు మినుకు మని వెలుంగఁజొచ్చెను. అప్పుడు పురుషసింహుఁడగు విక్రమాదిత్యుఁడు పదభరమున భూమి కంపించుచుండఁ గొంతదూర మేఁగు నప్పటికి శవ మిట్లనియె. ‟వీరాగ్రగణ్యా, నీ వెవ్వఁడవు? న న్నెక్కడకు – ఎందులకుఁ దీసికొని పోవుచున్నావు?”

విక్రమాదిత్యుఁడు. శీలుఁడను యోగి యాజ్ఞానుసా[illegible]నము నకుఁ దీసికొనిపోవుచున్నాను.

బేతాళుఁడు:-“మహారాజా! నీవు విక్రమాదిత్యుఁడవా? అటులయిన నీపరాక్రమమును విద్యాబుద్ధులును జగద్విదితములు గదా? బుద్ధిహీనులు మూర్ఖులు మొదలుగాఁ గల మానవులు వివాదలు - నిద్ర మొదలగువానితోడఁ గాలమును వ్యర్థపుచ్చుచుందురు. సత్పురుషు లుత్తమ ప్రసంగములతోడఁ గాలమును గడపుచుందురు. కావున మౌనముగ నడచుట ఉత్తమము కాదు. నేను నీకు కథలను చెప్పెదను. కథ ముగిసిన పిమ్మట నేనడుగు ప్రశ్నకు సరిగఁ బ్రత్యుత్తర మీయవలయును. వెంటనే నేను యథాస్థానమున కేఁగి శిరీష వృక్షమున వ్రేలాడుచుందును. తెలిసియుండియు సరియగు ప్రత్యుత్తర మీయవేని నీతల వేయి వ్రక్క లగును. నాకు నీయెడఁ దృష్టిగలిగినప్పుడు నీవెంట శ్మశానమునకు వత్తును.” అను నుడువులకు విక్రమాదిత్యుఁడు సమ్మతించెను. బేతాళుఁడు కథలఁ జెప్పుట కుపక్రమించెను.

మొదటి కథ

వారణాసి నగరాధినాథుని పేరు ప్రతాపముకుటుఁడు. ఆతని పట్టమహిషి పేరు మహాదేవి. ఆ రాజదంపతుల పుత్రుని పేరు వజ్రముకుటుఁడు. ఆతడు మంత్రి పుత్రుని మిక్కుటముగఁ బ్రేమించుచుండెను. ఒకదినమున వజ్రముకుటుఁడు మంత్రి పుత్రుఁడగు బుద్ధశరీరునితోడ వేఁటకు బయలుదేరెను. వారిద్వరరణ్యమందుఁ దిరిగి తిరిగి యనేక మృగముల వేటాడి చివర కొక

వృక్షమునకు గుజ్జములఁ గట్టిరి... స్నానమొనర్చెను. ఆ సరోవరమావలి గట్టున పరమేశ్వరుని దేవళ ముండెను. రాకొమరుఁడు స్నానమాచరించి శివుని మందిరమున కేఁగి పరమేశ్వరుఁ బూజించి తిరిగివచ్చునప్పటి కొక పరమసుందరియగు కన్యక చెలికత్తెలతోడ వచ్చి యా పుష్కరిణియందు స్నానమాచరించి పరమేశ్వరునిఁ బూజించి వకుళ వృక్షచ్ఛాయను నిలిచియున్న రాకొమరుని తదేకనిష్ఠతోడఁ దిలకింపఁజొచ్చెను. వజ్రముకుటుఁడు ఆ సుందరిని చూచి మోహావేశపరవశుఁడై తెప్ప వాల్పక చూడసాగెను. బుద్ధిశరీరుఁ డొకింత దూరమం దుండి యా విషయమును గమనించుచుండెను. ఆ పరమసుందరి చెలికత్తె లామెను తొందరచేసి యటనుండి తీసికొనిపోయిరి. ఆమె యేఁగునప్పుడు వజ్రముకుటునిఁ జూచుచు తలయందలి పద్మపుష్పమును చే ధరించి కర్ణములయందుఁ బెట్టుకొనెను. పిమ్మట దానిని పండ్లతో కొరకి క్రిందఁ బడవైచెను. క్రిందనున్న పుష్పమును వంగి తీసికొని వక్షస్థలమునం దదుముకొనెను. రాకొమరుని చూచుచు చెలులతో నటనుండి నిర్గమించెను.

వజ్రముకుటుఁడు రాజపుత్రిక కనులకుఁ గానవచ్చునంత వరకు చూచుచు నిలుచుండెను. కాని యామె కనుచూపులకు దూరమైనంతనే హతబుద్ధియై మంత్రిపుత్రుని సమీపించి యిట్లనియె. "నే నత్యంత సౌందర్యరాశియగు సుందరిం గాంచితిని. కాని చూచుచుండఁగనే యామె యటనుండి చెలులతోడ నిర్గమించినది. ఏమి చేయుదును? ఆమె పుట్టుపూర్వోత్తరములు నాకుఁ దెలియవు. ఆమెను నేను వివాహ

మాడవలయును. లేనియెడల మరణము తప్ప వేఱుమార్గము లేదు." అను విచారపూరిత వాక్యములను విని మంత్రిపుత్రుఁడు మనోగతాభిప్రాయమును వెల్లడింపక నాతని వెంట నిడుకొని కాశీపురమునకుఁ దిరిగివచ్చెను.

అప్పటినుండియు వజ్రముకుటుఁడు నిద్రాహారములను మాని మిత్రులతోనైనను మాట్లాడక మౌనియై మందిర మందొక గదియందు కాలము గడపుచుండెను మఱియు తాను వరించిన రాకొమరి చిత్తరువును చిత్రించి దానిని సమ్ముఖమం దుంచుకొని యహోరాత్రు లా పటమును సందర్శించుచుండెను. ఎవరెన్ని విధములఁ బ్రశ్నించినను బ్రత్యుత్తరము నీయకుండాయెను. బుద్ధశరీరుఁడు రాజపుత్రుని మనోవ్యథను బాపఁ బలువిధములఁ బ్రయత్నించి చూచెను. తిట్టెను. చీవాట్లు పెట్టెను. కాని లాభ మేమి? రాజపుత్రుఁడు మౌనమును వీడకుండెను. బుద్ధశరీరుని ప్రయత్నములన్నియు వ్యర్థములాయెను. ప్రియస్నేహితుని దుర్దశకు వగచుచు మంత్రిపుత్రుఁ డొక దినమున వజ్రముకుటునిఁ గాంచి యిట్లనియె. "మిత్రుఁడా! ఆ కన్యక బయలుదేరి యేఁగినప్పుడు నీతోడ మాట్లాడియుండెనా?"

వజ్రముకుటుఁడు:—నాతోడ మాట్లడలేదు, కాని సంకేత మొనర్చినది.

అని పద్మపుష్పమును తలనుండి తీసి కర్ణములయందుఁ బెట్టుకొనుట - దానిని పండ్లతోఁ గొఱికి క్రిందఁ బడవేయుట- దానిని దీసికొని వక్షస్థలమున నదుముకొనుట మొదలగు [illegible]ములను జెప్పెను. ఆ వృత్తాంతమంతయు విని మంత్రి

పుత్రుఁడు సంతసించుచు నిట్లనియె ''మిత్రుఁడా! ఏలచింతించె దవు? నే నాసంకేతార్థమును గ్రహించితిని. ఆ కన్యకపుట్టుపూ ర్వోత్తరములన్నియు గోచరించినవి. ఇఁక నీవు భయపడవలసిన పని లేదు. కొలది దినములలో నీ వామెను వివాహమాడఁగలవు. కావున చింతింపవలదు. బయలు దేరుము. ప్రథమముననే నా కా సంకేతములను చెప్పియుండిన యెడల నిదివరకే నీకు వివాహమై యుండెడిది. కానిమ్ము. ఆ కన్నియ తలయందలి పద్మపుష్ప మును కర్ణములయందుఁ బెట్టుకొనుటవలన ఆమె దేశము కర్ణో త్పల మహారాజు పాలించు కర్ణాట దేశ మనియు, పండ్లతో గొరు కుటవలన దంతఘాటునిపుత్రిక యనియు, వక్షస్థలమున నదుము కొనుటచేత నిన్నుఁ బ్రేమించితి ననియు, పద్మమును సంకేతార్థ ముపయోగించుటవలన పేరు పద్మావతి యనియుఁ జెప్పియున్నది. మిత్రుఁడా! కర్ణాటదేశాధీశుని పేరు కర్ణోత్పల మహారాజు. ఆతని సైన్యాధ్యక్షుని నామధేయము దంతఘాటుఁడు. దంత ఘాటుని పుత్రిక పేరు పద్మావతి యను విషయము నిదివఱకే నే నెఱుఁగుదును. కావున వేఁట నెపమున బయలు దేరుము.

వజ్రముకుటుఁడు బుద్ధశరీరుని వాక్యములు విని పరమా నందభరితుఁడై మరుసటిదిన ముదయముననే లేచి శస్త్రాస్త్ర ముల ధరించి మంత్రిపుత్రునితో బయలుదేరెను. వీరిద్దరు చెఱి యొక పంచకల్యాణి గుఱ్ఱము నెక్కిరి. ఆ యశ్వరాజ ములు వాయువేగ మనోవేగమునఁ బరువిడుచుండ ననేక పట్టణములను పల్లెల నతిక్రమించి కొలఁదిదినములలో కర్ణోత్పల మహారాజు రాజధానిని చేరి దంతఘాటునిమందిర సమీపమం దలి యొకముసలి దాసియింటి కేఁగిరి. ! ఆమె మీ రెవ్వ రని ప్రశ్నింప ''మేము వర్తకులము, వ్యాపారముకొఱకీపురము

నకు వచ్చితిమి." అన, వారి రూపరేఖావిలాసములం గాంచి యా వృద్ధదాసి మిక్కిలి సంతసించి వారి కాహార పానీయములం దృప్తికరముగ నొసంగెను. రెండు మూఁడు దినములు గడచిన పిమ్మట నామెకు కొంత ధనమిచ్చి వశపఱచుకొని ప్రసంగ వశమున మంత్రిపుత్రుం డిట్లనియె. "అవ్వా, మీ సంసార మందుండు జనసంఖ్య యెంత? మేము వచ్చినప్పటినుండియు నీవు మాత్రమే కనంబడుచున్నావు." అన వృద్ధదాసి యిట్లనియె. "నా కొకపుత్రుఁడు మాత్రము గలఁడు. ఆతనికి రాచ నగరునం దుద్యోగము. ప్రస్తుత మాతఁడు విదేశములయం దున్నాఁడు. రాజకార్యములు పూర్తియైనంతనే మరలివచ్చును. నేను సైన్యాధ్యక్షుం డగు దంతఘాటునిపుత్రిక పద్మావతికి దాసిని. వృద్ధనగుటవలన నిప్పుడు గృహమందే నివసించుచున్నాను. అయినను నాకుం గావలసిన భోజనపదార్థములను వా రిచ్చుచుందురు. ఇప్పటికిని పద్మావతి నన్ను మిక్కుటముగం బ్రేమించుచుండును. కావున దినమున కొకమా రామెను చూచి వచ్చుచుందును."

రాజపుత్రుం డిట్లనియె "అవ్వా! రేపు నీవు పద్మావతి కడ కేఁగునప్పుడు నాతోడం జెప్పుము. ఆమెకు నే నొక వార్తను చెప్పుదును."

దాసి:—సరే. మిక్కిలి యావశ్యకమగు కార్యముండిన చెప్పుము. ఇప్పుడే పోయి పద్మావతికిం జెప్పి వత్తును.

అను వృద్ధదాసివాక్యములకు వజ్రముకుటుఁడు మిక్కిలి సంతసించి కొంత ధనము నామెకు బహుమతి యొసంగి యిట్లనియె. "అవ్వా, పుష్కరిణియందు స్నానమాడి దేవుని

పూజించిన పిమ్మట పుష్కరిణియొద్దనఁ గాంచిన రాజపుత్రుఁడు నీ సంకేతానుసారము వచ్చియున్నాఁడని చెప్పుము.”



అన, నా వృద్ధదాసి వజ్రముకుటుఁ డొసంగిన ధనమును దాఁచుకొని సైన్యాధ్యక్షుని మందిరముఁ బ్రవేశించెను. అప్పుడు

పద్మావతి యొంటరిగఁ గూర్చుండియుండ వృ
"అమ్మా! నిన్ను చిన్నప్పటినుండియుఁ బెం
తిని. ఇప్పుడు నీకు యుక్తవయస్సు వచ్చిన
వివాహము జరుగును. నీవు సరోవర తట
త్రునిఁ గాంచి సంకేత మొనర్చి వచ్చియు
రుఁడు వచ్చి నాయింట బసచేసియున్నాఁడు
ముల నీకు తగిన వరుఁడు. నీ రూపలావణ్యాది
రూపలావణ్యవిలాసములు తూచిన ట్లున్నవి."

ఈ మాటలు వినినంతనే పద్మావతి కల్పితకోపము నభినయించుచు మంచి గంధమును రెండు చేతులకుఁ బట్టించుకొని వృద్ధదాసిచెంపలు వాయించి యంతఃపురమునుండి వెడలఁగొట్టెను. కాని యందలి రహస్య మా వృద్ధదాసి గ్రహించు టెట్లు? పద్మావతివలన నవమానింపఁబడి వృద్ధదాసి స్వగృహమునకు వచ్చి వజ్రముకుటునకు జరిగిన వృత్తాంతమంతయుఁ జెప్పెను. వజ్రముకుటుఁడు సంకేతమును గ్రహింపఁజాలక విచారించుచు బుద్ధిశరీరునిఁ జూచి యిట్లనియె. "మిత్రమా! ఇఁక నే నేమి చేయుదును? పద్మావతికి నిశ్చయముగ నామీఁద విరక్తి గలిగి యున్నది. లేనియెడల నేను పంపిన దూత నవమానించి తరిమివేయునా?" అన బుద్ధిశరీరుఁ డిట్లనియె. "స్నేహితుఁడా? జరిగిన విషయమును సరిగ గ్రహింపఁజాలక తొందరపడుచున్నావు. పద్మావతి మంచి గంధపుచేతులతోడ దాసి చెంపలు వాయించినది. అందువలన గంధపువ్రేళ్లు పదియు దాసి బుగ్గల మీఁదఁ గన్పించుచున్నవి. దీని యభిప్రాయ మేమన, ఇంకను పదిదినములకుఁగాని వెన్నెల రాత్రులు ముగియవు. ఆదినములు గడచిన పిమ్మట నిన్ను దర్శించుటకు వీలగు నని యామె

...న్నది. కావున తొందరపడకుము. పది దిన
...డుము. పిమ్మట నామెను వివాహమాడ

...కుటుఁడు సంతసించి దినమొక యుగముగ
...దినములు గడచెను. రాజపుత్రుని కోరిక
...సి పద్మావతికడ కేఁగి మరల రాకొమ
...ప్పను. అంత నామె మిక్కిలి కోపాన్వితయై
...వృద్ధదాసి మెడఁబట్టుకొని నెట్టుచు దిడ్డి వాకిలికడకుఁ దీసి
కొనివచ్చి వెలుపలకుఁ ద్రోసి తలుపు బిగించుకొనెను. ఆ వృద్ధ
దాసి మిక్కిలి మనోవ్యధ నొంది స్వగృహమున కేఁగి పద్మావతి
మెడఁబట్టుకొని వెలుపలకు నెట్టి తలుపు మూసికొనినదని నుడువ
వజ్రముకుటుఁడు విషణ్ణుఁడాయెను. ఈ ప్రయత్నము వ్యర్థమని
తలంచుచుండ బుద్ధిశరీరుఁ డిట్లనియె. "మిత్రుఁడా! సంకేతమును
గ్రహింపలేక విచారించుచున్నావు. ఇప్పటికి నీ మనోవాంఛ
సిద్ధించినది. ఈదినమురాత్రి దిడ్డిత్రోవను నిన్ను రావలయు నని
పద్మావతి సంకేత మొనర్చియున్నది."

అను నుడువులకు రాకొమరుఁడు మిక్కిలి సంతుష్ట
చిత్తుఁడై మంచి దుస్తులను ధరించి సూర్యాస్తమయముకొఱ
కెదురుచూచుచుండెను. సూర్యుఁ డస్తాచలము నధిష్ఠించెను.
గృహములయందు దీపములు వెలిఁగించిరి. బాల బాలికలు
మంగళ గీతములఁ బాడఁజొచ్చిరి. బ్రాహ్మణ వీథియందు వేద
గానము కర్ణగోచర మగుచుండెను. అప్పుడు రాకొమరుఁడు
భుజించి వివాహమునకుఁ దగువేష... ధరించి యొంటరిగ
బయలుదేరి పద్మావతీదేవియంతఃపురమున కున్న దిడ్డివాకిలి
కడ కేఁగెను. పద్మావతి తను వేషభూషణములు ధరించి ముఖ్య

లగు చెలులతోడ ద్వారముకడఁ గాచుకొనియుండెను. — కొమరుని దర్శించినంతనే యామె యంతఃపురమును బ్రవేశించెను. ఆమె సఖులు వజ్రముకుటుని సగౌరవముగ సత్కరించి యంతఃపురములోనికిఁ దీసికొని యేఁగిరి. రాకొమరుని గాంచి పద్మావతి లేచి నిలిచెను. ఆమె మెడయందు వజ్రముకుటుఁడు పూలహారమును వైచెను. పద్మావతీదేవి కుసుమమాలచే వజ్రముకుటుని కంఠసీమ నలంకరించెను. చెలులు మంగళగీతములఁ బాడిరి. అంత వజ్రముకుటుఁడు పద్మావతిహస్తమును బట్టుకొనెను. వివాహము పూర్తియయ్యెను.

తెల్లవారెను. వజ్రముకుటుఁడు స్వస్థానమునకు మరుగవలయు నని ప్రయత్నింపఁ బద్మావతి యిట్లనియె. "ఇది నా నిజమందిరము. ఇచ్చటికి నా ప్రియసఖులు తప్ప మఱి యెవ్వరును రారు. రాకూడదు. కావున నీ విచ్చట నిర్భయముగ నుండవచ్చును. నిన్ను విడిచి నే నొక్కనిముసమైనను బ్రతుకఁజాలను" అనుమాటల కంగీకరించి వజ్రముకుటుఁడు సంతసముగ నచటనే కాలము గడుపఁజొచ్చెను.

ఇట్లు కొన్నిదినములు గడచెను. వజ్రముకుటునకు వారణాసి కేఁగవలయు ననుతలంపు ప్రబలమాయెను. కాని పద్మావతి యంగీకరింపకుండెను. చేయునది యేమి? ఆమె యంగీకారమును బడయక బయలుదేరి వచ్చుట కిచ్ఛగింపక నచ్చటనే వజ్రముకుటుఁడు నివసించుచుండెను. ఇట్లుండ నెలదినములు గడచెను. రెండు నెలలు పూర్తియాయెను. అయినను రాకొమరుఁ డేఁగుటకు పద్మావతి సమ్మతింపకుండెను.

ఒక దినమున వజ్రముకుటుఁడు అంతఃపురము దొంటదరిఁ గూర్చుండి యిట్లు విచారింపఁ జొచ్చెను. "నేను నా

ధనుఁ డను. కాకున్న సామాన్య సుఖముకొఱకు తలిదండ్రుల వీడి జన్మభూమిని మరచి యిట నివసింతునా? బుద్ధశరీరుని క్షేమ సమాచారమే తెలియుట లేదు. అతఁడు నన్ను హీనముగఁ దలంపఁడా? స్వార్థపరుఁ డని యెంచఁడా?" అని యనుకొనుచు నిట్టూర్పు విడచుచుండ పద్మావతి యటకు వచ్చెను. వజ్రముకుటుని మనోభావమును గ్రహించి యిట్లనియె. "మహారాజా, మీరు మిక్కిలి విచారముగ నున్నటులఁ గాన్పించుచున్నారు. కారణమేమి?"

వజ్రముకుటుఁడు:—నే నిచ్చట యడుగిడి నప్పటినుండియు నామిత్రుఁ డగు బుద్ధశరీరుని క్షేమసమాచారముఁగూడ తెలియుట లేదు. అతఁడు నన్ను దుర్మార్గుఁడు, స్వార్థపరుఁ డని దలంచుటయం దాశ్చర్య మేమున్నది? తలిదండ్రులు నాకొఱకు బరితపించుచుందురు. కావున మిత్రునితోఁ గలిసి వారణాసి నగరమున కేఁగి తలిదండ్రులకు వందన మాచరింపవలయు నని యున్నది. నీ వంగీకరించిన యెడల బయలుదేరి యేఁగుదును. నా ప్రయాణమునకు సమ్మతింపుము. కొలఁది దినములలోఁ దిరిగి వత్తును.

పద్మావతి:—మిత్ర దర్శనమునకుఁ బరితపించుటయం దాశ్చర్య మేమున్నది? కాని మీ రిన్నిదినములుగ నాతని క్షేమసమాచారము దెలిసికొనకుండుట శోచనీయము. కాని నేను చేసిన సన్నలను మీరు గ్రహించితిరా లేక మీ చెలికాఁడు గ్రహించెనా?

వజ్ర:—నా మిత్రుఁడు గ్రహించెను.

పద్మావతి:—ఆ విషయము నింతవఱ కేల చెప్పకుంటిరి? మన యిరువురకు వివాహము సంఘటిల్లునట్లొనర్చిన యాబుద్ధ

విశారదమని తగువిధమున సత్కరింపవలదా? సత్కరింపకుండుట కృతఘ్నత గాదా? కాని మన వివాహవిషయము పరమరహస్యముగ నున్నది. అందువలన బుద్ధశరీరు నిటకు దోడ్కొని వచ్చి సత్కరించుటకు వీలులేదు. ఏమి చేయుదును? మీరీ దినము దీపములు పెట్టినంతనే వృద్ధదాసి మందిరమున కేఁగి బుద్ధశరీరునిఁ గాంచుఁడు. నేను స్వహస్తమున కొన్ని పిండివంటలను జేసి దాసిచేతఁ బంపుదును. వానిని మీ మిత్రుఁడగు బుద్ధశరీరున కొసంగుఁడు. కాని మీ రక్కడ గ్రుక్కెఁడు నీరైనను త్రాగవలదు. మీతోఁ గలిసి భుజింపకున్న నా కాఁకలి తీరదు. కావున ప్రథమయామము ముగియు లోపలనే మీ రిచ్చటకు తిరిగి రావలయును.

ఆ మాటలకు సంతసించి వజ్రముకుటుఁడు సూర్యుఁ డస్తమించినంతనే బయలుదేరి దిడ్డివాకిలి దాఁటి వృద్ధదాసి గృహమును బ్రవేశించెను. బుద్ధశరీరునిఁ గౌఁగిలించుకొనెను వారిర్వురు ప్రసంగమునకుఁ గడంగిరి. వజ్రముకుటుఁడు భార్య సద్గుణములను వర్ణించి చెప్పుచుండ పద్మావతీదేవిదాసి వివిధభక్ష్యములను బంగారుపళ్లెరమునఁ దీసికొనివచ్చి బుద్ధశరీరుని సమ్ముఖమందుఁ బెట్టి రాకొమరుఁ డిట్లనియె. "మిత్రుఁడా! మా యిరువుర వివాహమునకు నీవేగదా ముఖ్యకారకుఁడవు? అందువలన కృతజ్ఞతను వెల్లడించుటకు నాభార్య స్వహస్తమున సిద్ధముచేసి పిండివంటలు నీకుఁ బంపినది. వీనిని భుజింపుము. పద్మావతి మిక్కుటముగ సంతసించును. నీవు స్వయముగఁ జేసిన పదార్థములఁ దిని నామిత్రుఁడు మిక్కిలి సంతసించి శతముఖముల నిన్నుఁ బ్రశంసించె నని చెప్పుము."

అను మాటలు వినుచు బుద్ధశరీరుఁడా దాసికి సెలవొసంగ నది యటనుండి నిర్గమించెను. ఆ పదార్థములకేసి యొకింతవడి తిలకించి చేతఁబట్టి వాసనచూచి మరల యథాస్థానమందుంచి యిట్లనియె. "స్నేహితుఁడా! ఇవి యన్నియు విషమిశ్రితములు. కాని నీవు భుజింపకుండుట కెంతయు సంతసించుచున్నాను."

రాజపుత్రుఁడు:—పద్మావతి నీకొఱకేల విషమిశ్రిత పదార్థములఁ బంపును? అట్టి సందర్భ మేమున్నది? నీవు భ్రమపడుచున్నావు. ఆమె స్వయముగ వండి కృతజ్ఞతను వెల్లడించుటకు నీకుఁ బంపిన భక్ష్యములు ఇవి. దురభిప్రాయమును వీడి భుజింపుము. సంతసించెదను.

అని నుడువుచు బుద్ధశరీరుని సందేహనివారణముకొఱకు వానియందొక భక్ష్యపుముక్కను విఱిచి యటఁ దిరుగుచున్న పిల్లి ముందు పడవైచెను. దానిని తినినంతనే యాపిల్లి మరణించెను. అదిచూచి వజ్రముకుటుఁడు క్రుద్ధుఁడై శరీరము గజగజ వడఁకుచుండ 'మిత్రమా! అది ఘోరరాక్షసి. దానిపేరు విన్నను, దానిని గాంచినను మహాపాతకము చుట్టుకొనును. దానితోడి సంబంధమును వదలుకొనుచున్నాను.'

బుద్ధశరీరుఁడు:—మిత్రుఁడా! అట్లు ప్రతిజ్ఞ చేయకుము. వెంటనే పరిత్యజించుటవలనఁ బ్రయోజనమేమి? ఏదియో యొక మహోపాయమున నామెను మన రాజధానికిఁ దీసికొని పోవుదము. నే నిక్కడనుండిన యెడల నిన్ను స్థిరముగ నిటనుండనీయ దనియు, నావలనను వృద్ధదాసివలనను నీ రహస్యము బయల్పడు ననియు పద్మావతి యిట్లొనర్చినది. నీమీఁద నుండు

గాఢప్రణయమే యిందులకుఁ గారణము. కావున నీవు మరల నంతఃపురమును ప్రవేశించి మనోభావము నాకు మాత్ర మైనను దెలియనీయక "నీవు పంపిన భక్ష్యములఁ దిని నామిత్రుఁడు సుఖముగ నిద్రించుచున్నాఁ" డనిచెప్పుము. మఱి యు నిన్ను విడిచియుండఁజాలక వెంటనే తిరిగి వచ్చితి నని చెప్పి హాయిగ భుజించి యామెకొకింత మత్తు పదార్థము నిచ్చి నిదు రించునప్పుడు పద్మావతి నగ లన్నియు సంగ్రహించుకొని కుడి పాదమున త్రిశూల చిహ్నమును సన్నని వాతవేసి వెంటనే తిరిగి రమ్ము తదనంతరము జరుగవలసిన కార్యమునుగూర్చి విచారింప వచ్చును."

బుద్ధశరీరుని యీవాక్యములకు సమ్మతించి వజ్రము కుటుఁడు పద్మావతీదేవి సౌధమును బ్రవేశించెను. బుద్ధశరీరుని యుపదేశానుసార మచ్చట నానందముగ నుండి గాఢనిద్దుర యందున్న పద్మావతినగల నన్నిటిని దీసికొని యామె కుడిపాద మున త్రిశూలచిహ్న మగు గుర్తువేసి యా రాత్రియే వృద్ధదాసి గృహమునకు వచ్చి జరిగిన వృత్తాంతమంతయు బుద్ధశరీరునకుఁ జెప్పి నగలఁ జూపించెను.

తెల్లవారుజామున లేచి వారిద్దరు నూరి బైట నున్నకాళీమందిరమును జేరి సన్యాసివేషములఁ దాల్చిరి. బుద్ధశరీ రుఁడు గురువాయెను. వజ్రముకుటుఁడు శిష్యుఁడాయెను. సూర్యుఁ డుదయించెను. ఆ మార్గమున వచ్చుచుఁ బోవుచుండువారు సైన్యాధ్యక్షుని పుత్రికయగు పద్మావతినగలు దొంగలు హరించి రనియు, రాజపుత్రుఁ డాకస్మికముగ మరణించె ననియుఁ జెప్పు కొనఁజొచ్చిరి. అప్పుడు గురువు శిష్యునిఁ జూచి యిట్లనియె.

‘.వత్సా, ఇందు కొన్ని నగలఁ దీసికొనిపోయి పట్టణములోని వర్తకుల కమ్మఁ జూపుము. నిన్నెవరయిన దొంగ యని పట్టుకొనినయెడల వారిని నాకడకుఁ దీసికొనిరమ్ము.”

వజ్రముకుటుఁడు కొన్ని కంఠహారములఁ దీసికొని బంగారు వర్తకులకడ కేఁగి విక్రయమునకుఁ జూపుచుండ రాజభటులువచ్చి చుట్టుకొని యీ నగ లెక్కడివని ప్రశ్నించిరి. అప్పు డాతఁడు “నా గురువర్యుఁడు నా కిచ్చి విక్రయించుకొని రమ్మన నే నిటకు వచ్చితిని. కాని వీని పుట్టు పూర్వోత్తరములు నాకుఁ దెలియ” వనుచుండఁ గొందఱు కంసలబత్తులు అవి పద్మావతి నగ లని గుర్తుపట్టిరి. వెంటనే యీ సమాచారమును విని నగరపాలకుఁడు వచ్చెను. ఆతఁ డీసన్యాసిని వెంటనిడుకొని కాళీ మందిరమున కేఁగి యచ్చట పద్మాసనాసీనుఁడై యున్న బుద్ధిశరీరుని యోగి యని తలఁచి సాష్టాంగ ప్రణామం బాచరించి సవినయముగ ‘‘యతీశ్వరా! ఈ నగలు తమ కెచ్చట లభించినవి?” అని ప్రశ్నించెను.

కపట సన్యాసి పక పక నవ్వుచు నిట్లనియె. “నగరపాలకా! నిన్న సాయంత్రము మే మిక్కడకు వచ్చితిమి. రాత్రి రెండవజామున పనేకులు స్త్రీ లిటకు వచ్చి కల్లు త్రావి శరీరములు మరచి గందరగోళము చేయుచుండిరి. అం దొకస్త్రీ రాకొమరుని గుండెకాయలఁ దెచ్చి భైరవునకు నైవేద్యము పెట్టి భక్షించి కల్లు త్రావి మిక్కిలిగ చిందులు ద్రొక్కుచు నామెడయందలి రుద్రాక్షమాలను గైకొనవలయునని యత్నించెను. నా కప్పుడు కోపము వచ్చి యోగబలము వలన దానికాలియందు త్రిశూలచిహ్న మగు వాతను వేసి

యామె శరీరమందలి నగలనన్నిటిని లాగుకొని యటనుండి పాఱి దోలితిని. నా కిప్పుడు ధనము కావలసియుండి యందుఁ గొన్నిటిని నా శిష్యునిచేత విక్రయమునకుఁ బంపించితిని.”

ఈ వృత్తాంతమును వినుచున్న నగరపాలకుఁడు ఆశ్చర్యాన్వితచిత్తుఁడై రాజుకడ కేగి యోగి చెప్పిన విషయములను సవిస్తరముగ విన్నవించెను. శోకాకులుఁడై యున్న రాజు నగరపాలకుఁడు చెప్పిన విషయమును విని సందేహించుచు, నొక వృద్ధదాసిని బిలిచి పద్మావతి కుడిపాదమున త్రిశూల చిహ్నమగు వాత గలదేమో చూచివచ్చి చెప్పుమని పంపించెను. వృద్ధదాసి పద్మావతి పాదములను బరీక్షించి తిరిగి వచ్చి త్రిశూలచిహ్నమగు వాత కల దని నుడివెను. అప్పుడు రాజు పద్మావతి మానవరూపమున నున్న ఘోరపిశాచ మని నమ్మి రాజపుత్రుని మృత్యువున కదియే కారణ మని నిశ్చయించుకొని కాళీమందిరమందున్న కపటసన్యాసి కడ కేగి సాష్టాంగ నమస్కార మాచరించి యిట్లనియె. “యతికుల తిలకా, పద్మావతి కెట్టి దండనను విధింపవలయునో సెలవిండు?” అన సన్యాసి యిట్లనియె. “మహారాజా! స్త్రీ లెట్టి ఘోరకార్యము లొనర్చినను వధింపరా దని శాస్త్రములయందు చెప్పఁబడియున్నది. కావున పద్మావతి నడవియందు విడిపింపుఁడు. అచ్చట నీ యిలువేల్పు లామెను మారణహోమ మొనర్తురు.” అని నుడువ రాజు కపటసన్యాసి కడ సెలవు గైకొని పద్మావతి నరణ్యములయందు విడిచి రావలయు నని నగరపాలకున కాజ్ఞాపించెను. వెంటనే భటులు పద్మావతిని పల్లకి యందుఁ గూర్చుండఁబెట్టుకొని యొక మహారణ్యమునకుఁ దీసికొని పోయి విడిచివచ్చిరి.

వజ్రముకుటుఁడును, బుద్ధశరీరుఁడును రహస్య స్థలమున గట్టియున్న గుఱ్ఱముల త్రాళ్లు విప్పి వానిమీఁద నెక్కి పద్మావతిని వెదకుచు బయలుదేరి ఘోరారణ్యమందొక వృక్షము క్రిందఁ దల విరియఁబోసికొని విలపించుచున్న పద్మావతిని సమీపించిరి. అనేక విధముల నోదార్చిరి. అందువలన నామె దుఃఖము కొంతవఱకుఁ దరిగెను. వజ్రముకుటుఁడు పద్మావతిని గుఱ్ఱముమీఁద నెక్కించుకొనెను. బుద్ధశరీరుఁడు గుఱ్ఱము నెక్కెను. వారు కొలఁదిదినములలో వారణాసి కేఁగిరి. రాజదంపతులు పుత్రుని పుత్రవధువును గాంచి పరమానంద భరితులై యాశీర్వదించిరి. రాజమందిరమును, వారణాసిపురమును ఆనందోత్సవములతో నిండెను.

కథను ముగించి బేతాళుఁ డిట్లనియె, "మహారాజా! ఇందు పాప మొనర్చినవాఁ డెవ్వఁడు? రాజా? బుద్ధశరీరుఁడా?

విక్రమాదిత్యుఁడు:—రాజు.

బేతాళుఁడు:—ఎందువలన?


విక్రమాదిత్యుఁడు:—శత్రువును వధించుట పాపముగాదని శాస్త్రములు చెప్పుచున్నవి. పద్మావతి బుద్ధశరీరుని చంపుటకు విషమిశ్రిత పదార్థములను బంపించెను. అందువలన బుద్ధశరీరుఁడు పగఁదీర్చుకొనుట కట్లొనర్చియున్నాఁడు. అందువలన నాతనియందు దోషము కానరాదు. కాని రాజు చక్కఁగఁ బరిశీలింపక యెవని మాటలనో నమ్మి దేశమునుండి పద్మావతిని వెడలఁగొట్టించెను. ఇట్లు నడచుకొనుట రాజధర్మమునకు విరుద్ధము. అందువలన రాజు దోషి; పాపి.

కాని విక్రమార్కునికి మానభంగ మైనంతనే భేతాళుఁడు తిరిగి శ్మశానమున కేఁగి శింశుపావృక్షమున వ్రేలాడఁ జొచ్చెను. మహాపురుషులు పట్టినపట్టు విడువరు గదా! వెంటనే విక్రమాదిత్యుఁడు వెనుక కేఁగి వృక్షమెక్కి శవముకాలిబంధముల ఖడ్గమున నఱికి యా శవమును బుజముమీఁద వేసికొని బయలు దేరెను. అప్పుడు బేతాళుఁడు విక్రమాదిత్యుని మౌనమును జెఱుచుటకు నీ క్రింది కథను జెప్పఁదొడఁగెను.

2-వ కథ

మహారాజా! యమునానదీతీరమందు బ్రహ్మస్థల మను నొకనగరము గలదు. అందు అగ్నిహోత్రుఁడను బ్రాహ్మణుఁడు నివసించుచుండెను. అతఁడు పరమధార్మికుఁడు, సత్యసంధుఁడు. అతని కొక్క పుత్రిక గలదు. పేరు మందారవతి. ఆమె సౌందర్యమున నద్వితీయయై యలరారుచుండెను. యౌవనము ప్రాప్తించునప్పటి కామె సౌందర్యము వేయిరెట్లు పెరిగెను. ఆ కన్నియను తగిన వరున కిచ్చి వివాహ మొనర్పవలయు నని తలిదండ్రులు మిక్కుటముగఁ బ్రయత్నించుచుండిరి. ఆ బ్రాహ్మణుఁ డొకదినమునం దొక వివాహమును వీక్షింపవలయు నని మఱియొక గ్రామమున కేఁగెను. అతని పుత్రుఁడుగూడ చదువుకొనుటకు నుపాధ్యాయుని గృహమునకు వెడలెను. ఇంటియందు మందారవతియు నామె తల్లియుమాత్ర ముండిరి. త్రివిక్రముఁడను బ్రాహ్మణయువకుఁ డతిథిగ వచ్చెను. అతనిని తగువిధమున సత్కరించి భోజనముపెట్టిరి. అతని రూపలావణ్యములను, విద్యాబుద్ధులను, వినయవిధేయతలను గాంచి యగ్నిహోత్రుని భార్య సంతృప్తహృదయయై యాతని కులగోత్ర

ములనడిగి తెలిసికొనెను. ఉత్తమబ్రాహ్మణ వంశ సంజాతుం
డని యెఱింగి మిక్కుటముగ సంతసించెను. పిమ్మట యువకుని



చూచి యిట్లనియె. “వత్సా! నీకు సమ్మతమైన యెడల సంపా
పతిని నీ కిచ్చి వివాహ మొనర్తు” ననెను.

త్రివిక్రముఁడు మందారవతి నదివఱకే చూచియుండుటవలన వివాహమాటకంగీకరించి ఆనందముగ నగ్ని హోత్రునికొఱకు నిరీక్షించుచు వారింటనే యుండెను. వారముదినములు గడచిన పిమ్మట నగ్నిహోత్రుఁడు మందారవతి నిచ్చి వివాహమొనర్చెద నని చెప్పి వామనుఁడను పేరు గల బ్రాహ్మణ యువకుని వెంట నిడుకొని వచ్చెను. మరుసటి దినమున నాతని పుత్రుఁడు మధుసూదనుఁడను వానిని దీసికొని వచ్చెను. ఒక్క పుత్రికకు మువ్వురు వరులు. ఇం కెవ్వరికిచ్చి మందారవతిని వివాహమొనర్చుట? ఎవరిని కాదనుట? ఆమువ్వురును విద్యాబుద్ధులయం దేమి, వినయ విధేయతలం దేమి, రూపరేఖావిలాసములయం దేమి, యొకనిని మించి మఱియొకఁ డుండెను. అగ్నిహోత్రుఁడు మిక్కిలి సంకటపడఁ జొచ్చెను. ముగ్గురిని పిల్ల నిచ్చెద నని పిలుచుకొని వచ్చిరి. చేయవలసిన దేమి?

అగ్నిహోత్రుని భార్య కెవ్వన కేకవైచి మందారవతిని పాము గఱచిన దని యఱచెను. మందారవతి నురుఁగులు గ్రక్కుచు క్రిందఁబడిపోయెను. అగ్నిహోత్రుఁడు మొదలగు వారు పరువిడి విషవైద్యులను బిలుచుకొనివచ్చిరి. కొందఱు మంత్రించిరి. మఱికొందఱు కుప్పె లరుగఁదీసి గొంతునఁ బోసిరి. కాని ప్రయోజనం బేమి? మంత్రములు వ్యర్థమాయెను. మందులు ఫలింపకుండెను. చూచుచుండఁగనే మందారవతి మరణించెను. ఆ తలిదండ్రుల దుఃఖమును వర్ణించుటెట్లు? సోదరుఁడు దుఃఖమువలన క్రిందఁబడిపోయెను. కొంతవడికిఁ దెప్పరిల్లి యాముగ్గురువరులును తండ్రియు పుత్రుఁడును గలిసి మందారవతిశవమును శ్మశానమునకుఁ దీసికొని వెడలి దహనమొనర్చిరి.

ఆ ముగ్గురకు నత్యంత వైరాగ్యము కలిగెను. త్రివిక్రముడు మందారవతి యస్థికలఁ దీసికొని బయలుదేరి యాయాదేశములు తిరిగి చివరకు వానిని గంగాభవాని కర్పించెను. వామనుఁడు విరాగియై దేశ విదేశముల సంచరింపసాగెను. మధుసూదనుఁడు మాత్రము శ్మశానమందే యొక కుటీరమును నిర్మించుకొని యందు మందారవతి భస్మమును ప్రోగుచేసికొని దాని సమ్ముఖమునఁ గూర్చుండి తపమాచరింపఁజొచ్చెను.

వామనుఁడు తిరిగి తిరిగి పాంచాలదేశమునం దొక గ్రామమును జేరి యొక బ్రాహ్మణుని గృహమును బ్రవేశించెను. ఆ గృహాధిపతి లేకున్నను గృహిణి యతిథి నుచిత రీతిని సత్కరించి యిట్లనియె. ‹‹మహాశయా, భోజనము సిద్ధమైనది. లేచి భుజింపుఁడు.” వామనుఁడు లేచి స్నానసంధ్యాద్యను ష్ఠానముల నిర్వర్తించుకొని విస్తరిముందు కూర్చుండి భుజింపఁజొచ్చెను. ఆమె కావలసిన పదార్థము లడిగి వడ్డించుచుండెను. అయిదు వత్సరముల వయసు గల యామె పుత్రుఁడు విపరీతముగ నల్లరిచేయఁ జొచ్చెను. భయపెట్టినను బుజ్జగించినను వినకుండుటచేత విసిగి వానిని దీసికొని యెత్తి గబ గబ నుండుచుండిన పొయ్యియందుఁ బడవైచెను. నిమేషకాలమున నా బాలుఁడు భస్మమాయెను.

ఆ ఘోరకృత్యమును గాంచి వామనుఁడు నిర్విణ్ణుఁడై దిక్కు తోఁచక చూచుచు భుజింపక లేవఁ బ్రయత్నించుచుండ గృహిణి యిట్లనియె. “మహాశయా! తాము భుజింపుఁడు. నివ్వెరపడి చూచుచున్నా రేమి?” అను ప్రశ్నకు వామనుఁ డుగ్రుఁడై యిట్లనియె. “నీవు మహా రాక్షసివి. ఇట్టి రాక్షసకృత్యమును

గల్గియున్న మంత్ర...

శ్లోకములఁ బఠించి యా మం...

జల్లెను. వెంటనే యా బాలుఁడు ప్రాణ...

మెప్పటివలె గందరగోళము చేయసాగెను.

వానిని గాంచినప్పుడు వామనుఁడు పొందిన యాశ్చర్యమును వర్ణించు టెట్లు? పిమ్మటఁ జక్కఁగ భుజించి కొంత శయనించి యిట్లు యోచింపఁజొచ్చెను. "ఆ గ్రంథమంత్రోపదేశమువలన మరణించిన వారలను బ్రతికింపవచ్చు కావున దీనిని సంగ్రహించి మందారవతిని బ్రతికించి వివాహమాడుదును". అని యనుకొనుచు శాంతముగ నా పూట యచ్చటనే యుండి రాత్రి యామె యొసంగిన యాహారమును భుజించి శయనించెను. రెండవ యామమున నెల్లరు నిదుర వోవుచుండు సమయమున వామనుఁడు నెమ్మదిగ లేచి గ్రంథమును దీసికొని పలాయనము చేసెను.

వామనుఁడా గ్రంథము చేఁజిక్కినంతనే నిద్రాహారములు మాని రాత్రింబవళ్లను భేదమును పాటింపక నడచి కొన్ని దినములకు బ్రహ్మస్థల మను పట్టణమును జొచ్చి శ్మశానమున కేఁగెను. ఆతఁ డచటి కేఁగిన కొంతవడికి త్రివిక్రముఁడుగూడ వచ్చెను. అప్పుడు వామనుఁడు మధుసూదనుని ఆ భస్మరాశికి దూరమం దుండవలయు నని చెప్పి యా గ్రంథమును ...చి మంత్రోదకమును భస్మముమీఁదఁ బోసెను. ఆ భస్మ

దిత్యుని సం
మందు మందారవతిని వివా
డిన విక్రమాదిత్యుఁడు మౌనమును
యె. శ్మశానమందు కుటీరమును నిర్మించుకొనిన
దనుఁడు మందారవతిని వివాహమాడుట కర్హుఁడు.
మున తలిదండ్రుల అస్థులను గంగయందుఁ గలుపువాఁడు
కావున త్రివిక్రముఁడు మందారవతియస్థికలను గం
ఁ గలిపెను. అందువలన నాతఁడు మందారవతికిఁ బుత్ర
ల్యుఁడు. నదానం బొసంగుటవలన వామనుఁడు పిత్రు
ల్యుఁడు. మధుసూదనుఁడు శ్మశానమందే నివసించి యా
భస్మరాశినిఁ గాపాడుచుండుటవలన మందారవతిని వివాహ
మాడుట కర్హుఁడు..

ఈ ప్రత్యుత్తరమునకు బేతాళుఁడు సంతసించి తిరిగి పోయి యథాస్థానమున వ్రేలాడఁ జొచ్చెను. విక్రమాదిత్యుఁ డేగి యాశవమును బుజముపై నిడుకొని నిర్భయముగ బయలు దేరి నచ్చుచుండ బేతాళుఁడు విక్రమాదిత్యుని మౌనమును చెడఁగొట్టుటకు మఱియొక కథ నీక్రింది విధమునఁ జెప్పెను.

3-వ కథ.

మహారాజా, శోభావతీనగరాధినాథుని పేరు రూపసేనుఁడు. అతఁడు మహావిద్వాంసుఁడు, ధార్మికుఁడు, బాహుబలసమన్వితుఁడు. ఆతనిపరిపాలనమున ధర్మము నాలుగు పాదముల

నడచుచుండెను. ఒకదినమున వీరవరుఁడను పేరుగల రాజపుత్రుఁడొక్కఁడు మొలను కటారియు, చేత డాలును, రెండవచేత ఖడ్గమును ధరించి రాజు కొల్వుకూటము ప్రవేశించి వందన మాచరించెను. ఆతనిఁ గాంచి భూపసేనుఁ డీతఁడు కార్యనిర్వహణదక్షుఁ డని తలంచి యిట్లనియె. "వీరాగ్రగణ్యా, నీ కేమి కావలయును?"

వీరవరుఁడు: దినమున కయిదునూర్ల వరహా లిచ్చిన యెడల తాను రాజ్ఞాపించు కార్యములను నిర్వర్తింపుచుందును.

రాజు:—మీ సంసారమందు జన సంఖ్య యెంత? మిక్కుటముగ వేతన మడుగుటకుఁ గారణమేమి?

వీరవరుఁడు: నాకొక పుత్రికయుఁ బుత్రుఁడును గలరు. భార్యాభర్తల మిర్వురము. మొత్తము మా కుటుంబమున నల్వురము. కాని దానధర్మము లొనర్చుటకు నాకు ధనము మిక్కుటముగఁ గావలయును.

ఈ విషయమును విని రాజు మనమునఁ దిట్లు భావింపఁ జొచ్చెను. "ఈతని సంసారమందుండువారు నల్వురు. ఇంత యధికముగ వేతనమును గోరుటకుఁ గారణమేమి? దానధర్మములా? ఈతఁడు విశేషగుణసమన్వితుఁడును క్షమాశాలియు నై యుండవచ్చును. కావున నీతని శక్తి సామర్థ్యములఁ బరిశీలించుట యుక్తము." అని యోచించి ద్వారరక్షకునిగ నియమించెను. ఆదినము సాయంకాలమాతని కైదువందల వరహా లిచ్చెను. వానిని గైకొని యందర్ధభాగము బ్రాహ్మణ పండితులకు దానముచేసి మిగిలిన సగము మొత్తమును బీద సాదల భోజనమునకు ఖర్చుపెట్టఁగా మిగిలినదానితోడ వారు

భుజించిరి. వీరవరుఁడు ప్రతిదిన మీ విధముగనే చేయుచుం డెను. రాత్రులు రాజమందిరద్వారమును నిర్భయముగఁ గాపాడుచుండెను. ఈతని మహోదారతను గాంచి రూప సేనుఁ డాశ్చర్యమును బొందుచు వీరవరుని శక్తి సామర్థ్యము లను సాహస విక్రమములను బరీక్షించుటకుఁ బలువిధము లగు క్లిష్ట కార్యములయందు నియోగించుచుండెను. కాని యెట్టి కార్యమునైనను త్వరలో నాతఁడు నిర్వర్తించుచుండెను.

ఒక దినము రాత్రి రూపసేనుఁ డంతఃపురమున నిదురిం చుచు స్త్రీ యాక్రందనమును విని యులికిపడి లేచెను. ఆ రోద నము దక్షిణదిక్కునుండి వినఁబడఁగా రాజు ద్వారపాలకుఁడగు వీరవరునిఁ బిలిచి యా వృత్తాంతమును కనుఁగొని రావలయు నని చెప్పెను. వీరవరుఁడు ఆ క్రందనమును లక్ష్యముం దుంచుకొని దక్షిణదిక్కున బయలుదేరి యొక శ్మశానమును బ్రవేశిం చెను. ఆతని శక్తి సామర్థ్యములఁ దిలకింపవలయు నను తలం పున రాజు రహస్యముగ వీరవరుని వెనుకనే చనుచుండెను. వీరవరుఁడు శ్మశానమును బ్రవేశించి యేడ్చుచున్న స్త్రీని గాంచి విస్మయచిత్తమున నిట్లనియె "అమ్మా, నీ వెవ్వరు? రాత్రియం దిచ్చటి కేలవచ్చితివి? రోదన మొనర్పఁ గారణ మేమి?" అను ప్రశ్నల కామె ప్రత్యుత్తర మీయక బిగ్గరగ నేడ్వఁ జొచ్చెను. వీరవరుఁడు కారణము తెల్పుమని సవినయ ముగఁ బ్రార్థింప నామె యిట్లనియె: "రూపసేన మహారాజు ధర్మస్వరూపుఁడు. ఆతనిపరిపాలనమున ధర్మము నాలుగు పాద ముల నడచుచున్నది. ప్రజలపాలిటి కాతఁడు కల్పతరువు; బీదలకు పెన్నిధి. కాని యాతని కీమూఁడవ దినమున మర ణము తప్పదు. అందువలన నీతగా వగచుచున్నాను. నేను

రాజ్యలక్ష్మిని. అతఁడు మరణించినంతనే యీ దేశమును నేను వీడుదును. పెద్దమ్మ ప్రవేశించును. అప్పుడు ప్రజల దుఃఖమున కంతముండదు."

అనుమాటలు వినుచున్న వీరవరుఁడు మిక్కిలిగ దుఃఖించుచు చేతులు జోడించుకొని యిట్లనియె. "దేవి రాజ్య లక్ష్మి, నీవు చెప్పిన విషయమునందు నా కణుమాత్రమైనను సందియము లేదు. రాజు మృత్యు ముఖమున బడకు ండుట కేదయిన మార్గముగలదా? ఉండినచో చెప్పుము. ప్రాణము లర్పించుటకుఁ గూడ నేను సంసిద్ధుఁడను. ధర్మాత్ముఁడగు రాజు జీవించి యుం-డిన చాలును."

రాజ్య లక్ష్మి: అటులయినచో వినుము. ఈ
తూర్పు దిక్కున క్రోసెఁడు దూరము
మున్నది. ఆ దేవికి నీపుత్రుని స్వహ
రాజు మరణము తప్పును.
జీవించును.

అంతట వీరవరుఁడు
నుండి తీవ్రగమనమున
మరణవిషయమును మర
వలయు నను తలంపున
ద్వారముకడ 'నిలిచియు
కేఁగి రాజ్యలక్ష్మి
భార్యతోఁ జెప్పెను.
పుత్రుని లేపుము భ
మనము కోరఁదగిన

వలన మన ప్రభువునకు నూఱు వత్సరము లాయుర్దాయ
మభివృద్ధియైనయెడల నా కల్పవృక్షము నీడను లక్షల
కొలఁది మానవులు హాయిగ జీవింతురుగదా. కావున రాజును
మృత్యుగ్రస్త వాతఁ బడకుండ రక్షించుటయే మనకు పరమ
ధర్మము." అనుచుండ పండ్రెండు వత్సరముల బాలుఁడు లేచి
కూర్చుండెను. ఆతనికి వీరవరుఁడు సంగతిసందర్భములఁ జెప్ప
నాతఁ డిట్లనియె. "మన రాజునకు నూఱు వత్సరము లాయు
ర్దాయము పెరుగునెడల నా శరీరమును తృణప్రాయముగ నర్పిం
...ను. ఇంతకాలెను నే నొనర్పఁదగిన పుణ్యకార్య మేము
... ఈ శరీర మాయున్ధనమువలనఁగదా పెరిగినది.
...న నాతనికొఱకు దీని నర్పించుటకు యోచింపవలసిన
...మెందులకు? చండీ గృహమునకు బయలు

...ములు విన్న వీరవరుఁడు ఆశ్చ
...మానముగ నుండి భార్యకేసి
...కు చండీదేవాలయమునకు
...ది వత్సరముల వయసుగల
...ు వారివెంటనే రహస్య
...ప్రభుభక్తికిని సంతసించుచు
...కుతూహలమున నడచు

...ల్లరును దేవ మందిర
...పూజించి సాష్టాంగ
...ను. "అంబా, జగ
...ంపుము. స్వహస్త

నులు నా పుత్రుని నీ కర్పించుచున్నాను. తృప్తినొందుము. నా ప్రభువునకు ఆయురారోగ్యములను నైశ్వర్యమును ప్రసాదింపుము." అని లేచి ఖడ్గము నెత్తినంతనే యాబాలుఁడు కరములుమోడ్చి "తల్లి నన్నుఁ గైకొనుము. నా ప్రభువున కాయుర్దాయ మొసంగుము." అని నమస్కరింప వీరవరుఁడు పుత్రుని శిరమును ఖండించెను. అతని పుత్రిక యా దుఃఖముం జూచి సహింపఁజాలక వెంటనే యచటనున్న ఖడ్గముతోఁ దల ఖండించుకొని పడిపోయెను. వీరవరుని భార్య పుత్రి పుత్రికల మరణమును గాంచి ప్రాణములు విడిచెను. అప్పుడు వీరవరుఁ డీభయంకర దృశ్యమును జూచుచు కన్నులు నీటితో నిండి గిఱ్ఱునఁ దిరుగుచుండ "ప్రభుకార్య ముద్ధరించితిని. ఇందు వలన ప్రభువు చిరాయుర్దాయమును బడసి ధర్మపథమున ప్రజాపాలనం బొనర్చును. ఇఁక నా జీవితముతోడఁ బ్రయోజనం బేమి? ఆలుబిడ్డలు మడిసిరి". అని యనుకొని నిజఖడ్గమునఁ బొడుచుకొని దేవి సమ్ముఖమునఁ బడిపోయెను.

రాజు వరుసగా నల్వురు మరణించుటంగాంచి నిర్విణ్ణుఁడై రాతి విగ్రహమునుబోలి కొంతసడి కదల మెదలక నిలుచుండి యిట్లు భావించెను. "నాకు రాజ్యమేల? ఆయుర్దాయమేల? నేను స్వార్థపరుఁడను; స్వార్థాంధుఁడను, కాకున్న నల్వురొక్క త్రుటిలో మరణించుటను చూడఁగలనా? వీరవరుని పుత్రుని వధింప వల దని యేల నుడువనైతిని? ఆత్మహత్యనుండి య[illegible] నేల దప్పింపనైతిని. కావున నేను మహాపాతకుఁడను[illegible] పాతకుఁడను. ఈ పాతకమునకుఁ బ్రాయశ్చిత్త[illegible] చుటయే ప్రాయశ్చిత్తము" అని దలంచి [illegible] లాగి దేవికి నమస్కరించి శిరమును [illegible]

మొత్తి మహాభయంకరరూపిణియగు చండి ప్రత్యక్షమై రాజు చేతనిఁ బట్టుకొని యిట్లనియె. "వత్సా? నీ సాహసమున కెంత యు సంతసించితిని. సంతుష్ట చిత్తనైతిని. కావున నీకేమి కావల యునో కోరుము" అన రాజు దేవికి సాష్టాంగ ప్రణామం బొనర్చి యిట్లనియె. "అంబా, జగదంబా, ఈ మరణించిన నల్గురను బ్రతికింపుము." అనఁగా దేవి "తథాస్తు" అనెను. వెంటనే వారు నల్వురును లేచి నిలిచి దేవికి నమస్కరించిరి. అప్పుడు దేవి తిరిగి యిట్లనియె. "వత్సా, వీరవరా, నీ త్యాగమునకును, ప్రభుభక్తికిని యెంతయు సంతసించితిని. నీకేమి కావలయునో కోరుము" అన వీరవరుఁడు దేవికి ప్రణమిల్లి యిట్లనియె. "అంబా, జగదంబా, నా ప్రభువునకు దీర్ఘాయురారోగ్యము లొసంగుము. అంతకంటెను నేను వాంఛించునది మఱియొ కటి లేదు." అనఁగా దేవి 'తథాస్తు' అని నుడివి యంతర్ధాన మాయెను. రాజు పరమానందభరితుఁడై వీరవరునిఁ గౌఁగిలిం చుకొనెను. అతని పుత్రికా పుత్రులను చంకనిడుకొని ముద్దా డెను. ఆయన భార్యను గౌరవముగఁ బలుకరించి యాశీర్వ దించెను. అందఱును తమ గృహమును చేరిరి.

ఆ రాత్రియంతయు రాజు నిద్రింపకుండెను. వీరవరుని ప్రభుభక్తి ధైర్యసాహసములు మొదలగువానిని దలంచుచుండ తెల్లవారెను. వెంటనే యాతఁడు కొలువుకూటమునకు వచ్చి మంత్రి సామంతులతోడ గతించినరాత్రి జరిగిన విషయము ... జెప్పి వీరవరునకు కర్ణాటరాజ్యమును దానము ... అతని పుత్ర పుత్రికలకును, భార్యకును, అమూల్య ... నొసంగి వారి నందఱను అత్యద్భుతముగ గౌర ... సామంతులును, ప్రజలు నావృత్తాంతమును

విని యపూర్వానందమున మునింగిరి. రూపసేన మహారాజును, వీరవరు మహారాజును చిరకాలము రాజ్యపరిపాలనం బొనర్చుచు స్వర్గసుఖముల ననుభవించిరి."

కథను ముగించి భేతాళుం డిట్లనియె. "మహారాజా! ఇందెవరి త్యాగ ముత్కృష్టమైనది?" అని ప్రశ్నింప విక్రమాదిత్యుం డిట్లనియె. "ఆ నలుగురియందును రూపసేనుఁడే గొప్ప త్యాగి. ఏలయన, ప్రభువుకొఱకు ప్రాణముల విసర్జించుట భృత్యధర్మము. కావున వీరవరుఁడు కర్తవ్య కార్యమును నిర్వహించెను. రాజు పుత్రమిత్రులను, ధనకనక వస్తువాహనములను, భార్యను వీడి సేవకునికొఱకుఁ బ్రాణములర్పింప సంసిద్ధమాయెను. ఇంతకంటెను పేర్కొనఁదగిన త్యాగ మేమున్నది?" అన భేతాళుఁడు వెంటనే వెనుకకుఁదిరిగి శ్మశానమందలి వృక్షశాఖపై కెక్కి తలక్రిందులుగ వ్రేలాడఁ జొచ్చె. విక్రమాదిత్యుఁ డుత్సాహభంగము నొందక తిరిగి శ్మశానమున కేఁగి యా శవమును మోసికొని వచ్చుచుండ భేతాళుఁ డీక్రింది కథ జెప్పెను.

4-వ కథ

మహారాజా! భోగవతీ నగరమును పాలించుచుండిన విక్రమకేసరి యను రాజు మిక్కిలి యోగ్యుఁడు; సమస్తగుణసంపన్నుఁడు. అతఁడొక చిలుకను పెంచుచుండెను. దాని పేరు విదగ్ధచూడామణి. అది యత్యద్భుత శక్తిసామర్థ్యములు గలది. అందువలన మిక్కుటముగఁ బ్రేమించుచు నిరంతరము దానిని తనకడనే యుంచుకొనియుండెను. ఉద్యానవనమున విహరించుచు రాజు విదగ్ధచూడామణినిఁ గాంచి యిట్లనియె. "చూడామణీ, నీ కేశాస్త్రములయందు పాండిత్యము గలదు?"

చూడామణి: భూతభవిష్యద్వర్తమానములయందలి సమస్త విషయములను పూసగ్రుచ్చినటులు చెప్పఁగలను.

విక్రమకేసరి: అటులయినచో నా కీవిషయమును చెప్పుము. వివాహమాడఁ దలఁచినాను. ఏ కన్యక నన్ను వరించును?

చూడామణి యొకింతవడి యోచించి యిట్లనియె. "మగధదేశాధీశుని పేరు వీరసేనుఁడు. ఆతని పుత్రిక పరమ సుందరి, సుగుణవతి. పేరు చంద్రప్రభ. ఆమె మీకు పట్ట మహిషి యగును."

ఈ నుడువులు విని విక్రమకేసరి మిక్కుటముగ సంతసించుచు శుకవాక్యములఁ బరీక్షించి చూడవలయును అని తలంచి ప్రసిద్ధ లెక్కిన జ్యోతిశ్శాస్త్రవిదులఁ బిలువనంపి వారితో నిట్లనియె. "నాకు వివాహ మెప్పుడగును? ఏ దేశాధీశుని పుత్రిక నన్ను వరించును? ఆ కన్నియ నామధేయ మెయ్యది?"

వారు కొంతవడి యోచించి యిట్లనిరి. "మహారాజా! చంద్రప్రభయను రాకొమరి మీకు పట్టమహిషి యగును. ఆమె యద్వితీయ సౌందర్యరాశి, సుగుణ సంపన్న."

ఈ విషయమును వినినప్పటినుండియు విదగ్ధచూడామణి యెడల రాజునకు భక్తిశ్రద్ధలు మిక్కుటమాయెను. మగధదేశాధీశుఁడగు వీరసేనుని కడకు సునిపుణుఁడగు బ్రాహ్మణునిం బంపించెను.

మగధరాజపుత్రికయగు చంద్రప్రభ యొక శారికను బెంచుచుండెను. దానిపేరు మదనమంజరి. గోరువంక త్రికాలముల నెఱుంగును. ఒక దినమున నొంటరిగ నున్నతరి గోరు

వంకను జూచి రాకొమరి యిట్లనియె. ''మదనమంజరీ! నేను పట్టమహిషి నగు రాజన్యుని నామధేయమును నుడువఁగలవా?''

మదనమంజరి: ఆహా, చెప్పఁగలను, భోగవతీ నగరాధి నాథుఁడగు విక్రమకేసరికి నీవు పట్టమహిషి వగుదువు.

ఈ మాటలకు చంద్రప్రభ మిక్కుటముగ సంతసించి తృప్తిహొందెను. విక్రమకేసరి పంపిన బ్రాహ్మణుఁడు మగధ దేశమున కేఁగి వీరసేన మహారాజును సందర్శించి విక్రమకేసరి మనోభావమును వెల్లడించెను. వీరసేనుఁ డంగీకరించి యా బ్రాహ్మణు నుచితరీతిని సత్కరించి పంపెను. బ్రాహ్మణుఁడు తిరిగి వచ్చి విక్రమకేసరిని వెంట నిడుకొని మగధదేశమున కేఁగి శుభ లగ్నమున చంద్రప్రభతోడ వివాహము గావించెను. విక్రమ కేసరి కొలఁదికాలము శ్వశురాలయమం దుండి రాణియగు చంద్రప్రభను వెంట నిడుకొని రాజధానికి వచ్చెను. ఆ దంప తులు సుఖముగఁ గాలము గడపుచుండిరి. చంద్రప్రభ వచ్చు నప్పుడు మదనమంజరిం గూడ వెంటఁ దీసికొని వచ్చెను. దానిని వీడి యరనిముసమైనను చంద్రప్రభ కాలము గడపఁ జాలకుండెను.

ఒక దినమున రాజదంపతులిద్దరును విలాసమందిర మునఁగూర్చుండియుండిరి. వారి కత్యంత ప్రియమైన శుకశారి కలుగూడ వారి చెంతనే యుండెను. అప్పుడు రాజు రాణిని చూచి యిట్లనియె ''ప్రియా. ఈ చిలుక యొంటరిగఁ గాలము గడపుచుండుటవలన మిక్కిలి కష్టమొందుచున్నది. కావున నీ శారిక నిచ్చి వివాహ మొనర్పుము. అప్పుడివి రెండును ఆనందముగ విహరించుచుండును. ఒక్క పంజరమందే యా

హార పానీయములఁ ద్రావి సుఖముగ శయనించును.” అన రాణి సంతసించుచు ఆ వివాహమున కంగీకరించెను. వెంటనే రాజు బ్రాహ్మణుని బిలువనంపి శుభముహూర్తమున శుకశారికలకు వివాహ మొనర్చి స్వర్ణ పంజరమందు వాని నుంచెను.

ఒక దినమున రాజదంపతు లంతఃపురమందుఁ గూర్చుండి యుండ శుకశారికలు తీవ్ర వివాదమునకుఁ గడంగెను. అందు గోరువంక చిలుకను చూచి యిట్లనియె. “పురుషుఁడు ధూర్తుఁడు; స్వార్థపరుఁడు; అందువలన పురుషుని సమీపమం దుండుటకు నే నిచ్చగింపను.”

శుకము: స్త్రీలు మిథ్యావాదులు; చలచిత్తలు; కుటిలలు. ఎట్టి ఘోరకార్య మొనర్చుటకును సంశయింపరు.

అను మాటలు విని రాణి “ఊరక మీ రేల కలహించెదరు?” అని ప్రశ్నింప గోరువంక యిట్లనియె. “మహారాజా! పురుషులు మహాపాపులు. అందువలన పురుషులను జూచిన నా కణుమాత్రమైనను గౌరవములేదు. ఆ విషయమును దెలుపుట కొక కథను జెప్పెదను వినుఁడు.

“ఇలాపురమున మిక్కిలి ధనికుఁడగు వర్తకుఁ డొకఁ డుండెను. ఆతని పేరు మహాధనుఁడు. సంతానము లేకుండుటకు మిక్కుటముగ వగచుచుండ వయసు చెల్లిన పిమ్మట నాతని కొక పుత్రుఁడు గలిగెను. ఆతనికి నయనానందుఁ డని పేరిడిరి. తగిన వయసున విద్యాబుద్ధులను గరపుటకు పండితులను నియమించిరి. కాని ప్రయోజనం బేమి? చదువు సంధ్య లాతని తల కెక్కకుండెను. అతఁడు దుర్మార్గుల సహవాసమున కాలము గడపఁజొచ్చెను.

ఆ వర్తకుఁడు మరణించెను. నయనానందుఁడు పిత్రార్జిత మగు ధనమును త్రాగుడు జూదములక్రింద వ్యయపఱుపఁ జొచ్చెను. కొలఁది వత్సరములలో ధనమంతయుఁ గోల్పోయి అప్పులపాలై స్వగ్రామమును వీడి దేశములు తిరుగఁ జొచ్చెను. కొన్ని వత్సరములకు నయనానందుఁడు తిరిగి తిరిగి చంద్రపురముం జేరి హేమగుప్తుఁడను గొప్ప వర్తకుని దర్శించెను. ఆతఁడు మహాధనునకు మిత్రుఁడు. అందువలన స్నేహితుని పుత్రునిఁ గాంచి సంతసించి యాదరించి యిట్లనియె. "నయనానందుఁడా, ఆకస్మికముగ నీ విటకు వచ్చుటకుఁ గారణమేమి?" అని యడుగ నయనానందుఁ డిట్లనియె. "నేను సరకులు తీసికొని వర్తకమునకు సింహళద్వీపమున కేఁగుచుంటిని. కాని తుపానుసంభుఁదగులోకాని యోడ మునిఁగిపోయెను. నేనొక్కఁడనుమాత్ర మతి కష్టముమీఁదఁ బ్రాణములు దక్కించుకొనఁ గలిగితిని. అందువలన నిటకు తిరిగి వచ్చితిని. శేషాయుహస్తముల స్వదేశమున కేఁగుట కిచ్ఛగింపకున్నాను.

ఈ వృత్తాంతమును విని హేమగుప్తుఁ డిట్లు యోచించెను. "అనేక దినములుగ రత్నావతికిఁ దగిన వరునికొఱకు ప్రయత్నించుచుంటిని. కాని సర్వవిధములఁ దగినవాఁడు కనఁబడలేదు. భగవదనుగ్రహమువలన నయనానందుఁడు వచ్చెను. ఈతఁ డుత్తమకుల సంభూతుఁడు మహాధనికుఁడు. కావున నితనికి పుత్రిక నిచ్చి వివాహమొనర్చుట యుక్తము. మహాధనుని సుగుణసంపద వర్ణనాతీతముగదా! ఆతని పుత్రుఁడగు నయనానందుఁడు సుగుణభూషితుఁ డనుటకు సందియ మేలఁ డను." అని తలఁచి తన యభిప్రాయమును భార్యకుఁ జెప్పెను. ఆమె యంగీకారమును బడసి శుభలగ్నమున నయనానందునకు

రత్నావతి నిచ్చి వివాహమొనర్చెను. వారిరువురును సుఖముగ నచటనే కాలము గడపుచుండిరి.

కొంతకాలము జరిగినపిమ్మట దుర్మార్గుఁడగు నయనానందునకు దుర్బుద్ధిపుట్టెను. అందువలన నొకదినమున భార్యను చూచి యిట్లనియె. "ప్రేయసీ, నేను గృహమును విడిచి చాల దినములైనవి. తలిదండ్రులు నాకొఱ కెంతయో పరితపించుచుందురు. స్నేహితులనుక్షణమును నాకొఱ కెదురుచూచుచుందురు. ఆ విషయమును దలంచిన కొలఁదిని నేనస్థిరుఁడనగుచున్నాను. కావున తలిదండ్రుల యంగీకారమును గైకొని బయలుదేరుము." అన రత్నావతి యంగీకరించి తలిదండ్రులకు భర్త మనోగతాభిప్రాయమును నివేదించి వారి యనుమతి గైకొనెను.

శుభదినమున నయనానందుఁడు భార్యతోడ బయలుదేరెను. హేమగుప్తుఁడు కుమార్తెకును అల్లునకును ధనమును అమూల్యవస్త్రాదిద్యలంకారముల నిచ్చెను. రత్నావతి నవరత్నమండనమగు నగలను ధరించి బయలుదేరెను. వీరిద్వరు చెఱియొక మేనామీఁదఁ గూర్చుండిరి. బోయీలు పాటలుపాడుచు నడచుచుండిరి. మేనాల నానుకొని నవుకర్లు నడచుచుండిరి. ఇట్లు కొన్నిదినములు నడచినపిమ్మట నయనానందుఁడు తప్పుత్రోవను నొకమహారణ్యమును బ్రవేశించునటుల చేసెను. అరణ్యమును బ్రవేశించినంతనే నయనానందుఁడు భార్యను చూచి యిట్లనియె. "ప్రేయసీ, మార్గము తప్పి యరణ్యమునఁ బడితిమి. ఇందు దొంగలభయము మిక్కుటము. రత్నాలంకారములు ధరించి నిర్భయముగఁ బోఁజాలము. నగలను దీసి నాచేతి

ష్మ. వానిని మూటఁగట్టి చంకను దగిలించుకొందును. పేద వాండ్రను బోలి నడచుచుఁ బోవుచుండినయెడల మనల దొంగ లడ్డగింపరు; సుఖముగ గ్రామము చేరవచ్చును. ఈ బోయీలు మొదలగువారికి బహుమతు లిచ్చి పంపుము. స్వీయనగరమును జేరునప్పుడు నగలు ధరింపవచ్చును." అని పతిభక్తిపరాయణా యగు రత్నావతి యంగీకరించెను. బోయీలు మొదలగువా రికి బహుమతు లొసంగి యటనుండి పంపి వస్త్రాభరణము లను మూటఁగట్టి భర్త కిచ్చెను. ఆతఁడు దానిని చంకనిడుకొని రత్నావతి భర్తతోడ నెమ్మదిగ నడచుచుండెను. కొంతదూర మేఁగునప్పటి కొక పాడుపడిన కూపము గాన్పించెను. దాని నంటి నడచుచుండ నయనానందుఁడు రత్నావతిని ఆ నూతి యందుఁ బడఁద్రోసి పలాయనమాయెను.

పాప మా రత్నావతి కూపమందుఁ బడి పరితపింపఁ జొచ్చెను. కాని వినువా రెవ్వరు భగవదనుగ్రహమువలన ఆ యబల రోదనము విని యామార్గమునఁ బోవుచుండిన పథికుఁ డొకఁడు కూపమును సమీపించి యందు దిగి రత్నావతిని ఒడ్డునకుఁ దీసెను. ఆతఁ డామెరూపలావణ్యములఁ గాంచి యుత్తమవంశసంజాత యని యూహించి పుట్టుపూర్వోత్తరము లడిగెను. కాని యామె నిజముచెప్పినయెడల భర్తను దుర్మార్గు డందురని తలఁచి యిట్లనియె. "నాపేరు చంద్రప్రభ. చంద్ర పురమునందు హేమగుప్తుని పుత్రికను. భర్తతోడ శ్వశురాలయ మున కేఁగుచుండ నిచ్చట దొంగలు వచ్చి చుట్టుకొని నగలు ఒలుచుకొని నన్నిందుఁ బడఁద్రోసి నా భర్తను బట్టుకొని యెచ్చటికో దీసికొని పోయిరి."

ఈ వాక్యములు విని పథికునిహృదయము కరగి యక్షి నోదార్చి వెంట నిడుకొని చంద్రపురమునకుఁ దీసికొనిపోయ హేమగుప్తగృహమందు విడిచి వారొనర్చు ఆదరసత్కారములఁ బడసి స్వగ్రామమునకు నిర్గమించెను. రత్నావతి దుర్దశను గాంచి తలిదండ్రులు మిక్కుటముగ దుఃఖించిరి. "నా భర్తను దొంగలు తీసికొని యేఁగి"రని యేడ్చుచుండు రత్నావతినిఁ గాంచి హేమగుప్తుఁ డిట్లనియె. "అమ్మా, దుఃఖింపకుము. దొంగలకు కావలసినది ధనము. ధనము దొరికినయెడల ప్రాణముల జోలికిరారు. కావున నీ భర్త యెచ్చటనో సురక్షితముగ నున్నాఁడు. నేను మనుష్యులను బంపించి వెదకించెదను" అని పుత్రికను పలువిధముల నోదార్చి నూతనాలంకారముల నొసంగెను. తలిదండ్రులకడ నుండుటవలన నామె యొకింత యూరడిల్లెను. కాని భర్తచేసిన ఘోరకార్యము నణుమాత్రమైనను దెలియనీయక భర్తరాకకు పరి పరి విధముల బరితపించుచుండెను.

పరమ దుర్మార్గుఁడగు నయనానందుఁడు స్వదేశమునకేఁగి నగలన్నిటిని విక్రయించి యా ధనమును జూదము త్రాగుడు మొదలగు కార్యములయందు వినియోగించెను. కొలఁది దినములలో నా ధనమంతయు పూర్తియాయెను. ఇఁక చేయునది యేమి? ఆ మహాపాపికి ధన మెచ్చటనుండి వచ్చును? అందువలన నా నరాధముఁ డిట్లు భావింపఁజొచ్చెను. రత్నావతి బావియందుఁబడి మరణించిన విషయము హేమగుప్తునకుఁ దెలియదు. అందువలన నాయింట సుఖముగ నున్న దని నుడివి కొంతకాల మచటనుండి దొరకినంతవఱకు ధనమును దొంగిలించుకొని వత్తును" అని తలఁచి బయలుదేరి కొన్నిదినములకు చంద్రపుర

మున కేఁగి మామగారింటఁ బ్రవేశించెను. కాని యాతఁడు గృహముం దడుగిడినంతనే రత్నావతి కన్పడెను. అప్పుడు నయనానందుని ప్రాణము లెచటికిఁ బోయెనని వేఱుగఁ జెప్పవలయునా?

పరమసాధ్వీశిరోమణి రత్నావతి. అందువలన నామె భర్తను గాఢముగఁ బ్రేమించియుండెను. భర్తను గాంచినంతనే యామె యిట్లు తలంపఁజొచ్చెను. "ఈతఁ డెంతటి దుర్మార్గుఁడయినను నాకు భర్త. కావున నీతనికి సేవఁజేయుట నాధర్మము. అందువలననే నాకు సద్గతి లభించును. ఈ జన్మము చరితార్థమగును. నేను మరణించితినని యాతఁ డిటకు వచ్చియున్నాఁడు. కాని బ్రతికియున్నానని తెలియదు" అని యనుకొని భర్తను సమీపించి రత్నావతి యిట్లనియె. "భయపడకుఁడు, నే నెవ్వరికి నింతవరకు యథార్థమును జెప్పలేదు. ముందుగూడఁ జెప్పఁ దలఁపలేదు. మహారణ్యమున నన్ను దొంగలు నూతియందుఁ బడఁద్రోసి నాభర్తను కొట్టుచుఁ దీసికొని యేఁగినారని చెప్పితిని. అందువలన నా తలిదండ్రులు దుఃఖించుచు మీకొఱకెదురుచూచుచున్నారు. కావున మిమ్ముఁ గాంచినవారు పరమానంద భరితులగుదురు. మీ రెచ్చటికి నేఁగవలసిన పనిలేదు. ఇచ్చటనే యుండుఁడు. మీపాదసేవవలన ధన్యురాల నగుదును."

రత్నావతివాక్యములవలన నయనానందుని పంచప్రాణములు కుదుటఁబడెను. అంత సంతసముతో అత్తమామలను దర్శింప వారు పొందిన యానందమును వర్ణించు టెట్లు? భార్యయుపదేశానుసారము చెప్పుచు దొంగలవలన తా ననేకకష్టములనుభవించితి నని చెప్పి యేడ్వఁజొచ్చెను. హేమగుప్తుఁ డల్లుని కౌఁగిలించుకొని మోదార్చెను. ఆ దినము రాత్రి భోజనానంతర

రము రత్నావతి నూతనాలంకారములు ధరించి శయనాగారమునకు వచ్చి భర్త కాళ్లు పిసుకుచుండెను. నయనానందుఁడు నిదురఁబోవుచుండినటులు గుఱ్ఱువెట్టుచుండ రత్నావతి శయనించి నిదురఁబోయెను. అప్పుడాఘోరదుర్మార్గుఁడగు నయనానందుఁడు నెమ్మదిగ లేచి రత్నావతి గొంతుకోసి నగలన్నిటినిఁ దీసికొని పాఱిపోయెను."

మహారాజా! ఇది కల్పితకథ కాదు. నేను స్వయముగ చూచితిని. పురుషుని దుర్మార్గమునకు హద్దుగలదా? ఇంతటి ఘోరకృత్యమును మీరెచ్చటనైనను కని వినియుందురా? విచారింపుఁడు. అందువలన అప్పటినుండియు పురుషుల మోము చూడరాదనియు, సాధ్యమైనంతవఱకును వారి సంపర్కమును బరిత్యజింతు ననియు శపథము చేసియుంటిని.

శారిక నుడివిన కథ విని రాజు చిఱునవ్వు లొలయ శుకమును జూచి యిట్లనియె. "విదగ్ధచూడామణీ! స్త్రీజాతి మీఁద విరక్తిగలుగుటకు కారణమును జెప్పుము" అని ప్రశ్నింప చిలుక యిట్లు చెప్పఁ దొడఁగెను.

మహారాజా! కాంచనపురమందు సాగరదత్తను వర్తకుఁ డొకఁడుండెను. ఆతఁడు మిక్కిలి ధనికుఁడు. ఆతనిపుత్రుఁడు ధనదత్తుఁడు. అనంగపురమందలి సోమదత్తునిపుత్రిక యగు జయశ్రీని శ్రీదత్తున కిచ్చి వివాహమొనర్చిరి. ధనదత్తుఁడు కోమలహృదయుఁడు; సదాచారి; సత్యసంధుఁడు; ప్రియదర్శనుఁడై యలరారుచుండెను. జయశ్రీ మిక్కిలి చపలచిత్త. అందువలన నామెకు భర్తపై ననురాగము లేకుండెను.

గరచుటవలన మరణించెను. కాని యీ విషయము జయశ్రీకిఁ దెలియు టెట్లు? అందువలన నెంత పిలిచినను పలుకకుండుటచే గట్టిగఁ దలుపు త్రోసికొని జయశ్రీ దాసిగృహములోని మంచముమీఁదఁ బడియున్న వృద్ధదాసిని లేపఁజొచ్చెను.

ఆగృహముసమీపమందు దొక్క పెద్దవటవృక్షముమీ నుండు పిశాచము జయశ్రీనిగాంచి ఆమె అచటికి వచ్చుట గారణమును గ్రహించి యత్యుత్తముఁడగు భర్తను వీడి జయశ్రీకి బుద్ధిచెప్పుట మంచి దని తలఁచి వృక్షము మరణించిన వృద్ధదాసి శరీరమునఁ బ్రవేశించెను. జయ వఁగా పిలువఁగా నులికిపడి లేచి గాఢాలింగనం ... నున్నట్లు నటించి ముక్కు కొరికివేసి మంచముమీఁదఁ బడిపోయెను. పిశాచము వృక్షముమీఁది కేగెను. దీనినంతయుఁ జూచుచున్న దొంగ జయశ్రీనగల నపహరించవలయు నను విషయమును మరచి యాశ్చర్యమొందుచుండెను.

జయశ్రీ ముక్కుపోవుటవలన నధిక బాధ ననుభవించుచు బిగ్గరగనేడువఁగా లోకులువచ్చి చూతు రని తలంపున లోలోన గ్రుళ్లుచు రక్తప్రవాహమున కట్టువస్త్రము తడిసియుండ కుటిలపన్నాగముఁ పన్నుకొని శయనాగారమునకు వచ్చి శయనించి చివాలున లేచి కేకలుబొబ్బలు పెట్టుచు రోదనముఁ జేయఁ జొచ్చెను. ఆ రోదనమును విని తలిదండ్రులు మొదలగువారటకు వచ్చిరి. ఆమె భీభత్సరూపమును గాంచినప్పుడు వారికిఁ గలిగిన దుఃఖమునకు మేరయుండునా? జయశ్రీ మంచము క్రిందఁబడి దొర్లిగింతలు బెట్టుచుండెను. అప్పుడీమున కీదుఃఁ గారణమేమని ప్రశ్నింపనామె భర్తను చూపెను. అచ్చట నున్నవారెల్లరును ధనదత్తుని తిట్టి కొట్టిరి. అమాయకుఁడగు

ధనదత్తుఁ డేమి ప్రత్యుత్తర మొసంగును? నిర్విణ్ణుఁడై చూచుచు
రు చేయు గ్జాన్యమును సహించుచుండెను. కాని యంత
మార్గ మేమి? జయశ్రీ ఘోరరాక్షసి యనువిషయ మాత
స్పష్టమాయెను. కాని యాతని ప్రత్యుత్తరముకొఱకు
చుచున్నవా రెవ్వరు? "నోసటన్ వ్రాసినవ్రాలుకన్నఁ గల
నూరేల్లు చింతించినన్" అని యనుకొనుచు నొక గోడకు
పడి నిలుచుండెను.

ల్లవారినంతనే వర్తకుఁడు పుత్రికను వెంటనిడుకొని
కేఁగి నాపుత్రిక ముక్కును అల్లుఁడు కొరికె ననీ
వంటనే రాజదూతలు వచ్చి ధనదత్తుని కొల్వు
కూటమునకుఁ దీసికొని పోయిరి. విచారణాలయమం దుభయ
పక్షములవారును జేరిరి. రాజు జయశ్రీనిఁ గాంచి నీ ముక్కును
కొరికివేసిన వాఁ డెవ్వఁడని ప్రశ్నింప నామె భర్తను చూపి రాత్రి
శయనాగారమందు నా ముక్కు కొరికినాఁ డని నుడివెను. నీ
భార్యముక్కు నేల కొరికితి వని ధనదత్తునిఁ బ్రశ్నింప నాతఁ డిట్ల
నియె. "మహారాజాధిరాజా, ధర్మస్వరూపా, నాకీవిషయ
మణుమాత్రమైనను తెలియదు. అంతకంటెను నేను చెప్పఁదగి
నది లేదు. తమరుఁ దోచినటులు శిక్షింపుఁడు." అని మౌనమును
ధరించెను. భార్య ముక్కును గోసె నని ధనదత్తుని రాజు
కొఱుతను వేయవలసిన దని యాజ్ఞాపించెను.

విచారణసమయమం దాదొంగ యొక మూలనుండి
యచ్చట జరుగుచున్న విషయములను గాంచుచు ధనదత్తునకు
విధించినశిక్షను విని హృదయము కరగి రాజును సమీపించి
తాను కనులార చూచినవృత్తాంతమంతయు వివరించెను. రాజు
మిక్కిలి యాశ్చర్యమును బొందుచు వృద్ధదాసియింటికి భటు

లను బంప వారా వృద్ధదాసినోటిని లోపల నామగ్రితోడ యందున్న ముక్కు ముక్కను దెచ్చి రాజునకుఁ జూపిం వెంటనే నిర్దోషియగు ధనదత్తు నాదరముతో విడిపించి "క కిరాతకియగు జయశ్రీ తలగొరిగించి సున్నపుబొట్లు గాడిదమీఁదఁ గూర్చుండఁబెట్టి యూరింతయు ద్రిప్పి ములకు దణ్ణముడు" అని యాజ్ఞాపించెను. సత్యము దొంగకు మంచి బహుమతియొసంగెను. మహారా వలన స్త్రీలను జూచిన నాకు మిక్కిలి యసహ్య

కథ పూర్తియైనంతనే బేతాళుఁ డిట్లనియె. నయనానందులయం దెవ్వ రెక్కుడు వారులు?" ఆ నిర్వురు సమానులని విక్రమాదిత్యుఁడు ప్రత్యుత్తర బేతాళుఁడు వెనుకకు మరలి చెట్టునకు వ్రేలాడసాగెను. మాదిత్యుఁడు యథాప్రకారము శవమును భుజముపై వచ్చుచుండ బేతాళుఁడు అయిదవకథ యిట్లు చెప్పెను.

5–వ కథ

మహారాజా, పుణ్యసేనుఁడు ధారానగరాధీశుఁడు. ఆ తఁడు మహాపరాక్రమశాలి; సత్త్వసంపన్నుఁడు; ధర్మముదప్పక రాజ్యపరిపాలనం బొనర్చుచుండెను. పుణ్యసేనుఁడొక బ్రాహ్మ ణుని మిక్కిలిగఁ బ్రేమించుచుండెను. ఆతనిపేరు హరిస్వామి. ఆతనికొక పుత్రుఁడును పుత్రికయు నుండిరి. పుత్రునిపేరు దేవ స్వామి; పుత్రిక పేరు సోమప్రభ. ఆమె త్రిలోకసుందరి. యౌవ నము వచ్చునప్పటి కామె రతీదేవిని మించిన సౌందర్యమున నలరారఁజొచ్చెను. హరిస్వామి పుత్రిక వివాహమునకుఁ బ్రయ త్నించుచుండ నామె యిట్లనియె. "నేను సకల సద్గుణసంపన్నుఁ

నినిగాని, విజ్ఞానునిగాని, శూరునిగాని వివాహమాడఁ
బతిని. కావున నట్టి వరునకై ప్రయత్నింపుఁడు." అను
ములకు తలిదండ్రులును, సోదరుఁడును మిక్కుటముగ
ంచిరి.

కదినమున పుణ్యసేనుఁడు హరిస్వామినిఁ బిలిచి యిట్లు
క్షిణ దేశమందు విక్రమసింహుఁ డను రాజు నాకు
డు. కొన్ని వత్సరములుగ నాతని క్షేమసమాచార
కుండుటవలన నే నప్పుడప్పుడు మనోవేదనకు లో
ను. కావున నీవేఁగి యాతని క్షేమసమాచారమును
రావలయును." అని యాజ్ఞాపింప హరిస్వామిబయ
క్రమసింహుని రాజధాని కేఁగి యాయనను సంద
పుణ్యసేనుని యోగక్షేమమును విన్నవించెను. ఆ వార్త
న నాతఁడపూర్వానందమును బొంది హరిస్వామిని మిక్కు
టముగ సత్కరించి కొన్నిదినము లట నుండవలయు నని
కోరెను.

కొన్ని దినములు గడచెను. రాజసభయందు హరిస్వామి
కూర్చుండియుండ నట కొక బ్రాహ్మణకుమారుఁడు వచ్చి కూ
ర్చుండ హరిస్వామి యిట్లు ప్రశ్నించెను. "ఏలవచ్చితివి?"
అని యడుగ నాతఁడు తన పుట్టుపూర్వోత్తరములు నివేదించి
యిట్లనియె. "త్రిలోకసుందరి యగు మీ పుత్రికను వివాహ
మాడవలయు నను తలంపున వచ్చితిని." అన హరిస్వామి
యిట్లనియె. "వత్సా? నా పుత్రిక జ్ఞానినిగాని, విజ్ఞానినిగాని,
శూరునిగాని వివాహమాడుదు నని ప్రతినఁ బూనియున్నది,
కావున నీ ప్రజ్ఞావిశేషములఁ జెప్పుము." అన బ్రాహ్మణ
కుమారుఁ డిట్లనియె. "నేను బాల్యమునుండియు క్రమపద్ధతిని

సమస్త శాస్త్రముల నభ్యసించితిని. అపూర్వరథము నొకటి నిర్మించితిని. దానిమీఁద నెక్కి నిమేషకాలమున నిచ్చవచ్చినచోటునకుఁ బోవచ్చును. నేను విజ్ఞానిని, కావున నీవు పుత్రికను వివాహమాడుటకు అర్హుఁడను."

అనుమాటలకు హరిస్వామి సంతసించి నీకు పుత్రి నిచ్చి వివాహమొనర్చెదను. నన్నిక్కడనుండి ధారానగరమునకు రథముమీఁద నెక్కించుకొని తీసికొని పొమ్మనిన బ్రాహ్మణకుమారుఁడంగీకరించి మహనీయమగు తనరథమును దీసికొనివచ్చెను. వారిద్దరారథము నెక్కి నిమేషకాలములో ధారానగరమును బ్రవేశించిరి. ఏ ...... హరిస్వామి పుత్రుఁడును, భార్యయు వేరే యొకవరుని స్థిరపఱిచిరి. వారు కూడవచ్చి గృహమందుండిరి. వారియం దొకఁడు జ్ఞాని. మరియొకఁడు శూరుఁడు.

హరిస్వామి యిట్లు చింతింపఁజొచ్చెను. "ఒక్క కన్యకు, ముగ్గురువరులు, రూపగుణములు, విద్యాబుద్ధులయందు వారు మువ్వురును సమానులు. మువ్వురకును మాటయిచ్చితిమి. పుత్రిక మనోభీష్టము చొప్పున మువ్వుర యందొకఁడు జ్ఞాని, మరియొకఁడు విజ్ఞాని, వేఱొకఁడు శూరుఁడు. చేయునదియేమి? ఇందెవనికి పుత్రిక నొసంగుట. ఎవనిని కాదనుట." అని పరిపరివిధముల యోచించి యేమియు నిర్ధారణచేసికొనఁజాలక మువ్వురఁ జూచి యిట్లనియె. "మీరు మువ్వురు మాయింట నుండుఁడు. నేను భార్యాపుత్రులతో యోచించి చెప్పెదను." అన వారుమువ్వురచ్చటనే యుండిరి. ఆకన్నియను వివాహమాడుటకు నే నర్హుఁడను- కాదు నే నర్హుఁడ నని వారు తమ తమశక్తి సామర్థ్యములఁ జెప్పికొనుచుండిరి.

ఆ రాత్రి యెల్లరును భుజించి శయనించిరి. కాని భయంకరమగు నొక దుర్ఘటన ఘటించెను. ఒకానొక రాక్షసుడు నిద్రించు చుండిన సోమప్రభను దొంగలించుకొని పోయెను. కాని గృహమం దెవ్వరికి నా విషయము తెలియదు. తెల్లవారెను. సోమ ప్రభ యెక్కడ? అందరును గందరగోళపడజొచ్చిరి. తోటలు దొడ్లు చెరువులు బావులు వెదకిరి. సోమ ప్రభ కాన్పింపదయ్యె. తలిదండ్రులు దుఃఖ సాగరమున మునింగిరి.

ఆ ముగ్గురు వరులయందు జ్ఞాని యగువాడు యోగ బలముచేత జరిగిన విషయమును తెలిసికొని హరిస్వామితో నిట్లనియె. "మహాశయా, భయపడవలదు. నేను యోగబలమున సోమ ప్రభను సందర్శించితిని. ఆమె నొక రాక్షసుం డెత్తుకొని పోయి వింధ్యపర్వతమందలి యొక గుహాయందు దాచి యున్నాడు. ఆమెను దీసికొని వచ్చుటకు మార్గమును చూడవలయును." అను మాటలు విని శూరుండ నని చెప్పుచుండిన రెండవవాం డిట్లనియె. "మహాశయా, నేను శబ్దభేది విద్య యందసామాన్యుడను. అందువలన నా రాక్షసునిం బరిమార్చి మీ పుత్రిక నుద్ధరింపంగలను. కాని యచ్చటి కేగుటకుకొన్ని దినములు పట్టును. మార్గ మేమి?" అప్పుడు విజ్ఞానిం నని చెప్పిన మూడవవాడు. "నారథము మీద బయలు దేరుడు. ఒక్క ముహూర్తకాలమున మిమ్ము వింధ్య పర్వత గుహాకడకుం దీసికొని యేగుదును." అనెను.

వెంటనే రథమును సిద్ధముజేసెను. దానిపై నెక్కి శూరుడు వింధ్యపర్వతకంధరమున కేగి యొక్క బాణమున

రాక్షసుని సంహరించి వెంటనే సోమప్రభను రథముపై కెక్కించుకొని తిరిగివచ్చెను. ఎల్లరును సంతసించిరి. వివాహవిషయమున నా మువ్వురును వివాదపడఁజొచ్చిరి. హరిస్వామి నిశ్చేష్టబుద్ధియై చూచుచుండెను."

కథను ముగించి బేతాళుఁడిట్లనియె. "సాహసికాగ్రణీ! ఆ మువ్వురువరులయందును సోమప్రభను వివాహమాడుట కెవఁడర్హుఁడు?" అని ప్రశ్నింప విక్రమాదిత్యుఁడు మౌనవ్రతము వీడి యిట్లనియె. "రాక్షసుని సంహరించిన శూరుఁడు సోమప్రభను వివాహమాడుట కర్హుఁడు."

బేతాళుఁడు:-విద్యాబుద్ధులయందు మువ్వురును సమానులు, సోమప్రభ నుద్ధరించువిషయమునఁ గూడ సమముగ తోడ్పడిరి. అట్టిచో శూరునిఁ జేసికొనుటకుఁ గారణమేమి?'

"విక్రమాదిత్యుఁడు వారుమువ్వురును విద్యావిషయము నసమానులు. సోమప్రభయుద్ధరణవిషయమునఁగూడ సమముగఁదోడ్పడిరికాని రాక్షసుని చంపినవాఁడు మాత్రమే యామె యుద్ధరణమందు ముఖ్యుఁడు. ఆమె ఫలానిచోట నున్నదని తెలిసికొనుట కంటెను, అచ్చటికేఁగుటకు రథము నొసంగుట కంటెను, వానిని చంపినవాఁడు సాహసుఁడు, త్యాగి, వీరుఁడు కావున నాతఁడే యామెను వివాహమొనర్చుకొనుట కధికారి.'

ఈ మాటలు విని బేతాళుఁడు తృప్తినొంది తిరిగి యేఁగి చెట్టుమీఁద వ్రేలాడఁజొచ్చెను. విక్రమాదిత్యుఁ డా శవమును బుజముమీఁద నిడుకొని మౌనముగ బయలుదేరెను. అప్పుడు బేతాళుఁ డీక్రింది కథ నుపక్రమించి యిట్లు చెప్పెను.

6-వ కథ

మహారాజా! శోభావతీ నగరనాథుని పేరు ధర్మశీలుఁడు. ఆతఁడు ధర్మమును దప్పక కన్న తండ్రినిబోలి ప్రజలను గాపాడుచుండెను కాని యాతనికి సంతానము లేదు. అందుల కాతఁడు మిక్కిలిగ వగచుచు కాత్యాయనీదేవిమందిరమును గట్టించి యనుదినము నామెను బూజించుచు మిక్కిలి యాడంబరముగ నుత్సవములు చేయుచుండెను. కాని సంతానము గలుగలేదు. సంతానములేని యా దంపతుల మనోవ్యథను వర్ణింప నెట్లు?

ఒకదిన మాదయమున ధర్మశీలుఁడు దేవిని పూజించి సాష్టాంగముగపడి యిట్లు ప్రార్థించెను. "అంబా, జగదంబా, కాత్యాయని, భక్తుల సమస్త కష్టములఁ దొలఁగించి రక్షించు చుండు తల్లీ, నాకుఁ బుత్రుని ప్రసాదింపుము. ఈదాసుని కృతార్థుని చేయుము" అని ప్రార్థింప దైవ వాణి యిట్లు వినఁబడెను. "నత్వాని భక్తి శ్రద్ధలకు సంతసించితిని. నీకు పుత్రుఁడు గలుగును. ఆతఁడు సమస్త విద్యా విశారదుఁడై విలసిల్లును."

రాజు పరమానంద భరితుఁడై కాత్యాయనీదేవికి మరల ప్రణమిల్లి గృహమునకు వచ్చి దేవి పల్కుల నెల్లరకును వినిపించెను. ఎల్లరును సంతసించిరి. బీదసాదల కన్నమిడిరి. పండితులను సత్కరించిరి. కొంత కాలమునకు రాజదంపతులకు పుత్రుఁడు గలిగెను. పుత్రుని మోముఁ గాంచి యాదంపతులు చరితార్థుల మని తలంచిరి. యువరాజు జన్మించెనని యాదేశపు జనులానందోత్సవము చేయసాగిరి. కాత్యాయనీదేవికి నుత్సవములు మిక్కుటముగఁ జరుగఁజొచ్చెను. దేశవిదేశములనుండి

దలంచును కాని నామాట నమ్మువా రుండరు. అపకీర్తి పాలయి జీవించుటకంటె ఈ శరీరమును దేవి కర్పించుట యుత్తమము. ఇంతకుమించిన మార్గములేదు" అని దలంచి దేవికి సాష్టాంగ వందన మాచరించి క్రిందఁబడియున్న ఖడ్గమును దీసి తల నఱుకుకొనెను.

దీనదాసు భార్య కీవిషయము తెలియదు. ఆమె భర్త కొఱకును, ఆతని మిత్రునికొఱకును ఆ వృక్షము క్రిందనే వేచి యుండెను. ఎంతవఱకును వారు రాకుండుటచేత మందిరము లోనికేగెను. ఆ భయంకర దృశ్యమునుగాంచి మూర్ఛిల్లి కొంతవడికి లేచి యెలుఁగెత్తి విలపించుచు "విధవనై జీవించుట కంటెను మరణించుటయే సర్వోత్తమము" అని తలంచి కాత్యాయని పాదములమీఁద బడి లేచి రక్తసిక్తమగు ఖడ్గమును దీసి తలనఱుకుకొనుటకు పైకెత్తఁగా కాత్యాయనీదేవి ప్రత్యక్షమై యామె దక్షిణ హస్తముంబట్టి ఖడ్గము నూడఁదీసి యిట్లనియె. "వత్సా నీ సాహసమున కెంతయు సంతసించితిని. నీవు కావలసిన వరమును గోరుము" అన నామె భర్తను, భర్తృస్నేహితుని బ్రతికింపుమని ప్రార్థించెను. దేవి "తథాస్తు" అని తమవారి మొండెములకు తలల నతికింపుము. ఇర్వురును జీవింతురు. అని యంతర్ధానమాయెను.

ఆమె యానందమున మైమఱచి భర్తమొండెమునకు ఆతని స్నేహితుని తలను, ఆతని స్నేహితుని మొండెమునకు భర్తతలను తగిలించెను. వారిర్వురును వెంటనే లేచి నిలిచిరి.

బేతాళుఁడు కథను పూర్తియొనర్చి యిట్లనియె "మహారాజా, ఆ యిర్వురయం దామె భర్తయెవ్వఁడు" అన విక్రమ

మాదిత్యుం డిట్లనియె "సర్వస్య గాత్రస్య శిరః ప్రధాన" మను న్యాయము ననుసరించి కీనదాసు తలయున్న శరీరముగలవాం డామె భర్త."

అని జేతాళుండు సంతసించి యాతని ధర్మ నిర్ణయమునకును, ధైర్యసాహసములకు నచ్చెరువొందుచు తిరిగి యా వృక్షముకడ కేంగి వ్రేలాడంజొచ్చెను.

7-వ కథ

చంపానగరాధినాథుని పేరు వీరవరుండు. ఆతండు తనకు సంతానము లేకుండుటకు వగచి భార్యయగు పద్మగంధితోడ గంగాతీరమున ఘోర తపమాచరించెను. పరమేశ్వరుండు స్వప్నమున సాక్షాత్కరించి యొక్క పుత్రుని ఒక పుత్రికను ఒసంగితినని నుడివి యదృశ్యుండాయెను. రాజును మేల్కాంచి యా విషయమును భార్యతోం జెప్పి, తామిర్వురు తిరిగి చంపా నగరమునకు వచ్చి సుఖింపుచుండిరి. కొంతకాలమునకు వారికొక పుత్రుండును పుత్రికయుం గలిగిరి. ఆ పుత్రిక నామధేయము చంద్రకళ. సౌందర్యమున నామె అసమానురాలు. వయసువచ్చిన కొలందియు నామె సౌందర్యవిషయము దేశవిదేశములు వ్యాపింపంజొచ్చెను. అందువలన ననేకమంది రాకొమరులు పటములు బంపిరి. యువావను లనేకులువచ్చి రాజును దర్శించిరి. కాని చంద్రకళ కెవరిమీందను ప్రేమకలుగకుండెను. ఎవని పటము చూపించినను తలయూపకుండెను. చేయునది యేమి? చివరకు రాజు స్వయంవరము నేర్పాటు చేయందలంచి పుత్రికకుం జెప్ప స్వయంవరమున కామె యంగీకరింపక యిట్లనియె. "తండ్రీ స్వయంవరమున ననేకులు వచ్చెదరు. అందు నేను వరించు

నది యొక్కనినేగదా? అతనికి మిగిలినవారందఱును శత్రువు
లగుదురు. కావున స్వయంవరము వలదు. విద్యాబుద్ధులయం
దును, బలవిక్రమములయందును, అసమానుఁ డగువానిని
నేను వరింతును" అను మాటలకు రాజు సమ్మతించి చంద్ర
కళ మనోభావమును దేశవిదేశములయందంతటను ప్రక
టింపించెను.

ఒక దినమున రాజపుత్రిని వివాహమాడుటకు నల్వురు
రాజపుత్రులు వచ్చి సభాభవన మలంకరించిరి. అందు ప్రథముఁ
డిట్లనియె. "నే ననేక విద్యలయం దారితేరినవాఁడను. చేతి
పనులయందు సుప్రసిద్ధుఁడను. దినమున కొక వస్త్రమును
నేయఁగలను. దాని మూల్య మైదు రత్నములు."

రెండవవాఁ డిట్లనియె. "నేను సమస్త విద్యాపారంగ
తుఁడను. పశుపక్షుల స్వభావాదులను, భాషలను బాగుగ
గ్రహింపఁగలను. బలమున భూమండలమం దద్వితీయుఁడను."

మూఁడవయాతఁ డిట్లనియె. "సమస్త శాస్త్రముల నా
మూలాగ్రముగఁ బఠించితిని. వానియందు నా కుత్కృష్టప్రతిభ
గలదు. నే నసమానసౌందర్యమున నలరారుచుందు నను
విషయము దేశప్రసిద్ధము. మీ రిప్పుడు నన్ను గాంచుచునే
యున్నారుగదా?"

నాల్గవ రాకొమరుఁ డిట్లు నుడివెను. "ధనుర్విద్యయందు
పేరెన్నికఁ గాంచితిని. నాతో సమ మగు ధన్వి భూమండలమం
దరుదు. సమస్త శాస్త్రములు నభ్యసించితిని".

రాజు వినుచుండెను. కాని యిదమిత్థ మని నిర్ణయింప
జాలకుండెను. నల్వురును రూపరేఖావిలాసములయం దేవి,

విద్యాబుద్ధులయం దేమిసమానులు. అంతియగాక ప్రతియొక్క-నికి ప్రత్యేక మొక్కొక్క- విద్యయం దాధిక్యత కలదు. అందు వలన నేమియుఁ దోఁపక యంతఃపురమును బ్రవేశించి పుత్రిక తోడ ఆ నల్వురు రాజపుత్రుల గుణగణములను వర్ణించి చెప్పెను. కాని యామె ప్రత్యుత్తర మొసంగదాయెను.

ఇంతటితో కథను ముగించి బేతాళుఁ డిట్లనియె. "మహారాజా! వీరియం దెవఁడు రాకొమరిని వివాహమాడు టకు తగినవాఁడు?"

విక్రమాదిత్యుఁడు:—వస్త్రములు నేయువాఁడు సాలె వాఁడు; కులమున శూద్రుఁడు. పశుపక్షులభాష తెలిసిన వాఁడు వైశ్యుఁడు. శాస్త్రవిశారదుఁడు బ్రాహ్మణుఁడు. ధను ర్విద్యానిపుణుఁడు క్షత్రియుఁడు. కావున క్షత్రియుఁడు సజాతీ యుఁడు గాన రాకొమరిని చేఁబట్టుట కర్హుఁడు.

ఇట్లు నుడివినంతనే బేతాళుఁడు వృక్షముకడ కేఁగి వ్రే లాడఁజొచ్చెను. తిరిగి విక్రమాదిత్యుఁడట కేఁగి యాశవమును బుజముపై నిడుకొని బయలుదేరి కొంతదూర మేఁగునప్పటికి బేతాళుఁ డొక కథను జెప్పనారంభించెను.

8-వ కథ

మహారాజా! తామ్రలిప్తనగరాధీశుఁ డగు చండసిం హుఁడు మిక్కిలి పరాక్రమశాలి. ఆతనిపేరుప్రతిష్ఠలు విని సత్యశీలుఁ డను రాజపుత్రుఁడొకఁడు ఉద్యోగముకొఱకు వచ్చి కొలువుకూటమున కేఁగెను. కాని రాజు కొలువుకూటమునకు వచ్చి రాజ్యసంబంధమగు కార్యములం జూడక కార్యభారము

నంతయు మంత్రిపై నిడి యంతఃపురమందు విలాసముగ కాలము గడపుచుండెను. సత్యశీలుఁడు రాజదర్శనముకొఱకు నొక వత్సరము తామ్రలిప్తనగరమం దుండెను. కాని రాజు దర్శనము కాదయ్యెను. ఆతఁడు వెంటఁ దీసికొనివచ్చిన ధనము పూర్తియగుటవలన చేయునది లేక యరణ్యమునకేఁగి కంద మూలములఁ దినుచు భగవదారాధనమందు కాలము గడప సాగెను.

చండసింహుఁడు తిరిగి రాచకార్యములను శ్రద్ధగ చూచుకొనుచు ఒక దినమున మిక్కిలి యాడంబరముగ వేఁటకు బయలుదేరెను. ఒక లేడినిఁ బట్టుకొనవలయు నను తలంపున చండసింహుఁడు దాని వెంట గుఱ్ఱమును పోనిచ్చెను. అందువలన చండసింహుఁడు వేఁటకాండ్రు మొదలగువారలను వీడి యొంటరిగ నొక మహారణ్యమును బ్రవేశించెను. కాని యాహారిణము చిక్కకుండెను. ప్రొద్దు క్రుంకుచుండెను. అప్పుడది వృక్షచ్ఛాయలఁ దప్పించుకొని యదృశ్యమాయెను.

అప్పటికి రాజొకచోట నిలువంగా నతనికి భయము కలిగెను. ఆఁకలిబాధ మిక్కుటమయ్యెను. పథశ్రమవలన నతఁడు మిక్కిలి డస్సియుండెను; పిపాసవలన బరితపింపఁజొచ్చెను. ఎచ్చటనైనను మంచినీరు దొఱకునాయని కొంతదూరము ముందరుగునప్పటి కొక చిన్న కుటీరము కాన్పించెను. వెంటనే రాజు కుటీరముకడ కేఁగి దైన్య స్వరమున "మహాశయా! కొంచెము మంచితీర్థ మిచ్చి నా ప్రాణములు నిలుపుఁడు" అని యడిగెను. ఆ మాటలు విని సత్యశీలుఁడు వెంటనే కొన్ని యుసిరికపండ్లను మంచి తీర్థమును దెచ్చియిచ్చెను.

రాజు జలమును గ్రోలి యాపండ్లను దిని యొకింత బడలికను బోగొట్టుకొని యిట్లనియె. "మహాశయా! మీరు నాకుఁ బ్రాణదానం బొసంగితిరి. జలము దొరకనియెడల నిప్పటికి మరణించి యుందును. నా ప్రాణముల నిల్పితిరి. కావున నేను మీకుఁ బరమకృతజ్ఞుఁడను. కాని మి మ్మొకమాట యడుగఁ దలఁచితిని. క్షమించి ప్రత్యుత్తరమిచ్చిన సంతసింతును. మీ రిచ్చట ప్రచ్ఛన్నముగ కాలము గడపుచున్న రాజపుత్రులుగఁ దోఁచుచున్నది. అగునా?" అని యడుగ సత్యశీలుఁ డిట్లనియె. "మహారాజా! తామ్రలిప్తనగరనాథుని పేరుప్రతిష్ఠలు విని యాతనికడ నేదయిన నుద్యోగమును సంపాదించుకొని జీవింపవలయునను తలంపున ఆ నగరమునకేఁగి యొక వత్సరకాలము నివసించితిని. కాని చండసింహునిదర్శనము కాలేదు. అతఁడు స్త్రీలోలుఁడై యంతఃపురమందే నివసింపఁజొచ్చెను. మంత్రి రాజకార్యములు చూచుచుండెను. నాకడనున్న ధనము పూర్తియాయెను. ఏమి చేయుదును? కొన్నిదినము లేరికిఁ దెలియకుండ ఉసిరికపండ్లను దిని ప్రాణములు నిలుపుకొంటిని. కాని నాకా మహారాజు దర్శనము కలుగలేదు. అందువలన విసిగి వేసరి యీయరణ్యమునకు వచ్చి భగవన్నామమును స్మరించుచు కందమూలఫలముల భుజించి జీవయాత్ర చేయుచున్నాను. నాకింకను సంసారముమీఁద నాసక్తి నశింపలేదు. అందువలన నా తపము నిర్విఘ్నముగ నడచుట లేదు. నేను క్షత్రియకుల సంభూతుఁడను."

ఆమాటలు వినుచు చండసింహుఁడు మౌనముగా నుండెనేగాని ప్రత్యుత్తర మీయఁడాయెను; మనసున మిక్కిలి లజ్జం

పఁజొచ్చెను. ఆ రాత్రి చండసింహుఁ డచ్చటనే విశ్రమించి మరుసటిదిన ముదయమున సత్యశీలుని తన పురమునకుఁ దీసికొనివచ్చెను. అప్పటినుండియు సత్యశీలుఁడు ప్రభువు కృపకుఁ బాత్రుఁడై స్వీయధర్మములఁ గడుమెలఁకువతోడ నిర్వహింపఁజొచ్చెను.

ఒకదినమున చండసింహుఁడు సత్యశీలుని రాచకార్యము మీఁద విదేశములకుఁ బంపించెను. సత్యశీలుఁడు రాజాజ్ఞ ప్రకారమేఁగి తిరిగి వచ్చునప్పుడు సముద్రపుటొడ్డున నున్న దేవమందిరమందు పూజ యొనర్చి వెలుపలికి రాఁగా నచట నత్యంత సౌందర్యవతి యగు నొకకన్యక యుండుటను గాంచెను. ఆమె యపూర్వలావణ్యమునకు ముగ్ధుఁడై సత్యశీలుఁ డామెను దిలకింపుచుండ నామె "ఇచ్చటి కేల వచ్చితివి? జాతివిగ్రహమును బోలి నన్ను చూచుచు నిలుచుండఁ గారణ మేమి?" అని యడిగెను.

సత్యశీలుఁడు:—నాది తామ్రలిప్త నగరము. రాచకార్యముమీఁద విదేశముల కేఁగి తిరిగి స్వదేశమున కేఁగుచు మార్గమధ్యమున నిన్నుఁ గాంచి నివ్వెరపడి నిలుచుంటిని.

అన నా కన్యక యిట్లనియె: "ఈ పద్మ సరోవరమందు స్నానమొనర్చినయెడల నన్ను నీవు వివాహమాడఁగలవు." ఈ మాటలు చెవిసోఁకినంతనే సత్యశీలుఁడు పరమ సంతసమున న సరోవరమందు మునింగెను. కాని యాతఁ డాసరోవరమునుండి తలయెత్తి చూచునప్పటికి తామ్రలిప్త నగరమందు తన మందిరమం దుండెను. వెంటనే యాతఁడు తడి వస్త్రములు [illegible] కనవస్త్రములు ధరించి రాజసమ్ముఖమున కేఁగి తన

ప్రయాణ వృత్తాంతము నంతయు విన్నవించెను. చండసింహుఁడు పద్మ సరోవర వృత్తాంతమును విని యాశ్చర్యమొంది న న్నటకుఁ దీసికొని పొమ్మని చెప్పి సత్యశీలునితో బయలు దేరెను. వా రిర్వురును సముద్రతీరమున కరిగి శివమందిరమును జేరి పరమేశ్వరుం బూజించి వెలుపలికి వచ్చునప్పటికి నపూర్వ రూపరేఖావిలాసముల నలరారు ఆ కన్యకవచ్చి రాజ సమ్ముఖమందు నిలిచి యిట్లనియె: ‘‘మహారాజా! నేను మీ దాసురాలను. మీ యాజ్ఞానుసారము వర్తించుటకు వేచి యున్నాను.”

రాజు:—అటులయినచో నాకుఁ బ్రియుఁడగు నీ రాజపుత్రుని వివాహమాడుము. అనఁగా నా కన్నియ యిట్లనియె. “మహారాజా! నేను మిమ్ము వివాహమాడఁ దలఁచితిని. అట్టిచో మఱియొకని వివాహమాడు మని నుడువుట న్యాయమా?”

రాజు:—నా యాజ్ఞానుసారము వర్తింతు నని నుడివి యుంటివి. కావున మాటతప్పకుము. సత్యశీలుని వివాహమాడుము.

వేఱు మార్గము గానక ఆ కన్యక సత్యశీలుని వివాహమాడుట కంగీకరించెను. రాజు వారిర్వురకు గాంధర్వ విధిని వివాహమొనర్చి స్వీయనగరమునకుఁ దోడ్కొని వచ్చెను.

అంతవఱకు కథనుజెప్పి బేతాళుఁడు ‘‘మహారాజా! చండసింహసత్యశీలురయం దెవ్వని యుపకార మత్యుత్తమ” మని యడుగ విక్రమాదిత్యుఁడు “సత్యశీలునిది” అనెను.

బేతాళుఁడు:—ఎందువలన?

విక్రమాదిత్యుఁడు:—రాజు సత్యశీలునకు మిక్కిలి యుపకార మొనర్చెను. కాని చండసింహుఁడు వేట కరిగి నప్పుడు సత్యశీలుఁ డొనర్చిన యుపకారము మిక్కుటము.

బేతాళుఁడు విక్రమాదిత్యుని సదుత్తరమునకు సంత సించి కనురెప్పపాటున మాయమై చెట్టున వ్రేలాడఁ జొచ్చెను. అణుమాత్రమైనను చలింపక విక్రమాదిత్యుఁడు మాట యిచ్చినప్రకారము సన్న్యాసికి శవమును దీసికొనిపోయి యీయవలయు నను దృఢసంకల్పమున మరల నా శవమును మూఁపున నిడుకొని బయలుదేరి వచ్చుచుండ మార్గమధ్య మున బేతాళుఁ డీ క్రింది కథను ప్రారంభించెను.

9-వ కథ

అనంగపురమను నగరమున అర్థదత్తుఁ డని మహాధనికుఁ డగు వైశ్యుఁడొకఁ డుండెను. అతనికి రూపలావణ్యరాశి యైన మదనసేన యను కుమార్తె యుండెను. ఆమె యొకనాఁడు శృంగారవనమున విహరించుచుండఁగా సోమదత్తుఁ డను వణి క్పుత్రుఁడొకఁ డామెను కనెను. ఆమె సౌందర్యమునకు పర వశుఁడై యతఁ డామెను తన్ను వివాహమాడఁ బ్రార్థించెను. అంత నక్కన్నియ తన్నిదివరలోనే తండ్రి సముద్రదత్తునకు వాగ్దానము చేసియుండుట నాతని కెఱిఁగించెను. సోమదత్తుఁడు "ఏమయిన నగుఁగాక, నీవులేక నేను బ్రతుకఁజాలను. నీవు సమ్మతింపకుండిన ప్రాణహత్య చేసికొనెదను" అనియెను. అంతట మదనసేన నతఁడు తన్నెక్కడ బలాత్కరించునో యని భయపడినదై "అటులయిన, నా వివాహము కానిమ్ము. మగనిఁ గూడకయే నీయొద్దకు వచ్చిపోయెదను" అని పలికెను. సోమ

దత్తుఁ డామెను నమ్మలేక శంకించుచుండఁగా, మదనసేన యొట్టుపెట్టుకొని సత్యముచేసి విడిపించుకొని వెఱపుతో నిల్లు సేరెను. సోమదత్తుఁడును సంతుష్టినొంది యింటికి వెడలెను. మదనసేనను సముద్రగుప్తుని కిచ్చి వివాహమొనర్చిరి. ఆమె శయనాగారమున కేఁగి మిక్కిలి మౌనముగ నొకమూలఁ గూర్చుండెను. అప్పుడు సముద్రగుప్తుఁడు పలువిధములనామెను పలుకరించెను, కాని చాలవఱకు మౌనముగ నుండి చివరకు భర్తను చూచి సోమదత్తునివృత్తాంత మంతయు పూసగ్రుచ్చినట్లు "నే నిప్పుడే యాతనికడ కేఁగుట కాజ్ఞయిందు" అని వేఁడఁగా సోమదత్తుఁ డిట్టికోరికఁ గోరరాదని యనేక విధములఁ జెప్పి చూచెను. కాని ప్రయోజనమేమియుఁ గాన్పింపనందున చివరకు విధిలేక యనుజ్ఞ యిచ్చెను.

సర్వాలంకార భూషితయగు మదనసేన ఆ రాత్రియే యటనుండి బయలుదేరి సోమదత్తుని గృహమున కేఁగుచుండ మార్గమం దామె నొక దొంగ యడ్డగించి నగల నన్నిటిని ఒలిచి యిటఁ బెట్టుమనెను. అప్పుడు మదనసేన దొంగను పలుప్రకారములఁ బ్రార్థించి "నేను హిరణ్యదత్తుని పుత్రికను. మదనసేన యనుదానను. మిక్కిలి కష్టముమీఁద భర్త యనుజ్ఞ వడసి ప్రతిజ్ఞారక్షణకొఱకు సోమదత్తుని గృహమున కేఁగుచున్నాను. నీ విచ్చటనే నాకొఱకు కాచుకొనియుండుము. ముహూర్తకాలములోఁ దిరిగివచ్చి నగల నీ కిచ్చి యింటి కేఁగుదును." అని ప్రార్థింప దొంగ యామె మాటలు విశ్వసించి యచ్చటనే కాచుకొని యుందు నని చెప్పెను. మదనసేన యటనుండి బయలుదేరి సోమదత్తుని గృహమునకు నిర్గమించెను.

ప్రతిజ్ఞాప్రకారము మదనసేన సోమదత్తునియెదుట నిలువఁగా నతఁడు క్షణ మాలోచించి, "ఓ యువతీ, నీ సత్యమునకు సంతసించితిని. పరునిభార్యవు నీవు నాకేల? ని న్నితరు లెవ్వరును చూడకముందే వచ్చినదారి నింటికి వెళ్లుము." అని పలికి ఆమెను వదలివేసెను. అంత నామె మరల దొంగ తన్నెదురు చూచుచుండిన స్థలమునకు వచ్చెను. వాఁడును ఆమెను పోయియుండిన చోట జరిగిన వృత్తాంత మడిగి తెలిసికొని "అటులైనయెడల నేనును నీ సత్యమునకు మెచ్చితిని. నీ ఆభరణములతో నింటికి పొమ్ము" అని పలికి తోడుగా వెంటఁబోయి ఆమె నింటియొద్ద విడిచి తనదారిని వెళ్లెను. అట్లు మదనసేన తన వ్రతమున కేలాటి చెఱుపును లేక పతియొద్దకుఁ బోయెను. అతఁడును జరిగిన వృత్తాంతమంతయు నడిగి తెలిసికొని, భార్య సత్ప్రవర్తనగలదియే యని యెఱిఁగి ఆమె సత్యమునకును మంచి మనసునకును సంతోషించి తన యింటికి తగినదని యెంచి సముద్రదత్తుఁడా యిల్లాలితో సుఖముండెను.

కథ పూర్తియైనంతనే బేతాళుఁడు రాజును గాంచి యిట్లనియె. "రాజా! సోమదత్తుఁడు, సముద్రగుప్తుఁడు, దొంగ వీరి యం దెవ్వరి ప్రవర్తన మత్యుత్తమము?" అన విక్రమాదిత్యుఁ డిట్లనియె. "సముద్రగుప్తుఁడు భార్యను ప్రథమమున వలదనెను. తర్వాత నంగీకరించెను. అందువలన నాతని చరిత్రయం దుత్కృష్టత కానరాదు. సోమదత్తుఁడు తన యపరాధమును మదనసేన భర్త రాజున కెఱిఁగించు నని భయపడి వదలివేసెను. దొంగ ధన పిశాచము. ధనము కనఁబడినయెడల నాతఁడు వీడఁడు. ఆ దొంగ స్త్రీరత్నమును నగలతోడ విడి

చెనుగాన వాఁడే త్యాగి. కావున నా ముగ్గురయందును బొంగ యొనర్చిన కార్యమే యత్యుత్తమము." పిమ్మట యథాప్రకారము జరిగెను.

10–వ కథ

బేతాళుఁడు తొంటియట్లు ప్రారంభించెను:—

మహారాజా, ఒకప్పుడు గౌడదేశమును గుణశేఖరుఁను రాజు పరిపాలించుచుండెను. ఆతఁ డుత్తముఁడు. మంత్రి యభయచంద్రుఁడు, బౌద్ధధర్మావలంబియు, ధార్మికుఁడు నై యుండెను. మంత్రియెడల రాజునకు మిక్కిలి గౌరవము. కావున నాతనిమాట నెప్పుడును నిర్లక్ష్య మొనర్చి యెఱుఁగఁడు. మంత్రిప్రోత్సాహమున గుణశేఖరుఁడుగూడ బౌద్ధ ధర్మమును స్వీకరించెను. అంతట గౌడదేశమునం దెచ్చటను హిందూధర్మసంబంధ మగు పూజాదులు జరుగరా దని శాసించెను.

ఆయాజ్ఞ ప్రజలకు మిక్కిలి కష్టముగ నుండెను. కాని చేయునదేమి? రాజాజ్ఞను తృణీకరించిన మరణము తప్పదు. అందువలన ప్రజలెల్లరును భయపడుచుండిరి. హిందూధర్మ సంబంధ మగు బాహ్యానుష్ఠానముల విసర్జించిరి. కాని హిందూ ధర్మమును వీడకుండిరి. సుచతురుఁ డగు అభయచంద్రుఁడు బౌద్ధమతమును స్వీకరించినవారిని మిక్కిలి పొగడుచుండెను. అందువలన మంత్రి యనుగ్రహముకొఱకును, రాజాదరణము కొఱకును అనేకులు బౌద్ధమతమునఁ జేరుచుండిరి. కొలఁది వత్సరములలో గౌడదేశమందు సంపూర్ణముగ బౌద్ధమతము వ్యాపించెను.

అది వినినంతనే యశఃకేతున కా కన్యను కనులారఁ గాంచవలయు నను కోరిక కలిగి రాజ్యభారమును మంత్రి హస్తగతమొనర్చి కొంతమంది పరిజనులతోడ బయలుదేరి యా యా తీర్థముల సేవించుచు రామేశ్వరముచేరి రామలింగస్వామినిఁ బూజించి ద్వారముకడ నిలఁబడి సముద్రమువంకఁ దిలకించుచుండెను. ఆ మహాజలధినుండి సువర్ణవృక్షము క్రమక్రమముగ బైటికివచ్చి తరంగములచేత నటునిటు కదలుచుండెను. ఆ కదలుచున్న వృక్షశాఖలమీఁదఁ గూర్చుండి యొక దివ్యసుందరి వీణాగాన మొనర్చుచుండ నా మృదుమధురగానమునకు యశఃకేతుఁడు మైమరచి యుండెను. చివరకు యుక్తాయుక్త విచక్షణ జ్ఞానమును గోల్పోయి ఆ కన్నియను సమీపింపవలయు నని సముద్రమం దుఱికెను. రాజు మంచి యీతగాఁడు. అందువలన నీఁదుచుఁ బోయిఁ దానిని సమీపించి ఆ వృక్షమును బట్టుకొనెను. వెంటనే యా వృక్షము మునిఁగెను. దానితోడ రాజు పాతాళలోకమును జేరెను.

పాతాళలోకమున కేఁగిన పిమ్మట నా సుందరి యశఃకేతుని చూచి యిట్లడిగెను. "నీ పుట్టు పూర్వోత్తరము లెవ్వి? ఇట కేల వచ్చితివి?"

యశఃకేతుఁడు:—నేను అంగదేశాధీశుఁడను. యశఃకేతుఁ డనువాఁడను. నీ రూపలావణ్య విలాసములకు ముగ్ధుఁడనైతిని. నీ యపూర్వగానమునకు మరింత ముగ్ధుఁడనై యిట వచ్చితిని. అనుగ్రహముంచి నన్ను వివాహమాడుము. చరితార్థుఁడ నగుదును.

ఆతనిమనోగతాభిప్రాయమును గ్రహించి యా దివ్యసుందరి యిట్లనియె. "మహారాజా! నీవు నేను చెప్పినటులు

ప్రతిజ్ఞఁ బూనినయెడల నిన్ను వివాహమాడుదును. ప్రతినెల కృష్ణపక్ష చతుర్దశినాఁడు నేను నీతో నుండను. అపు డెటకో పోవుదును. నన్ను నీ వడుగఁగూడదు. అడ్డగింపఁగూడదు. అందులకుఁ గారణము కలదు."

రా జీమాటలకుఁ బరమానందభరితుఁడై యామె చెప్పిన చొప్పున ప్రతినఁబూని గాంధర్వ విధి నామెను వివాహ మాడెను. పిమ్మట వారిరువురును పాతాళలోకమున సుఖముగఁ గాలము గడపుచుండిరి. కృష్ణచతుర్దశి వచ్చెను. ఆమె యశఃకేతునితో "నేఁడు చతుర్దశి. నీ విచట నే నెన్నెదురు చూచుచుండుము." అని అతనివలన సెలవుగొని వెలుపలి కేఁగెను. రాజును ఇందులకు కారణముఁ దెలిసికొనవలయు నని కుతూహలము మిక్కుటము కాఁగా "నన్నిచట నుండుమనఁ గారణమేమి? ఆ విషయమును పరామర్శింపవలయును" అని తలంచి రాజు రహస్యముగ కత్తిం బూని యామె వెనువెంటఁ బోయెను.

రాత్రి రెండవ జామున నొక వికట రూపియగు ఘోరరాక్షసుఁడు భయంకరముగ గర్జించుచువచ్చి యాసుందరిని మ్రింగివేసెను. యశఃకేతుఁడు అతికోపమున మండిపడుచు ఒరనుండి కరవాలమును బెరికి త్రుటిలో నా రాక్షసుని శిరమును ఖండించెను. పర్వతాకారుఁ డగు నాఘోరరాక్షసుని తల యొకవైపునను మొండె మొకవైపునను బడెను. అప్పుడు ఆ రాక్షసుని శరీరమునుండి మృగాంకవతి రాహువిముక్తయగు చంద్రరేఖనుంబోలి ప్రకాశించుచు వెలువడి రాజును కౌఁగిలించుకొని పరమానందమున నిట్లనియె. "మహారాజా!

కథను ముగించి మంత్రి మనోవ్యాధికి కారణ మే మని ప్రశ్నించె. విక్రమాదిత్యుం డిట్లనియె: ‘‘యశఃకేతుండు స్వీయ సుఖమునం దున్మత్తుండై ప్రజాక్షేమమును మరచెను. దేవకన్యక సాంగత్యమువలన నాతం డిక రాజ్యపరిపాలనకుం గడంగం డని తలంచి చేయునది లేక కృశించి మనోవ్యాధివలన మరణించెను. అందువలన మంత్రి సర్వోత్తముండు.”

పిమ్మట యథాప్రకారము జరిగెను.

12-వ కథ

విక్రమాదిత్యుండు మరల జేతాళుని తెచ్చునపుం డతం డీ క్రింది కథను చెప్పం దొడంగెను.

మహారాజా! దేవస్వామియను పరమయాజసియగు నొక బ్రాహ్మణుండు కాశీనగరమున నివసించుచుండెను. ఆతండు బుద్ధియందు బృహస్పతి; ధనమున కుబేరుండు. ఆతని భార్య పేరు లావణ్యవతి. ఆమె రూపలావణ్యములందును విద్యాబుద్ధులందును వాసిం గాంచియుండెను. ఆ దంపతులు మిక్కిలి యన్యోన్యానురాగమునం బ్రవర్తించుచుండిరి.

గ్రీష్మకాలము. గాడ్పులు మిక్కుటముగ వీంచుచుండెను. ఆ బ్రాహ్మణదంపతులు దివ్య సౌధముమీందం బండువెన్నెలయందు శయనించియుండిరి. అప్పు డొకగంధర్వుండు విమానారూఢుండై యాకాశమున విహరించుచు భర్తచెంత నిదురించుచున్న లావణ్యవతినిం గాంచి మోహించి యామెకు మెలకువ రాకుండ నొనర్చి రథముపై నెక్కించుకొని పలాయన మాయెను.

కొంతవడికి నిదురించుచుండిన దేవస్వామి మేల్కొని శయ్యయందు భార్య లేనందులకు దుఃఖించి పిచ్చివానిని బోలి వెనుకఁజొచ్చెను. బిగ్గరగఁ బిలువసాగెను. కాని లావణ్యవతి యెచ్చట? పురమంతయు వెదకెను. సమీప గ్రామములు దిరిగెను. లావణ్యవతినిఁ గానకుండుటచేత సన్యాసిని బోలి దేశవిదేశములు దిరుగుచుండెను.

ఒకదినమున తిరిగి తిరిగి దేవస్వామి యొక బ్రాహ్మణుని యింటి కేఁగెను.

భోజనము బెట్టి నన్ను బ్రతికించుఁడని ప్రార్థించెను. వెంటనే యా గృహాధిపతి యగు బ్రాహ్మణుఁడు చెంబునిండ పాలు దెచ్చి త్రాగు మని బ్రాహ్మణునిముం దుంచెను. కాని యొక ముహూర్తమునకుముం దా పాలయందు పాము విషము గ్రక్కియుండుట యెరికిని తెలియదు. ఆ పాలను ద్రావినంతనే బ్రాహ్మణుఁడు గిరగిరఁ దిరిగి క్రిందపడి విషమిశ్రిత క్షీరము నిచ్చితి వని నుడివి మరణించెను. బ్రాహ్మణుఁ డాతని మరణమును గాంచి పరితపించుచు భార్యను బిలిచి "దుర్మార్గురాలా? పాలయందు విషమును గలిపియుంచితివి. ఆ విషయము దెలియక బ్రాహ్మణుని కొసంగితిని. దానిని ద్రావి యాతఁడు మరణించెను. నీవు ఘోరపాపివి. నీమోము చూడరాదు." అని నుడువుచు నామెను వెడలఁగొట్టెను".

కథను ముగించి యా బ్రహ్మహత్య కెవరు కారకులు. అనఁగా విక్రమాదిత్యుఁ డిట్లనియె. "సర్పమునకు పాపము లేదు. శత్రువు తన్ను తినుచుండఁగా వశము తప్పియున్నది. కాన దానియందు దోషము లేదు. డేగ ఆఁకలిగొని తనకు లభించిన

డానిని తినుచుండెను. అన్నదాత లయిన యా దంపతుల యందుగాని అందొకరియందేగాని దోషము చెప్పఁగూడదు."



అను విషయమో
పట్టుదలను

చెట్టున వ్రేలాడఁ జొచ్చెను. విక్రమాదిత్యుఁ డటకేఁగి యా శవమును భుజముమీఁద నిడుకొని బయలుదేర మార్గమధ్యమున నద్దానిదికథ నుపక్రమించెను.

శ్రీ వేమన గ్రంథాలయము, తేలప్రోలు.

3-వ కథ

మహారాజా, అయోధ్యాపురాధీశ్వరుని పేరు రణధీరుఁడు. ఆతఁడు మహాపరాక్రమవంతుఁడును సుచతురుఁడునై ధర్మపథమున రాజ్యపరిపాలనం బొనర్చుచుండెను. ఆ రాజ్యమునందలి దుర్మార్గుల కాయన పేరు సింహస్వప్నమై యుండెను. అందువలన ప్రజలు కడుపులోని నీరు కదలక హాయిగ జీవించుచుండిరి. కాని యాకస్మికముగ నా నగరమున దొంగల బాధ మిక్కుటమాయెను. ప్రజలు పరిపరివిధముల, పరితపింపఁ జొచ్చిరి. రణధీరుఁడు దొంగలం గనిపెట్టుటకు పురమంతయు గస్తితిరుగుటకు రాజభటుల నియోగించెను. కాని దొంగల [illegible]ధవము తరుగకుండెను. అందువలన ప్రజలు నురల [illegible]కేఁగి దొంగలు పెట్టుచున్న బాధలనుగూర్చి మొర [illegible] "మీరెల్ల రేరాత్రి సుఖముగ శయనింపుఁడు. [illegible]చ్చి దొంగల రూపు మాపెదను." అని [illegible]ము దెచ్చుకొని గృహముల కేఁగిరి.

[illegible] శస్త్రాస్త్రములు ధరించి మారువేష [illegible] బయలు దేరి కొంతదూర మేఁగు [illegible]జుం గని నీ వెవ [illegible]ను. అంతట [illegible] సాటివాఁ

డవు. కాన నా యింటికి రమ్ము, నీకు విందొనర్చెదను" అని పిలిచెను. రాజును అంగీకరించి అతనిని వెంబడించెను.

రణధీరుని వెంట నిడుకొని దొంగ యొక ధనికుని గృహము కడ రాజును గాపుంచి తాను కన్నముఁ ద్రవ్వి లోనఁ బ్రవేశించి మిక్కిలి వెలగల నగలను హరించుకొని వెలుపల వచ్చెను. అచటినుండి రాజును వెంట నిడుకొని యూరి వెలుపల నొకటి రెండు యోజనముల దూరమున నుండు నడవిలో తనయింటికిఁ బోయెను. ఆతని యిల్లు నేల క్రింద నుండెను. లోపలికి సురంగము దారిని ప్రవేశించెను. దొంగ రాజును కూటమున నిలిపి తాను లోనికి వెళ్లెను. అప్పుడొక వృద్ధ స్త్రీ వచ్చి, అయ్యా "మీరు మిక్కిలి తెలివి తక్కువ వని [illegible] ఇఁక నైనను జాగ్రత్తపడి యాతఁడు వచ్చులోపల [illegible] ము గండు. లేనిచో మీ ప్రాణములు దక్కవు. ఆ[illegible] వచ్చి మిమ్ము యమసదనమున కనుపును." [illegible] మాటలకు రాజు హృదయము చలించెను. ఒకింత [illegible] దుచు "నేను వచ్చిన మార్గమును మరచితిని. కాప్రస[illegible] చూపిన పాఱిపోవుదును". అనెను. వెంటనే యా స్త్రీ రాజునకు మార్గమును చూపెను. రాజు తీవ్రగమనమున సహ్యాద్యాపురము చేరి ఆ రాత్రియే దండు గూర్చుకొని వచ్చి [illegible] దొంగ యింటిని ముట్టడించెను.

రాజు ఇంటి నిట్లు ముట్టడింపఁగా దొంగ తన గుట్టు బయటపడె నని యెఱిఁగి పౌరుషము మెఱయ యుద్ధమునకు వచ్చెను. యుద్ధము ఘోరమాయెను. రాజాతనితో స్వయముగా కత్తిగట్టి యుద్ధముచేసి వానిని నేలం గూల్చి ప్రాణముల

తోనే పట్టుకొనెను. అంతట వానిని తదీయ ధనరాసులతోఁ గూడ నూరికిఁ గొనిపోయి తెల్లవారఁగానే వానిని కొఱుత వేయ నుత్తరువు చేసెను. ధనము గోల్పోయిన వారి కెవరి ధనము వారి కిప్పించెను.

రాజభటులు దొంగను తల గొరిగించి సున్నపు బొట్లు బొడిచి గాడిదెమీఁద నెక్కించి యాతని చరిత్రను చాటించుచు నాతని సందు గొందులయందుఁ గూడఁ ద్రిప్పు చుండిరి. చివరకు వానిని ధనికుఁడగు రత్నదత్తుఁడను వైశ్యుని సౌధము కడకుఁ దీసికొనివచ్చిరి. ఆయనకు రత్నవతి యను నొక పుత్రికయుండెను. ఆమె దొంగను చూచుచు నిలు చు[illegible] హృదయము కరగి కన్నీరు గార్చుచు తండ్రితో "మహా[illegible] జెప్పి యే యుపాయముననైనను దొంగను కొఱుత [illegible]ఁపుఁడు. అట్లొనర్పనియెడల నిప్పుడే నేను మర[illegible] అను పుత్రిక వాక్యములకు రత్నదత్తుఁ డాశ్చర్య[illegible] నిమేషకాల మూరకుండి యిట్లనియె. "అమ్మా, [illegible]జదొంగ. ఎంతమంది మానవుల ప్రాణములనో హ రించియున్నాఁడు. కొన్ని నెలలుగ నగరవాసులను కల్లోల పరచి రాజుతోఁ బోరాడి కొంత సైన్యమును రూపుమాపెను. అట్టి ఘోర కిరాతకుని బ్రతికించుటయా? రాజున కెట్లు విన్న వింతును? అట్లు చేసిన నొక వేళ నాతనితో నాకు సంబంధ ముండి యుండునని నన్నుఁగూడ కొఱుత వేయింపవచ్చును."

రత్నావతి తండ్రి మాటలను చెవినిఁ బెట్టక కన్నీరు కాల్వలై కారనేడ్చుచు నిట్లనియె. "తండ్రీ, నేను వానిని మన మునందు వివాహమాడితిని. ఎట్టి దుర్మార్గుఁడైనను ఆతఁడు

నాకు భర్త గదా? నీ కల్లుండు గదా? కావున నీ ప్రాణము లర్పించియైనను వానిని రక్షించుట నీకు ధర్మము. నీవా ప్రయత్నమునకుఁ గడఁగనియెడల నాకిప్పుడే మరణము తప్పదు."

రత్నదత్తుఁడు మిక్కిలి సంకటమునఁ దగుల్కొనెను. చేయునదేమి? దొంగను రక్షించుటెట్లు? ఇది యసంభవము. ప్రయత్నింపకుండిన రత్నావతికి మరణము తప్పదు. ఏమి చేయును? ఇట్లు తర్క వితర్కము లొనర్చుచు ప్రాణాధికురా లగు పుత్రిక మనోవాంఛను నెరవేర్చుటకై రణధీర మహా రాజును సమీపించి రత్నావతి ప్రార్థనను నివేదించెను. కాని ప్రయోజనమేమి? రాజు రత్నదత్తుని ప్రార్థన నెట్లు మన్నించును?

గజదొంగను పురమంతయుఁ ద్రిప్పి వధ్యభూమికిఁ గొని పోయిరి. రత్నావతి మనోవాంఛ నీడేర్చుటకు [illegible]
మహారాజు మందిరమున కేఁగెనను విష[illegible]
వ్యాపించెను. రత్నదత్తుని ఆతనిపు[illegible]
నగరవాసులు దూరఁజొచ్చిరి. [illegible]
పడిన జనులు వేనవేలుగ[illegible]
ముసు [illegible]
డాజ[illegible]

రత్నావతిసఁ గాంచి యిట్లనియె. "వత్సా, నీ సతీత్వమున కును, ధైర్యసాహసములకును మిక్కుటముగ సంతసించితిని. కావున నీవుఁ గావలసిన వరమును కోరు" మన రత్నావతి యిట్లు ప్రార్థించెను. "తల్లీ! కాత్యాయనీదేవీ! నా భర్తను బ్రతికింపుము." అనఁగా దేవి "నీ భర్త బ్రదికి ధార్మికుఁడై యుండి రాజునకు సంతుష్టి చేయును గాక" అని నుడివి యంతర్ధానమాయెను. దొంగ బ్రతికెను.

కథను పూర్తిచేసి బేతాళుఁ డిట్లనియె "మహారాజా! ప్రథమమున దొంగ యేడ్చుటకును తర్వాత నవ్వుటకును కారణ మేమి?"

విక్రమాదిత్యుఁడు, "అకారణ బంధువైన యీ వర్త ... చేయలేనుకదా యని దుఃఖించెను. ఏమి ... గోరుకొనినది. స్త్రీ మనస్సు చిత్రము ... చేత నవ్వెను." ఈ యుత్తరమునకు ... ప్రకారముగ వృక్షశాఖను

... త్సాహ

... ను

డను మంత్రిపైని రాజ్యభారము నిడి చంద్రప్రభయను రాణి తోడ శృంగారవనమందు కాలము గడపుచుండెను. బహుకాలమున కాదంపతులకు శశిప్రభయను పుత్రిక కలిగెను. ఆమె సౌందర్యరాశి. వయసువచ్చిన కొలందియు నామెసౌందర్యము మిన్ను ముట్టుచుండెను. ఆమె యొకదినమున తలిదండ్రుల యనుజ్ఞవడసి చెలికత్తెలతోడ శృంగారవనమందు విహరించుచుండెను. ఆ యుద్యానవనమం దెవ్వరును ప్రవేశింప వీలు లేదు. అటకుం బోవలసిన రాజాజ్ఞ బొందవలయును. అందువలన శశిప్రభ చెలికత్తెలతోడ నటనానందముగ విహరించుచుండెను.

ఆ యుద్యానవనము నంటి పోవుమార్గమున మనస్వి యను నొక బ్రాహ్మణ కుమారుఁ డేగుచు ప్రయాణమువలన మిక్కిలి డస్సి యా యుద్యానవనముఁ బ్రవేశించి యందలి సరోవరమున జలమును గ్రోలి పిపాసదీర్చుకొని యొక కానుగుచెట్టునీడన్మైమరచి నిద్రించెను. కాని యాతని కాయుద్యానవనమందు పురుషు లెవ్వరును బ్రవేశింపరా దను విషయము తెలియదు. అందుఁ బ్రవేశించునప్పుడు రక్షకభటు లెవ్వరు నాతనిఁ గాంచి యాటంకపఱుప లేదు.

శశిప్రభ చెలులతోడ విహరించుచు నిటునటుఁ దిరిగి యా బ్రాహ్మణ కుమారుఁడు నిదురించుచుండిన కానుగు వృక్షమును సమీపించెను. వారియందెల చప్పుడునకు మనస్వి యులికిపడి నిదురలేచి కూర్చుండెను. ఆకస్మికముగ సమ్ముఖమందు నిలుచుండిన భువనమోహిని యగు శశిప్రభను గాంచి మనస్వి మోహితుఁడాయెను. అప్పవాల్పక యామె సౌందర్య

మును గ్రోలఁజొచ్చెను. శశిప్రభయు దేవతల ధిక్కరించు చక్కదనమున వెలుంగుచుండిన మనస్విని మోహించి తదేక నిష్ఠతో నాతని రూప రేఖా విలాసముల నీక్షించుచుండెను. ఆ విషయమును కనుపట్టి చెలులు శశిప్రభ నటనుండి బలవంతముగ లాగుకొని మరియొక స్థలమున కేఁగిరి. ఆమె కనుమరుగైనంతనే మనస్వి విహ్వలుఁడై మూర్ఛిల్లి యావృక్షము క్రిందఁబడియుండెను.

ఆ యుద్యానవనము నంటియుండుమార్గముననే శశి, భూదేవుఁడు అను బ్రాహ్మణకుమారు లిర్వురు గురుకులమున విద్యాభ్యాసమును ముగించి స్వగ్రామమున కేగుచు మార్గాయాసమువలని పిపాసచే నా యుద్యానవనమునఁ బ్రవేశించి పుష్కరణియందు జలముఁ గ్రోలి కాకతాళీయన్యాయముగ మనస్విపడియున్న వృక్షముక్రిందికి వచ్చిరి. మూర్ఛిల్లియున్న బ్రాహ్మణ కుమారునిఁ గాంచి మంత్రతంత్రముల మూలమున నాతనికి దెలివివచ్చున ట్లొనర్చి "నీ వెచ్చటినుండి వచ్చుచుంటివి? ఇచ్చట మూర్ఛిల్లుటకుఁ గారణ మేమి?" అని ప్రశ్నింప మనస్వి "నా పుట్టు పూర్వోత్తరములు చెప్పుటవలన లాభ మేమి? నేనత్యంత మనోదుఃఖమున మూర్ఛిల్లియుంటిని. అనవసరముగ నన్ను మేల్కొలిపితిరి. కాని నా మనోవాంఛను బూర్తి చేయఁగలరా? అది సాధ్యమా?" అని నుడివెను.

భూదేవుఁడు:—నీ మనోదుఃఖమును వెల్లడి పలుకుము. అది యెట్టి దుర్ఘటకార్యమైనను త్రుటిలోన సాధింతును. దుఃఖింపకుము.

మనస్వి—మహాశయా, క్షణకాలముక్రిందట చెలులతోడ నిటకు రాజకన్యక వచ్చెను. ఆమెను గాంచినంతనె మోహ పరవశుండ నైతిని. ఆమెయు నన్ను ఱెప్పవాల్పక చూచుచుండ నామె చెలికత్తె లిటనుండి తప్పించి యెచ్చటికో తీసికొనిపోయిరి. ఆమెను గాంచని యెడల నాకు మరణము తప్పదు. ప్రతిజ్ఞానుసార మామె కడకు నన్నుఁ దీసికొనిపొండు.

భూదేవుఁడు:—నీవు చింతింపకుము. ఒక్క నారము దినములలో నామె దర్శనమగునటులు చేయుదును. తదనంతర మామెను నీవు వివాహమాడవచ్చును.

అని నుడివి యా బ్రాహ్మణ కుమారులు మనస్విని వెంటనిడుకొని స్వగ్రామమున కేఁగిరి. రెండు మూఁడు దినములు గడచిన పిమ్మట భూదేవుఁడు మనస్వి కొకమంత్ర ముప దేశించి తదేకనిష్ఠతో నా మంత్రమును జపింపు మనెను. ... శ్రద్ధాభక్తులతో నా మంత్రమును జపించెను. నా... తఁడు పదునాఱు వత్సరముల ప్రాయముగ...
... మారిపోయెను.
...స్విం ...

సీనుని జేసి యిట్లనియె. "బ్రాహ్మణోత్తమా, తామేల యిటకు వచ్చితిరి? నాచేత నయినంతవఱకు తమ మనోవాంఛితము నీ డేర్ప సంసిద్ధుఁడను."

భూదేవుఁడు:—మహారాజా! నేను గంగాతీరమం దొక పల్లెయందు నివసించుచుందును. ఈమె నా పుత్రుని భార్య. పుట్టినింటనుండి యామెను దోడ్కొని స్వగ్రామమున కేఁగునప్పటికి మా పల్లెయం దొక మానవుఁడైనను కాన రాఁడు. కుటీరముల తలుపులు బిగించియున్నవి. స్ఫోటక భయమువలన గ్రామములోని వారెల్లరు పారిపోవ వారితోడ నా భార్యయుఁ బుత్రుఁడునుగూడ నెచ్చటికో పోయిరి. వా రెచ్చటనైన బ్రతికియున్నారో, లేక మరణించిరో నాకుఁ దెలి యదు. అందువలన తగిన స్థలమునం దీమె నుంచి భార్యా పుత్రుల వెదుకఁ దలఁచితిని. మీరు మిక్కిలి యుత్తములు. ...మున రాజ్యపాలనం బొనర్చుచున్నారు. కావున తమ ...న్నె నునిచినయెడల నెట్టి శంకలకును తావుం ...ణోక్షత నుంచుఁడు. నాకు మ...

రాజు అంతఃపురమునకుఁ దోడ్కొనిపోయి పుత్రికను చూపించి వృత్తాంతమంతయుఁ జెప్పి యట నుండుమని చెప్పెను. [illegible]



ప్రభయు యువతిని మిక్కిలి [illegible]రవించుచుండెను. వారి [illegible] రకు మైత్రి దినదిన ప్రవర్థమా[illegible]మగుచుండెను. ఇట్లు కొ[illegible]

దినములు గడచునప్పటికి మనస్వి శశిప్రభకు ప్రాణాధిక ప్రియుఁడాయెను. ఒక దినమున మనస్వి రాజపుత్రి మనోభావమును గ్రహించుట కిట్లనియె. "శశిప్రభా! నిరంతరమేదియో యొక విషయము నిన్ను కలవరపరచుచున్నట్లు తోఁచుచున్నది. అందువలన నెప్పుడును విచారముగ గన్పడుచుందువు. ఆ విషయమును నాకు చెప్పఁగూడదా?"

శశిప్రభ:—సఖి నీయెదుట నాకు దాపరికమేమున్నది? ఒక దినము నేను శృంగార వనమందు విహరించుచుంటిని. అప్పుడు పరమ సుందరుఁడగు నొక బ్రాహ్మణ కుమారుని సందర్శించితిని. అప్పటి నుండియు నాతని మూర్తి నా హృదయమం దంకితమై పోయినది. కాని యేమి చేయుదును? ఆతని పుట్టు పూర్వోత్తరములు నాకుఁ దెలియవు. ప్రథమ దర్శనమున నడిగి దెలిసికొనుటకు లజ్జించితిని. ఈ విషయము నీకుఁ దప్ప మరి యెవ్వరికినిఁ దెలియదు. కావున నీ వెవరికినిఁ దెలియనీయవలదు.

ఆమె నుడువులకు మనస్వి మిక్కుటముగ సంతసించి "ఆ బ్రాహ్మణునిఁ దీసికొని రాఁగలిగిన యెడల నాకేమి బహుమతి యొసంగెదవు?" అని యడిగెను.

శశిప్రభ:—నా జీవితమును నీ సేవ కుపయోగింతును.

అంత మనస్వి ప్రక్కనున్న గదిలోని కేఁగి మంత్రోచ్చారణమువలన నిజ రూపమును ధరించి శశిప్రభ సమ్ముఖమున వచ్చి నిలిచెను. ఆమె హతబుద్ధియై నివ్వెరపడి చూడఁజొచ్చెను. కొంత వడికిఁ దెప్పరిల్లి "ఇంత కాలముగ స్త్రీ రూపమును ధరించి నాచెంత నుంటివి? నిమేషకాలమున

నిజరూపము నెట్లు దాల్పఁ గలిగితివి." అని ప్రశ్నింప మనస్వి తాను మూర్ఛపోయినది మొదలు జరిగిన వృత్తాంతమంతయు వివరించి చెప్పెను. వెంటనే వారిర్వురు గాంధర్వవిధానమున వివాహమాడిరి. పిమ్మట మనస్వి యువతీ రూపముననే యట కొంతకాల ముండెను. కాని యెవ్వరికి నాతని విషయము తెలియరాదు.

అంతఃపురమందు రహస్యముగ నుండుటకు మనస్వి యంగీకరింపక యొక దినమున నిజరూపమును ధరించి పలాయన మాయెను. ఆ విషయము రాజునకుఁ దెలిసి మిక్కిలి చింతించెను. ఆ వృద్ధ బ్రాహ్మణుఁడు వచ్చి నాకోడ లెచ్చట నని యడిగిన నేమి చెప్పుదు నని పరితపింపఁ జొచ్చెను. మనస్వి భూదేవుని కడ కేఁగి జరిగిన వృత్తాంతమంతయు విన్నవించెను. ఆ విషయమును విని భూదేవుఁడు అతని ప్రజ్ఞకు చాల సంతసించి వెంటనే మరల నా వృద్ధ బ్రాహ్మణ రూపమును దాల్చి మిత్రుఁడగు నిరువది వత్సరముల వయసుగల శశిని వెంట నిడుకొని శివపురమును జేరి యశఃకేతుని కొలువుకూటమునఁ గాంచెను. ఆ బ్రాహ్మణుని చూచి రాజు మిక్కిలి యాదర వాక్యముల సన్మానించి యిట్లనియె. "బ్రాహ్మణోత్తమా! మీ రనేకదినములుగ రాకుండుటకుఁ గారణమేమి?"

భూదేవుఁడు:—మహారాజా, నా భార్యాపుత్రులకొఱ కనేక దేశములు తిరిగి తిరిగి చివరకొక పల్లెయం దుదరపోషణ మొనర్చుకొనుచుండఁగా వారినిఁ గలిసికొంటిని. నా భార్య గతించినది. వీఁడు నా పుత్రుఁడు. కావున కోడలిని వెంట నిడుకొని స్వగ్రామమున కేఁగవలయు నని వచ్చితిని.

రాజీ మాటలు విని బ్రాహ్మణ శాపమునకు భయపడుచు చేతులు జోడించుకొని "మీ కోడ లెవరికిఁ దెలియకుండ నెచ్చటికో పాఱిపోయినది." అని నుడివి యాతని పాదములమీఁదఁ బడెను. కాని బ్రాహ్మణుఁడు క్రోధమువలన మండి పడసాగెను. శపింపఁబోవునట్లు నటించుచు తీవ్ర దృష్టుల నాతనిం జూచుచు నిట్లనియె. "హా! నీవు సన్మార్గుఁడవని విశ్వసించి కోడలిని నీకడ విడిచి పోయితిని. అట్టిచో నీవు జాగ్రత్తగ నామెను చూచుకొనకుండుటవలన పలాయనమై యుండును. ఆమె పలాయనమైనది తెలిసినదే వెదకుటకు మనుష్యులను బంపితివా? స్వయముగ నీవు విచారించితివా? నిర్లక్ష్యముగ నుండి నా కడ నక్క వినయములు చూపుచున్నావు. దీనికి తగిన శిక్ష నీ వనుభవింపక తప్పదు. శాప మిచ్చెదను. కాదందువా శీఘ్రము మామెను దెచ్చి నాకుఁ జూపింపుము. చేత కాదందువా నీ పుత్రికనిచ్చి వీనికి వివాహ మొనర్పుము."

అనఁగా యశఃకేతుఁడు గజగజవణఁకుచు చేతులు జోడించుకొని "బ్రాహ్మణోత్తమా! నాయపరాధమును సైపుఁడు; నన్ను మన్నింపుఁడు; శుభలగ్నమును నిర్ణయించిన నా పుత్రిక నీతని కిచ్చి వివాహ మొనర్తును." అని ప్రార్థించెను. అంత నా బ్రాహ్మణుఁ డొకమంచిదినమును నిశ్చయింపఁగా నాఁడొక శుభలగ్నమున వివాహ మొనర్చి యామెను ధనకనక వస్తువాహనములతోడ బ్రాహ్మణుని గృహమునకుఁ బంపెను. ఆమెను భూదేవుఁడు వెంట నిడుకొనిరాఁగా శశియు, మనస్వియు శశి ప్రభనుగూర్చి నా భార్య నా భార్య యని తగవులాడఁ జొచ్చిరి."

అని కథను ముగించి బేతాళుఁడిట్లనియె:—“శశిప్రభ ఆ యిర్వురయం దెవని భార్య?” అని ప్రశ్నింప విక్రమాదిత్యుఁడు “శశిప్రభ మనస్విభార్య” అనెను.

బేతాళుఁడు:—ఎందువలన?

విక్రమాదిత్యుఁడు:—అదివరకే వారిర్వురకు వివాహ మాయెను. ప్రథమభర్త బ్రతికియుండఁగా శాస్త్రము ప్రకారము మఱియొకని వివాహమాడ వీలులేదు. శశిప్రభకును శశికిని జరిగిన వివాహము శాస్త్రవిరుద్ధము. అది వివాహమే కాదు.” అను సిద్ధాంతమునకు బేతాళుఁ డెంతయు సంతసించి విక్రమాదిత్యుని ఇంకను పరీక్షింప నిశ్చయించి త్రుటిలోన నేఁగి శ్మశానమందలి వృక్షమున వ్రేలాడఁజొచ్చెను. విక్రమాదిత్యుఁడు వెనుదీయక సన్యాసి కిచ్చిన మాటను నెరవేర్చు నిమిత్తము తిరిగి యా వృక్షము కడ కేఁగి యాశవమును దీసికొని వచ్చుచుండఁ గొంతదూరము వచ్చునప్పటికి బేతాళుఁడు “రాజా, శ్రమనివారణమునకై మంచి కథయొకటి చెప్పెద, విను” మని క్రిందికథ ప్రారంభించెను.

15–వ కథ

మహారాజా, సర్వరత్నములకు నిల్లగు హిమాలయ పర్వతముల చఱియలో కాంచనపురమని నగరమొకటి కలదు. ఆ నగరమున పూర్వకాలములో జీమూతకేతువను విద్యాధర రాజు ఏలుచుండెను. అతనియింటితోఁటలో వంశపారంపర్యముగ నొక కల్పవృక్ష ముండెను. ఆ కల్పవృక్ష ప్రసాదంబున మహాజ్ఞానిని ఒక పుత్త్రుని పొందెను. ఆ పుత్రునకు జీమూత

వాహనుఁ డని పేరు. అతఁ డెల్లప్రాణులందును కనికరము గలవాఁడు; పితృశుశ్రూషణపరుఁడు. అతనికి ప్రాయమువచ్చి నదే తండ్రి యతనికి, యౌవరాజ్యాభిషేకము చేసెను.

అతఁడు కొంతకాల మిట్లుండఁగా మంత్రు లతనితో "ఈ కల్పవృక్షమును సర్వదా నీవు పూజచేయవలయును. ఇది యుండఁగా ఎట్టి శత్రువులును మనల బాధింపనేరరు". అని చెప్పిరి. అంతట దయాపరుఁడు జీమూతవాహనుఁ డిట్లు తలపోసెను. "కోరిన కోర్కెలెల్ల నొసంగు ఈ కల్పవృక్షము నుండి తగిన ఫలమును పొందవలయును. కాని దీనితో నా మనసులోని కోరికను సాధించెదను." ఇట్లు నిశ్చయించి తండ్రియొద్దకుఁ బోయి జీమూతవాహనుఁ డీవిధముగా వేఁడు కొనెను. "నాయనా, ఈ లోకములోని వన్నియు అస్థిరము లును, పరోపకారమొక్కటియే స్థిరమును అని మీ రెఱుఁగు దురుగదా? అట్లుండఁగా కల్పవృక్షమును మనము రక్షించు కొనుటవలన నేమి ప్రయోజనము? కావున పరోపకారమునకై యీ కల్పవృక్షమును మీయాజ్ఞచే నేను విని యోగించెదను." తండ్రి యందుల కంగీకరించెను. జీమూతవాహనుఁడు అంతట కల్పవృక్షమును సమీపించి "దేవా, మా పెద్దల కోర్కెలను తీర్చితివి. నా యొక కోర్కె మాత్రము తీర్పుము. భూమిలో దరిద్రులు లేకుండునట్లు అనుగ్రహింపుము. ధనము కోరు వారికి నిన్నిచ్చివేసితిని" అని పలికెను. అప్పుడు "నన్ను విడిచిపెట్టితివి. నే నిదే యేఁగితిని" అని వాక్కొకటి వినఁ బడెను. క్షణములో కల్పవృక్షము ఆకాశమున కెగసి భూమిలో దరిద్రుఁడు లేకుండునట్లు బంగారము కురిసెను. అంత జీమూతవాహనుని కీర్తి లోకము లన్నిట వ్యాపించెను.

అంతట కల్పవృక్షము పోయినమాట విని అతని దాయాదు లతనిపై దండెత్తివచ్చిరి. అది యెఱిఁగి జీమూతవాహనుఁడు తండ్రితో పాపపు శరీరమునకై బంధువుల చంపుట న్యాయము కాదనియు, మఱియొక స్థలమున కేఁగి ధర్మ మాచరించుకొనుచుంద మనియు తెలుపఁగా తండ్రి యంగీకరించెను. అంత జీమూతవాహనుఁడు తల్లిదండ్రులను దోడ్కొని మలయ పర్వతములకుఁ బోయి యాశ్రమ మేర్పఱుచుకొని తల్లిదండ్రుల శుశ్రూషించుచుండెను.

ఆ మలయపర్వతమునందు సిద్ధరాజు విశ్వావసు వను నాతఁడుండెను. అతని కుమారుఁడు మిత్రావసువు, కుమార్తె మలయవతి. మిత్రావసునకు జీమూతవాహనునితో చెలిమి కలిగెను. ఒకనాఁడు మలయవతి గౌరిని పూజించి వచ్చుచుండఁగా నామెను జీమూతవాహనుఁడు చూచెను. వారి కిరువురకును పరస్పరము ప్రేమకలిగెను. దీని నెఱిఁగి మిత్రావసువు తన తండ్రిని ప్రార్థించి మలయవతిని జీమూతవాహనున కిచ్చి పెండ్లి చేసెను.

ఒకనాఁడు వేడుకకై మిత్రావసువుతోఁగూడ కొండ వాగులలో తిరుగుచు సముద్రపు దరినిఁ జేరి యట పెక్కు ఎముకల ప్రోవులను కని "అవి యే జంతువుల యెముక" లని విచారింపఁగా మిత్రావసువు, "అవి గరుడుఁడు తిన్న పాముల యెముకలు" అని ప్రత్యుత్తర మిచ్చెను. అంత జీమూతవాహనుఁడు కనికరంబునఁ గుందుచు "ఈ దినము గరుత్మంతునకు నా శరీరము నర్పించి భీతుఁడగు నాగుని ఒకనినైనను రక్షింతును." అని నిశ్చయించుకొనెను. ఆ సమయముననే మిత్రావసునకు

తండ్రియొద్దనుండి పిలుపు రాఁగా నతఁడు జీమూతవాహనుని సమ్మతిపొంది వెడలిపోయెను. తర్వాత జీమూతవాహనుఁడు యోచనానిమగ్నుఁడై యిటునటు తిరుగుచుండఁగా నతని కొక యేడ్పు సవ్వడి వినిపించెను. అతఁ డాదిక్కున నేఁగి యచట నొకవృద్ధ యేకపుత్రుని శంఖచూడుని కోలుపోవలసి వచ్చెఁగదా యని యేడ్చుచున్న దానిని చూచెను. ఆమె నూఱడించి జీమూతవాహనుఁడు తన శరీరము నర్పించి యా నాగుని బ్రతికించునట్లు తెలిపెను. శంఖచూడుఁడు అతనితో "మహారాజా, ఇదేమి న్యాయము? నిముస నిముసమునను నా వంటి జీవు లెన్ని పుట్టుచున్నవి; మఱి యెన్ని గిట్టుచున్నవి? అట్టివానినిగూర్చి యంతగా విచారింపఁదగదు. మీ వంటి దయార్ద్ర హృదయులు మిక్కిలి యరుదుగ నవతరింతురు. మీ వలె లోకమునెల్ల కనికరించువా రరుదు. అట్టి మీరు నా వంటి క్షుద్ర జీవిని రక్షించుటకు మరణింపఁ జూచుట తగదు. నేను బ్రతికియుండినను మరణించినను ఒకటే. మీరు మరణించిన యెడల మానవలోక మొక యుత్తమ వ్యక్తినిఁ గోల్పోయిన ట్లగును" అనెను.

(జీమూతవాహనుఁడు :—శంఖచూడా! ఈ దినమున నా ప్రాణముల నర్పించి నిన్ను రక్షింతు నని ప్రతిజ్ఞఁ బూని యుంటిని. కావున నా ప్రతిజ్ఞ నెరవేరకతప్పదు. ప్రతిజ్ఞాభంగమునకంటె గొప్ప దోషము మఱియొకటి యుండునా? కావున మఱు మాటాడక నీవు గృహమున కేఁగుము. నే నీ వధ్య శిలనెక్కెదను.

కాని శంఖచూడుఁ డందులకంగీకరింపక తానై శీఘ్రముగ సిద్ధపడు నిమిత్తము ఈశ్వరునికి మ్రొక్కి వచ్చుటకై సమీపమున నుండిన దేవళమునకుఁ బోయెను. ఇంతలో జీమూతవాహనుఁడు వధ్య శిలనెక్కి యెప్పుడెప్పుడు గరుడుఁడు వచ్చి తన్ను కొనిపోవునా, అందువలన శంఖచూడుఁడు బ్రదికి యుండునా, అని ప్రార్థించుచుండెను. మామూలు వేళకు గరుడుఁడు వచ్చి క్రింద వ్రాలి వధ్యశిల మీఁద నున్న జీమూతవాహనుని ముక్కున గఱచుకొని యాకాశమున కెగసెను. ఆకాశమున కొంత వడి మండలాకారముగ దిరుగ జీమూతవాహనుని శిరోరత్నము జారి సరిగ మలయవతి సన్ముఖమందుఁ బడెను. దానిని గుర్తించి యామె యెలుఁగెత్తి దుఃఖించుచుండ తలిదండ్రులును సోదరుఁడును నటకు వచ్చిరి. జీమూతవాహనుని వెదకుటకు భటులను నలువైపులను బంపి మలయకేతుఁడును మిత్రావసువును మలయపర్వతమును జేరిరి.

ఇంతలో కాత్యాయనీదేవి మందిరమం దున్న శంఖచూడుఁడు గరుడుని రాకపోకలవలన మహారణ్యమందు తుపాను వీచినట్లు గాలి వీచుటవలన చెట్లు విరిగి క్రిందఁబడుచుండ జీమూతవాహనునకు ప్రాణాపాయము గలిగినదని తలఁచి త్వరిత గతిని వచ్చి నెత్తుటి ధారలంబట్టి గరుడుఁ డుండు చోటు చేరి ఎలుగెత్తి యిట్లు నుడవందొడంగెను. "ఓ గరుత్మంతుఁడా; శంఖచూడుఁ డని తలఁచి దయాసాంద్రుఁ డగు జీమూతవాహనుని ముక్కున గఱచుకొని పోయియున్నావు. నేను శంఖచూడుఁడను. కావున నాతని కపాయము కలుగకుండ క్రిందదింపి నన్ను భక్షింపుము. లేనిచో నిన్ను పాపము చుట్టుకొనును" అనెను.

ఈ మాటలు విని గరుత్మంతుఁడు పాపభయమువలన గజగజవడఁకుచు మృతప్రాయుఁడైయున్న జీమూతవాహనునిఁ గాంచి యిట్లనియె. ‘‘సాధుపుంగవా, నీ వెవ్వఁడవు? ప్రాణములపై నేల విరక్తి కలిగినది?” అను ప్రశ్నలకు జీమూతవాహనుఁడు తన పుట్టు పూర్వోత్తరములు చెప్పి ‘‘వినతానందనా, ప్రాణ మత్యంతతుచ్ఛమైనది. నేఁ డుండి రేపు పోవును. ఈ తుచ్ఛప్రాణము నర్పించి పరుల కుపకారమొనర్చుటకంటెను చేయఁదగిన యుత్కృష్ట కార్య మే మున్నది? నీకు బలియగుటవలన నా జీవితము చరితార్థమగును. కావున మఱి మాటాడక నా శరీరమును భుజించి యాఁకలిఁ దీర్చుకొనుము.” ఇట్లు మాట్లాడుచుండగా మిత్రావసువు, జీమూతకేతువు మలయవతి. మొదలగు వా రచటికి వచ్చిరి. జీమూతవాహనుఁడు బాధ నోర్వలేక ప్రాణములు విడిచెను. గరుత్మంతుఁ డా మహాత్ముని పరోపకార పారీణతకు మిక్కిలి సంతసించి యిట్లనియె. ‘‘జీమూతవాహనుఁడా, జగత్తునందు ప్రతియొక్క ప్రాణము నిరంతరము స్వప్రాణరక్షణమునకుఁ బ్రయత్నించుచుండును. కాని ప్రాణముల నర్పించి యితరుల ప్రాణముల నిలుప యత్నించు జీవిని యిదివర కెన్నఁడును కని విని యెఱుంగను. నిన్నుఁ గాంచిన నాకాశ్చర్యముగ నున్నది. నీ దయార్ద్ర హృదయమున కెంతయు సంతసించుచున్నాను. నీ జీవితము ధన్యము. కావున కావలసిన వరమును గోరుము. కాదనక యిచ్చెదను.”

అంత జీమూతవాహనుఁడు ‘‘ఖగరాజా, నీవు సంతుష్టచిత్తుఁడ వైనయెడల ఈ దినమునుండియు నాగులను సంహ

రింపవలదు. ఇంతవఱకు భక్షింపఁబడిన నాగుల నందఱును బ్రతికింపవలయును" అని ప్రార్థించెను.

ఈ ప్రార్థనకు గరుత్మంతుఁడు సంతసించి 'తథాస్తు' అని నుడివి శరవేగమున స్వస్థానమున కరిగి యమృతమును దెచ్చి పర్వతాకారముగ ప్రోగుపడియుండిన యెముకలమీఁదఁ బోసి సర్పముల నన్నిటిని బ్రతికించెను. మఱియు రాజపుత్రుని చూచి "వత్సా, నావరప్రభావమువలన నీ రాజ్యము మరల నీకు లభించును" అని నుడివి యాకాశవీథిని నిర్గమించెను. జీమూతవాహనాదులు మహానందమున తమ యిరవు చేరిరి.

అంత నచిరకాలములోనే జీమూతవాహనుని లోకైక పరాయణత్వ మెఱిఁగి దాయాదులు అతనిని సమీపించి తా మొనర్చిన తప్పులను క్షమింపుఁడని ప్రార్థించి యాతనిఁ దీసికొని పోయి సింహాసనాసీనుం జేసిరి."

ఇట్లు కథను ముగించి బేతాళుఁ డిట్లనియె. "మహారాజా! జీమూతవాహన శంఖచూడులయం దెవ్వఁ డధికుఁడు?"

విక్రమాదిత్యుఁడు:—శంఖచూడుఁడు?

బేతాళుఁడు:—ఏల?

విక్రమాదిత్యుఁడు :—జీమూతవాహనుఁడు క్షత్రియుఁడు. అందువలన ప్రాణవిసర్జనం బొనర్చుట ఆతనికి తృణప్రాయము. జీమూతవాహనుఁడు మరణించుటకు శంఖచూడుఁ డంగీకరింపకుండెను. పిమ్మట నిరుపాయుఁడై కాత్యాయనీ మందిరమును బ్రవేశించి దేవిని బ్రార్థించెను. అచ్చటనుండి

తిరిగివచ్చి గరుడుని బ్రార్థించి జీమూతవాహనుని ప్రాణముల రక్షించెను. కావున నాతడే యధికుడు.

బేతాళుఁ డీవాక్యములకు సంతసించుచు యథాప్రకార మొనర్చెను.

16–వ కథ

మహారాజా! కనకపురము నేలుచుండిన రాజుపేరు యశోధరుఁడు. ఆ పురమందు కోట్లకొలఁది ధన మార్జించిన రత్నదత్తుఁ డను వర్తకుఁడొకఁ డుండెను. ఆతని కొక్క పుత్రిక లేక లేక కలిగిన సంతానము; పేరు ఉన్మాదినీదేవి. ఆమె త్రిలోక సుందరి యను విషయము దేశ దేశాంతరములు వ్యాపించెను. ఉన్మాదినిని వివాహమాడ నెంచి అనేకులు ధనికులు, రాజులు ప్రయత్నించుచుండిరి. రత్నదత్తుఁడు అతి సూక్ష్మగ్రాహి; దూరదర్శి. అందువలన యశోధర మహారాజును సమీపించి యిట్లనియె. "నా కొక్క పుత్రికగలదు, పేరు ఉన్మాదినీదేవి. వివాహమాడతగిన వయసు వచ్చినది. రూపలావణ్య సౌందర్యములయందును విద్యాబుద్ధులయందును మిక్కిలి ప్రఖ్యాతిఁ గాంచియున్నది. అనేకులు రాజులు వివాహమాడెద మని చెప్పుచున్నారు. కాని తమకిచ్చి వివాహ మొనర్పవలయు నని యున్నది. కావున తమ రంగీకరింపఁ బ్రార్థన" అన రాజు తలయూచి వారము దినములలో నా యభిప్రాయమును దెలుపుదు నని నుడివెను.

మరుసటి దినమున ముగ్గురు వృద్ధులను బిలిచి యున్మాదినీదేవి రూపరేఖావిలాసములను, సుగుణములను బరిశీలించి రావలయు నని చెప్పెను. రాజాజ్ఞ ననుసరించి యా ముగ్గురును

మేడమీఁద నొక యత్యంత సుందరినిఁ గాంచితిని.” వెంటనే యారూపము నా హృదయమం దంకితమై నన్ను తల్లడిల్లఁ జేయుచున్నది. అందువలన నలంగి వచ్చి శయనించితిని.”

సేవకుఁడు:—మహారాజా మీరు కాంచిన నారీరత్నము రత్నదత్తుని పుత్రికయగు ఉన్మాదినీదేవి. మీ రామెను వివాహమాడ నని నుడువుటవలన రత్నదత్తుఁడు సైన్యాధ్యక్షుఁ డగు బలభద్రవర్మ కిచ్చి వివాహమొనర్చి యున్నాఁడు.

సేవకుని వాక్యములు రాజునకు మిక్కిలి చిత్రముగఁ దోఁచెను. అందువలన నిమేషకాలము నిదానించి సేవకునిఁ గాంచి “నిజమే. ఉన్మాదినిని చూచి రావలయు నని నేను ముగ్గురు బ్రాహ్మణులను బంపితిని. వారు వచ్చి యామె కురూప యని చెప్పిరి. అందువలన నేను వివాహమాడ నని రత్నదత్తునకు తెలిపితిని.” అనెను. అంతట రాజు సేవకునితో నా ముగ్గురు బ్రాహ్మణులను పిలుచుకొని రావలసినదని చెప్పఁగా రాజాజ్ఞ ననుసరించి సేవకుఁడు నగరములోని కేఁగి ఆ ముగ్గురు బ్రాహ్మణులను వెంట నిడుకొని వచ్చెను. రాజు వారిని గాంచి మండిపడుచు నిట్లనియె. “నే నీదినమున రత్నదత్తుని పుత్రికను గాంచితిని. అట్టి నారీతిలకమును కని విని యెఱుంగను. మీరు ఆమె కురూపయని నుడివి వివాహమాడకుండఁ జేయుటకుఁ గారణ మేమి?” అన బ్రాహ్మణులు చేతులు జోడించుకొని యిట్లనిరి. “మహారాజా, తాము చెప్పినది సత్యము. ఆమెను వివాహమాడినయెడల మీరు రాచకార్యములు వీడి యంతఃపురమందు నివసింతు రనియు, అందు

వలన రాజ్యమునకు ముప్పు కలుగు ననియు నెంచి మీతో నబద్ధము చెప్పితిమి, క్షమింపుఁడు." అన రాజు కొంతవడి యోచించి వారిని క్షమించెను.

కాని యశోధనుఁడు మిక్కుటమగు మనో బాధకు లోనై సరిగ పదియవదినమున మరణించెను. ఈ విషయ మును విని ప్రభుభక్తుఁ డగు బలభద్రవర్మ "సుగుణమణి యగు యశోధనుఁడు మరణించిన తర్వాత నా జీవితమువలనఁ బ్రయోజన మేమి? నావలననేగదా రాజు మరణించెను. కావున ఆత్మ హత్య యొనర్చుకొనుటయే శ్రేయము." అని తలఁచి శ్మశానమున కేఁగి చితిమీఁదఁ బరుండి చేతులు జోడిం చుకొని సూర్యభగవానుని "ప్రభో! సూర్యభగవానుఁడా, యశోధరుఁ డుత్తరజన్మమున రాజాధిరాజై యవతరించు నట్లును ఆతనికి సేవకుఁడనై నేనును బుట్టునట్లును అనుగ్ర హింపుము." అని ప్రార్థించెను. అగ్ని ప్రజ్వలింపఁ జొచ్చెను. త్రుటిలో నాతఁ డగ్నిహోత్రున కాహుతియాయెను. భర్త గతించిన పిమ్మట వైధవ్యజీవితమువలనఁ బ్రయోజన మే మని తలఁచి భర్తచితిలోని కుఱికి యున్మాదినీదేవి ప్రాణములువీడెను."

అని కథను ముగించి బేతాళుఁడు రాజును గాంచి "మహా రాజా! ఆ ముగ్గురియం దెవ్వ రుత్తములు?" అన విక్రమా దిత్యుఁ డిట్లనియె:-ఇం దున్మాదిని గొప్పతన మంతగా నాకు గోచరించుటలేదు. సాధ్వి యగు స్త్రీ సహజముగ భర్తతో సహగమన మొనర్చునుగదా? బలభద్రవర్మ గొప్పతనమును నాకు గోచరించుటలేదు. ఏలయన ప్రభువు మరణించిన పిమ్మట ప్రభుభక్తుఁడు మరణించుటయం దాశ్చర్య మే మున్నది? కాని

ముప్పురయందును రాజు అత్యుత్తముఁడు. ఆతఁడు తలంచిన యెడల త్రుటిలోన ఉన్మాదినిని యంతఃపురమునకుఁ దీసికొనిపోయియుండును. కాని యట్టి యధర్మకార్య మొనర్చుట కాతఁ డంగీకరింపలేదు. అందువలన రాజే యీ ముప్పురయందు నుత్కృష్టుఁడు.' అను నుడువులు విని బేతాళుఁడు యథాప్రకార మొనర్చెను. మరల విక్రమాదిత్యుఁ డా శవమును భుజమున నిడుకొని బయలుదేరి వచ్చుచుండ త్రోవలో బేతాళుఁ డీ క్రింది కథను జెప్పెను.

17-వ కథ

మహారాజా, విష్ణుశర్మ యను బ్రాహ్మణుఁ డొకఁ డుండెను. ఆతఁడు పరమధార్మికుఁడు; తపోధనుఁడు. హేమకూట నగరమున నివసించుచుండెను. ఆతనిపుత్రుఁడు గుణాకరుఁడు. కాని యాతనియం దొక సుగుణమైనను కానరాదు. పరమ దుర్మార్గుఁడు. తండ్రి సంపాదించిన ధనమును జూదములు మొదలగు వానియందు ఖర్చుపెట్టి దొంగతనమునకుఁ గడంగెను. అందువలన విష్ణుశర్మ పుత్రుని గృహమునుండి వెడలఁగొట్టెను.

గుణాకరుఁడు దేశదేశములు తిరిగి చివర కొక శ్మశానమును జేరి యచ్చట యోగసాధన జేయుచుండిన సాధుపుంగవునిఁ గాంచి సాష్టాంగ నమస్కార మొనర్చి యాయన సాన్నిధ్యమునఁ గూర్చుండ నాతఁ డిట్లనియె. "వత్సా, నీవు క్షుద్బాధా పీడితుఁడవైనట్లు దోఁచుచున్నది." అని నుడివి యొకింత ప్రసాద మొసంగెను. దానిని గాంచి గుణాకరుఁడు

"ఈ యాహారమును భుజించుటకు నా మన మొప్పకున్నది. కపాలమునం దుంచిన పదార్థముల నెట్లు భుజింతును." అన యోగి ధ్యాననిమగ్నుం డాయెను. వెంటనే యొక యక్షకన్యక ప్రత్యక్షమై సమ్ముఖమందు నిలిచి యిట్లనియె. "ప్రభో, న న్నేల యాహ్వానించితిరి? కార్యమేమి? ఎట్టి దుర్ఘటకార్యమునైనను త్రుటిలోన నెరవేర్తును." అన యోగి యిట్లు ఆజ్ఞాపించెను. "యక్షకుమారీ, ఈ బ్రాహ్మణ కుమారుఁడు క్షుధాతురుఁడై యున్నాఁడు. ఈతనిని తగువిధమున సత్కరింపుము."

వెంటనే యక్షకుమారి మాయాబలమువలన నొక సుందరమందిరమును నిర్మించెను. బ్రాహ్మణకుమారు నామందిరములోనికిఁ దీసికొని యేఁగి పలువిధములగు భక్ష్యములతోడ భోజనము పెట్టెను. బంగారు మంచమును చూపి దానిమీఁద శయనింపు మని నుడివెను. ఆతఁడు శయనించినంతనే తెల్లవారువఱ కాతని పాదముల నొత్తుచుండెను. అప్పటి గుణాకరుని యానందమును వర్ణించు టెట్లు? ఆతఁడు మైమఱచి నిదురింపఁ జొచ్చెను.

తెల్లవాఱెను. గుణాకరుఁడు నేత్రములు తెఱచిచూడ శ్మశానమం దొకచోట శయనించి యుండెను. కాని యా యక్షకన్యక యేది? ఆ దివ్య సుందర మందిర మేది? ఆతఁడు లేచి సన్న్యాసికడ కేఁగి గతించిన రాత్రి జరిగిన విషయమును గూర్చి విన్నవింప యోగి యిట్లనియె. "వత్సా నా యోగ విద్యాప్రభావమువలన నా యక్ష కన్యక యిట వచ్చినది. యోగసిద్ధి గాంచిన వాని యాజ్ఞాధీనయై యాకన్యక ప్రవర్తించుచుండును. నీవు యోగివి కావు. కావున్నను నా యాజ్ఞానుసారము నీకు సేవచేసి యంతర్ధానమైనది."

ఈ వాక్యములు వినినంతనే గుణాకరుఁడు చేతులు జోడించుకొని యిట్లనియె. ''మహాశయా! తమకు సేవ చేయుదును. యోగ విద్యను గరపుఁడు." అని యా యోగి పాదములమీఁదఁ బడఁగా ఆతఁడును గుణాకరుని లేచి కూర్చుండుమని యాజ్ఞాపించి యొక మంత్రము నుపదేశించి "వత్సా! నీవు రాత్రి రెండవ యామము మొదలు మూఁడవ యామము వఱకును కంఠములోఁతు నీళ్లయందు నిలిచి యీ మంత్రమును పదునాఱు దినములు జపింపుము. నీకు సిద్ధియగును." అనెను.

యోగి యుపదేశానుసారము గుణాకరుఁడు పదునాఱు దినములు కంఠములోఁతు జలమునందు నిలిచి యా మంత్రమును జపించెను. పదునేడవ దినమున యోగి సాన్నిధ్యమునకు వచ్చి నమస్కరించి యిట్లనియె. ''గురువర్యా! తమ యాజ్ఞానుసారము మంత్రమును పదునాఱు దినములు జపించితిని. నా జపము నిర్విఘ్నముగ కొనసాగినది. ఇఁక నేను చేయవలసిన సాధనను చెప్పుఁడు." అన సన్యాసి యిట్లనియె. "వత్సా! పదునాఱు దినములు పంచాగ్నుల మధ్యనుండి యా మంత్రమును జపింపుము. నీకు యోగసిద్ధియగును." అన గుణాకరుఁడు చేతులు ముకుళించుకొని యిట్లనియె. "మహాశయా! నేను గృహమును వీడి కొన్ని వత్సరములైనది. తలిదండ్రులను గాంచవలయు నని యున్నది. కావున నట కేఁగి వారి యాజ్ఞను గైకొని తిరిగివచ్చి పంచాగ్నుల మధ్య నిలిచి మంత్రసాధనను చేయు[illegible]న యోగి యంగీకరించెను.

[illegible]ణాకరుఁడు యోగికడ సెలవు గైకొని స్వగ్రామమున [illegible]గెను. నాల్గయిదు వత్సరములకు తిరిగి వచ్చిన పుత్రునిఁ

గాంచి తలిదండ్రులు కౌగలించుకొని "వత్సా! ఇన్ని వత్సరములుగ నెచ్చటఁ దిరుగుచుంటివి? నీవు గృహమందు లేకుండుటవలన మేము మృతప్రాయులమై యున్నాము." అని పలికిరి. గుణాకరుఁడు దేశవిదేశములయందు తాను పడిన పలు బాధలను వర్ణించి చివరకు యోగి విషయమును వివరించెను. ఆ మాటలను వారు పుత్రుఁడు సన్మార్గుఁడైనాఁడని సంతసించుచుండ గుణాకరుఁ డిట్లనియె. "మిమ్ము దర్శింపవలయు నను కోరిక నాకు మిక్కుటమైనది. ఒక్కమారు మిమ్ము దర్శించి యేఁగినఁగాని నిర్విఘ్నముగ యోగసాధనము జరుగదని తలఁచి యిట వచ్చితిని. ఇఁక నాకు సంతసముగ సెలవొసంగుఁడు. ఇఁక మీ దర్శనము చేయఁజాలను. మీ యాశీర్వాదమువలన యోగసిద్ధినొంది చరితార్థుఁడ నగుదును."

ఆ నుడువులకు విష్ణుశర్మయు, నాతని భార్యయు దుఃఖించుచు నిట్లనిరి. "వత్సా! నీవొక్కఁడవే మాకు పుత్రుఁడవు. నిన్ను విడిచి మేము బ్రదుకు టెట్లు? అయినను నీ వయసెంత? ఇరువది వత్సరములలోపువయసుననే యోగసాధనయా? మేము జీవించియుండువఱకు గృహమం దుండి పిమ్మట యోగసాధనమున కేఁగుము. నిన్ను వీడి క్షణకాలమైనను బ్రతుకఁజాలము."

అప్పుడు గుణాకరుఁడు చేతులు జోడించుకొని యిట్లనియె. "మీ యనుజ్ఞకు వేచియున్నాను. తమ యా... మును బడయునిది నా తపము నిర్విఘ్నముగ జరుగదు. ఆ... దించి నాకాజ్ఞ యొసంగుఁడు." అని తలిదండ్రులకు ముఖ...

నా బాధను వృద్ధిచేయుటకు వచ్చిన నీ వెవ్వరు? ఈ నిశీథి నిటకు వచ్చుటకు కారణ మేమి?''

ఈ మాటలకు ధనవతి మిక్కిలి జాలినొంది “నేను మార్గము తప్పి యంధకారమున నిందుఁ బ్రవేశించితిని. కాని నిన్ను చూడలేదు.” అని తన వృత్తాంతమును వివరముగఁ జెప్పి నీ వెవ్వఁడ వని ప్రశ్నించెను. అప్పుడు దొంగ ఈ ప్రకారము బదులు పలికెను. “నే నొకవర్తకుఁడను. దొంగల గుంపు నందుఁజేరి యనేకులను చంపితిని. ధనమును కొల్లఁగొట్టితిని. చివరకు నన్నుఁబట్టుకొని విచారించి కొఱుతను వేసి మూఁడు దినములైనవి. కాని నా పాపిష్ఠిప్రాణము పోకున్నది. ఏమి చేయుదును? కాస వివాహమాడనంత కాలము నాకు మృత్యువు కలుగదని జ్యోతిశ్శాస్త్రజ్ఞులు చెప్పియున్నారు. వారు చెప్పిన మాట నిజమగుచున్నది. ఈ యమబాధ ననుభవించువానికి వివాహమా? వివాహమైనంతనే మరణమా? అయినను నీ పుత్రికను నాకిచ్చి యిప్పుడే వివాహమొనర్పుము. నేను వెంటనే మరణింతును. అందువలన నీకు మహాపుణ్యము లభించును. ఇన్నిదినములుగ నేను దొంగలించి దాచియుంచిన ధనమంతయు నీకిత్తును.” అని పలికెను. అనినంతనే ధనవతి ధనాశచేత వెనుకముందు లారయక వివాహమొనర్చుట కంగీకరించెను. “నీకు వివాహ మొనర్తును. కాని నాకు దౌహిత్రుని కాంచవలయు నని యున్నది. నాకు పుత్రులు లేరు. దౌహిత్రుఁడు కలిగినగాని సద్గతి లభింపదు. మార్గమేమి?” అని ఆమె యడిగెను.

దొంగ యిట్లనియె. “నీవు చెప్పినది నిజము. కాని దాని కొక మార్గమును తెల్పెదను వినుము. నీ పుత్రికను నా కిచ్చి వివాహమొనర్చిన నా కష్టములంత మొందును గదా? నీకు మిక్కుటముగ ధనము లభించును. పిమ్మట నీవీ విషయము నెవరికిని దెలియ నీయకుము. నీ పుత్రికకు యథావిధిగ వివాహమొనర్పుము. అప్పుడు నీకు దౌహిత్రుండు కలుగును. కాని యిప్పుడే యొక విషయమును స్పష్టీకరించుట మంచిది. నీకు కలుగు దౌహిత్రుండు నాపుత్రుం డను విషయమును మరువవలదు.”

వెంటనే ధనవతి మోహినిని దొంగకు దాన మొనర్చెను. అప్పుడు దొంగ యిట్లనియె. “ధనవతీ! ఆ కనుపడు గ్రామమున పడమటి దిక్కున నా గృహమున్నది. నా యింటికి తూర్పు దిక్కున నొక మఱ్ఱిచెట్టుగలదు. ఆ చెట్టునకు పది బారల దూరమునం దూర్పు దిక్కున నా ధనమును పాతి పెట్టియున్నాను. నీవేఁగి యాధనమును తీసికొనిపొమ్ము.” అని నుడివి యాతఁడు మరణించెను.

వెంటనే ధనవతి దొంగచెప్పిన విధమున ఆవటవృక్షమును సమీపించియాందుండు ధనమునంతయుం దీసికొని పుట్టి నింటి కేఁగి జరిగిన వృత్తాంతమును నివేదించెను. ఆ విషయము నంతయు విని ధనపతి మిక్కుటముగ సంతసించెను.

క్రమముగ మోహినికి వయసువచ్చెను. అప్పుడొక బీదవానికి మోహిని నిచ్చి వివాహమొనర్చిరి. కాని యాతఁడు కొంతకాల ముండి చేతికి దొరకిన ధనమును సంగ్రహించుకొని పాఱిపోయెను.

కొన్ని నెలలకు మోహినికొకపుత్రుడు పుట్టెను. ఆతడు పుట్టిన యాఱవదినమురాత్రి మోహినికి స్వప్నమందొక దివ్యమూర్తి కాన్పించెను. ఆ మహాపురుషుడు వ్యాఘ్రచర్మమును ధరించి శరీరమునిండ భస్మము నలందుకొని చేత త్రిశూలమును ధరించి యుండెను; అతనికి అయిదు తల లుండెను. ఒక్కొక్కతలకు త్రినేత్రము లుండి యామూర్తి వృషభముమీద నెక్కి యిట్లనియె "వత్సా, మోహినీ నీ పుత్రుడు సామాన్యుడు గాడు, కావున వీనిని నీవు బంగారు పెట్టెయందుంచి వేయి వరహాలందుంచి తలుపు బిగించి రాజద్వారముకడ నిడిచి రమ్ము; రాజదంపతులీ బాలుని పెట్టెనుండి దీసికొని భగవత్ప్రసాదముగ భావించి పెంచి పెద్దవానిని చేయుదురు. వయసు వచ్చినంతనే యువరాజగును. రాజు మరణానంతర మీతడు రాజై స్వశక్తివలన ధరామండలమునకు చక్రవర్తియగును."

మోహినికి నిద్ర మెలకువ వచ్చినంతనే స్వప్నవృత్తాంతమును ధనవతితోం జెప్పెను. ఆమె మిక్కిలి సంతసించి మఱునటిదినము రాత్రి రెండవ యామమున నాశిశువు నొక పెట్టెయందుంచి బెట్టి వేయివరహాల నందుంచికొని రాజద్వార సమీపమునందుంచిరి. అప్పుడు రాజునకు స్వప్నమందు మోహినికి ప్రత్యక్షమైన మహాపురుషుడు ప్రత్యక్షమై యిట్లనియె "నీ వాకిలిసమీపమందొక బంగారుపెట్టెకలదు. అందొక బాలుండున్నాడు. అతనిం దీసికొనివచ్చి పెంచుకొనుము. నీయనంతరము రాజ్యపీఠము నలంకరించి చక్రవర్తియగును."

రాజు మేల్కొని రాణితో స్వప్నవృత్తాంతమును జెప్పి ఇద్దఱును ద్వారమును సమీపించి చూడ సువర్ణమందసము

కాన్పించెను. దానిని దెరచిచూడ నం దొకశిశువు దివ్యతేజ మున వెలుంగుచుండెను. వెంటనే రాణి బాలునెత్తుకొన రాజును సువర్ణమందసమును నందలి ధనమును గైకొని అంతః పురములోని కేగెను.

తెల్లవారెను. రాజదంపతు లపూర్వానందమున మునిం గిరి. జ్యోతిశ్శాస్త్రజ్ఞులు వచ్చి యా శిశువును గాంచి యిట్లనిరి. "మహారాజా! మహాపురుషుల కుండవలసిన లక్షణము లీ శిశు వునం దుం గన్పడుచున్నవి. కావున నీతఁడు చక్రవర్తియగును. అణుమాత్రమైనను సందియము లేదు."

ఆ మాటలు వినుచున్న రాజదంపతులకుఁ గలిగిన సం తసమును వర్ణించుటెట్లు? అది యనిర్వాచ్యముగదా? అప్పటి నుండియు నా బాలుని కంటికి ఱెప్పవలె కాచుచు అతి గారాబముగ పెంచుచుండిరి. ఆతనికి హరదత్తుఁడని నామకర ణమొనర్చిరి. ఆతఁడు శుక్లపక్ష చంద్రుని బోలి దినదినాభివృద్ధి నొందుచు, విద్యాబుద్ధులయందును, దయా సత్యములయం దును, శౌర్యసాహసములయందును నద్వితీయుఁడాయెను. పదు నెనిమిది వత్సరములు దాటినంతనే యువరాజుగ నొనర్చిరి.

కొంతకాలమునకు రాజు మరణించెను. హరదత్తుఁడు సింహాసన మధిష్ఠించి గయాక్షేత్రమున కేఁగి తండ్రికి శ్రాద్ధము చేయునప్పుడు పిండములు గైకొనుటకు మూఁడు హస్తములు కన్పడెను.

అందొకటి దొంగది. రెండవది జనక తండ్రియగు వైశ్యునిది. మూఁడవది పెంపుడు తండ్రియగు రాజుది.

అంతటితో కథను ముగించి బేతాళుఁడు రాజును చూచి యిట్లనియె. "శాస్త్రసమ్మతముగ యోచించినచో నా ముప్వురయందు దెవఁడు పిండమును గైకొనుట కర్హుఁడు?"

విక్రమాదిత్యుఁడు:—దొంగ పిండమును గ్రహించుట కర్హుఁడు.

బేతాళుఁడు:—మిగిలిన యిద్దరి యపరాధ మేమి!

విక్రమాదిత్యుఁడు:—మోహినికి భర్తయగు దొంగ ప్రథమముననే ధనవతితోఁ జెప్పి యొప్పించుకొనెను. రెండవ మారు వివాహమాడినవాఁడు ధనలోభి. అందు కొఱకై యాతఁడు వివాహమాడెను. ధనము దొరకినంతనే పాఱిపో యెను. కాని భార్యాపుత్రుల విషయమున స్వీయ కర్తవ్య మును నిర్వహింపలేదు. అందువలన పిండ గ్రహణమున కతఁ డయోగ్యుఁడు. రాజు వేయి వరహాలను గైకొని శిశువును పెం చెను. అందువలన పెంపుడు తండ్రియైనను పిండమును గైకొ నుట కనర్హుఁడు. కావున నా యభిప్రాయానుసారము దొంగ యే పిండమును దీసికొనుటకర్హుఁడు."

విక్రమాదిత్యుని ఈ ప్రత్యుత్తరమునకు సంతసించి బేతాళుఁడు యథాప్రకార మొనర్చెను. రాజు శవమును మోసి కొని వచ్చుచుండ బేతాళుఁ డీక్రింది కథను జెప్పెను.

19-వ కథ

మహారాజా!

రూపదత్తుఁడు చిత్రకూట నగరాధినాథుఁడు, మిక్కిలి శక్తియుతుఁడు; మహాపరాక్రమవంతుఁడు. ఒక దినమున నాతఁ డొంటరిగ నశ్వారూఢుఁడై వేటకుఁబోయి అనేకారణ్యా


ములు తిరిగి తిరిగి క్రూరమృగములను సంహరించి చివరకొక ఋష్యాశ్రమమును బ్రవేశించి యందున్న పుష్కరిణియొద్దనున్న వృక్షమునకు గుఱ్ఱమును గట్టి, జలములం గ్రోలి వృక్షచ్ఛాయను విశ్రమించెను.

అప్పుడొక ఋషికన్యక పుష్కరిణిలో స్నానము చేయ వచ్చెను. ఆమె రూపలావణ్యములకు రూపదత్తుం డాశ్చర్యాన్వితచిత్తుండై యామె గృహమున కేగునప్పుడు ఆ కన్యకను సమీపించి "ఇట్లు పలుకరింపక యేగుట యాశ్రమ కన్యకల కుచితమా? విశ్రాంతికొఱకు మీ యాశ్రమమునకు వచ్చితిని. అందువలన నేనతిథిని. అతిథి సత్కారమును మఱచితివా? అతిథిని పలుకరింపకుండ నేగుట యెట్టి మర్యాద?" అని యడుగ నా కన్నియ నిలుచుండెను.

అప్పుడా కన్నియ తండ్రియటకు వచ్చెను. రూపదత్తుండు కులగోత్రములు చెప్పుచు ఆ ఋషికి సాష్టాంగ దండప్రణామ మాచరింప "మనోవాంఛాభి సిద్ధిరస్తు" అని యాశీర్వదించెను. వెంటనే రూపదత్తుం డిట్లనియె. "ఋషికులావతంసమా! ఋషు లాడినమాట తప్పదు. తప్పుటకు వీలులేదు. కాని యిప్పుడు మీ యాశీర్వాదము సఫల మగునట్లు తోపదు.

ఋషి:—ఏల సఫలముగాదు. నా నోటిమాట వ్యర్థమగునా? నీ మనోవాంఛ యీడేరు ననుట నిక్కువము. అది యేదియో చెప్పుము.

రాజు సిగ్గువిడిచి యిట్లనియె. "ఈ కన్యకను నేను మోహించితిని. మా కిద్దరకు వివాహమైనయెడల తమ యాశీర్వాదము ఫలించును."



రూపదత్తుని దురభిప్రాయమునకు ఋషి కినుకఁజెందెను. కాని చేయునది యేమి? మరుమాటాడక కన్యాదానమొసంగెను. వివాహానంతరము రాజు రూపదత్తుని వెంటనిడుకొని బయలుదేరి వచ్చుచుండ ప్రొద్దు గ్రుంకెను. అందువలన నొక తటాకము తీరమున ఫలములతో నుదరమునింపుకొని యచ్చటనే శయనించిరి.

రాత్రి రెండవజామున ఘోరరాక్షసి గర్జించుచుండ రూపదత్తుండు మేల్కొనెను. అప్పు డారాక్షసి రాజును సమీపించి యిట్లనియె. "రాజా! నాకు మిక్కిలి యాఁకలియగుచున్నది. నీ భార్యను భక్షింతును." అనఁగా రాజు చేతులు జోడించుకొని యనేకవిధముల స్తుతించి "నా భార్యను మాత్రము భక్షింపకుము. ఇంక నీకేది కావలసియున్నను లేదనక యొసఁగుదును" అనెను. రాక్షసి పండ్రెండు వత్సరముల బ్రాహ్మణబాలుని తలను ఖండించి నాకొసఁగవలయును. దానితో తృప్తి నొందుదును. నీ భార్యను విడుతును.' అని చెప్పెను. రాజు భార్యమీఁది ప్రీతివలన బ్రాహ్మణవధ కంగీకరించి "నీవు సరిగ నేడవ దినమున రాజధాని నగరమునకు రమ్ము. అప్పుడు పండ్రెండు వత్సరముల బ్రాహ్మణబాలుని ఖండించి నీ కొసంగుదును." అనెను.

ఈ విధముగ రాక్షసి రూపదత్తునిచేత బ్రాహ్మణహత్య చేయుటకు శపథముచేయించుకొని యటనుండి శాంతముగ వెడలిపోయెను. తెల్లవారునప్పటికి రూపదత్తుండు భార్యతోడ చిత్రకూట నగరమునకు వచ్చెను. వెంటనే ప్రధానమంత్రిని బిలువనంపి యాతనితో జరిగిన వృత్తాంత మంతయుఁ జెప్పె.

మార్గ మేమి యని యాతురతనొంది యడుగ మంత్రి "మహా రాజా! మీరీవిషయమున నాతురపడవలసిన పనిలేదు. రాక్ష సికి బలియిచ్చుటకు బ్రాహ్మణ కుమారుని నేను సులభముగఁ దీసికొనివత్తును. మీరు నిర్భయముగ నుండుఁడు." అని బదులు చెప్పెను. మంత్రి మాటలకు రూపదత్తుఁడు సంతుష్టచిత్తుఁడై భార్యతో సుఖముగఁ గాలము గడుపుచుండెను.

సుచతురుఁడగు మంత్రి యొక పన్నాగమును బన్నెను. మూరెఁడు ఎత్తుగల బంగారు విగ్రహమును చేయించి దానికి మిక్కిలి వెలగల యాభరణములను బెట్టించెను. ఆ విగ్రహ మును నాల్గు వీథులుగల చోట బెట్టించి "ఏ బ్రాహ్మణుఁడు పన్రెండు వత్సరముల పుత్రుని స్వేచ్ఛగా బలియొసంగుట కంగీకరించునో వాని కీబంగారు విగ్రహ మీయఁబడును" అని చాటింపించెను.

ఆ నగరమందొక బీద బ్రాహ్మణునకు పన్రెండు వత్సర ముల వయసుగల పుత్రుఁడు కలఁడు. ఆ బ్రాహ్మణుఁడు చాటింపు విని వచ్చి యా విగ్రహమును గాంచి ధనాశా పిశా చమునకు లోనై తిరిగి స్వగృహమున కేఁగి భార్యతో నిట్లనియె. "మనము ఘోర దరిద్రమున మునింగియున్నాము. అందువలన నీవు కోరిన వస్తువులఁ దెచ్చి యొక దినమైనను నీ యఁజాలకుంటిని. ఏమి చేయుదును? కడుపు నిండ భుజించుట కైనను ఆహారము లేదు గదా? ఇప్పుడు మనకు తగిన యవ కాశము లభించినది. నీ వంగీకరించినయెడల పిల్లవానిని బలి కొసంగెదను. అందువలన మూరెఁడెత్తు బంగారు విగ్రహము, నవరత్నములతోఁగూడిన యమూల్యాభరణములును మనకు

లభించును. మనము బ్రతికినన్ని దినములు వాని నమ్ముకొని హాయిగ జీవింపనిచ్చును."

ధనాశ చూపించినంతనే యామెగూడ ధన పిశాచమునకు లోబడి పుత్రు నిచ్చుట కంగీకరించెను. అబ్బా! ధనమునర్పజాలని కార్యమేమున్నది? ఆగర్భదరిద్రుడగు బ్రాహ్మణుడు కుమారుని మంత్రికొసంగి అమూల్యాభరణములతోనున్న విగ్రహమును దీసికొనివచ్చి సంతసింపజొచ్చెను.

సరిగ నేడవ దినమున నా రాక్షసి వచ్చెను. అప్పుడు మంత్రి యా విప్రకుమారుని రాజమందిరమునకు దీసికొని పోయి రాజసమ్ముఖమందు నిలువబెట్టెను. వెంటనే [illegible] దత్తుడు తలను ఖండించుటకు ఖడ్గమునెత్తె ఆ బాలుడు పకపక నవ్వెను."

కథను ముగించి బేతాళుడిట్లనియె. "మహారాజా! బలి యొసంగునప్పుడు ఆ బాలుడు నవ్వుటకు కారణమేమి?"

విక్రమాదిత్యుడు:—సరియైనను బాల్యమున [illegible] ద్రులు రక్షించుచుందురు. వయసువచ్చిన పిమ్మట [illegible] కాపాడుచుండును. కాని యా బ్రాహ్మణ కుమారు[illegible] దండ్రులు ధనపిశాచమునకు లోబడి వాత్సల్యము లేక [illegible] రాజునకు విక్రయించిరి. రక్షకుడగు రాజు శిరము [illegible] డింప నుండెను. ఇక చేయున దియేమి? ఈ ఘో[illegible] మునుండి తప్పించు వారెవ్వరు? అని తలంచి [illegible] నవ్వెను."

అను మాటలు వినుచున్న బేతాళుడు విక్రమాదిత్యుని ధర్మ నిరూపణ శక్తి కానందించుచు [illegible]

ర్చెను. విక్రమాదిత్యుఁడు తిరిగి శిరీష వృక్షముకడ కేఁగి యా శవమును మూఁపుమీఁద నుంచుకొని నిర్భయముగ నడుచుచు మౌనియైయుండఁ గొంతదూర మేఁగునప్పటికి బేతాళుఁ డీ క్రింది కథను మొదలిడెను.

20-వ కథ

మహారాజా!

విశాలపురమున అర్థదత్తుఁడను ధనికుఁ డొకఁడు కలఁడు. అతని పుత్రిక పేరు అనంగమంజరి. ఆమె యద్వితీయ రూప లావణ్యములు జగత్ప్రసిద్ధములు. ఆమెకు యౌవనమురాఁగా మదనదాసను వర్తకునకిచ్చి వివాహమొనర్చిరి. కాని యామె బాల్యమునుండియు విశాలపురమందొక వైశ్యబాలుని మిక్కుటముగఁ బ్రేమించియుండెను. ఆతఁడుగూడ ననంగమంజరిని గాఢముగఁ బ్రేమించి వివాహమాడవలయు నను సంకల్పమున నుండెను. కాని వారు సిగ్గువలన ఆ విషయ మెవ్వరికినిఁ దెలుపకుండిరి.

వివాహానంతరము అనంగమంజరి యత్తవారింటి కేఁగెను. శ్రద్ధాభక్తులతో గృహకృత్యముల నిర్వహించుచు భర్తను బ్రేమింపవలయు నని నిరంతర మెంతయో ప్రయత్న మొనర్చుచుండెను. కాని లాభమేమి? ఆమె చిత్తమా వైశ్యకుమారుని మీఁదినుండి మరలదాయెను. అందువలన నాతనిఁ దలఁచుకొని ప్రతిదినమును కన్నీరు గార్చుచుండెను. ఇట్లు కొంత కాలము జరిగిన పిమ్మట మదనదాసు భార్యను పుట్టినింటికి బంపి వర్తకమునకై సరకులు తీసికొని విదేశములకేఁగెను.

అనంగమంజరి మనోదుఃఖ మామె ప్రియ సఖికి మాత్రమే తెలియును. ఒక దినమున అనంగమంజరియు ఆమె ప్రియసఖియు మాట్లాడుకొనుచుండ అనంగమంజరి బాల్యము నుండియు మోహించియుండిన వర్తకుఁ డామార్గమునఁ బోవుచుండెను. కాని యాతఁడు అనంగమంజరియత్త వారింటి నుండి పుట్టినింటికి వచ్చిన దను విషయము నెఱుంగఁడు. అయిన నాతఁడు అర్థదత్తుని గృహద్వారముకడ నిలిచి యిటునటు చూడఁజొచ్చెను. ఆకస్మికముగ ననంగమంజరి యాతని దర్శించి కెవ్వన కేక వేసి క్రిందపడి మూర్ఛిల్లెను. అప్పు డామె ప్రియ సఖ "అనంగమంజరి ప్రియుని బిలుచుకొని వచ్చుట యుత్తమము. ఇదియే చివరి చూపుగఁ దోఁచుచున్నది." అని తలంచి వర్తకుని పుత్రుని పిలుచుకొనివచ్చెను. కాని యనంగమంజరి యెచ్చట! ఆమె యదివరకే ప్రాణములు వీడియుండెను. ఆమెను గాంచినంతనే ఆ వర్తకుఁడు "అయ్యో అనంగమంజరి మరణించె"నని నుడువుచు క్రిందఁబడి ప్రాణములు వీడెను.

అప్పు డాగృహమంతయు దుఃఖసాగరమున మునింగెను. అర్థదత్తుఁడు మొదలగువారు అనంగమంజరి ప్రియ సఖి వలన జరిగిన వృత్తాంతమంతయు విని యేడ్వఁజొచ్చిరి. పిమ్మట నా రెండు శవములను శ్మశానమునకుఁ దీసికొనిపోయిరి. ఒక్క చితిమీఁద నుంచిరి. అగ్నిహోత్రుఁడు సప్తజిహ్వల వెలుంగఁజొచ్చెను. అప్పుడు మదనదాసుగూడ నటకువచ్చెను. అనంగమంజరి మరణించినదని విని పరుగెత్తుచు శ్మశానమునకు వచ్చి యాచితియందు మునికెను. త్రుటిలో నాతఁడుగూడ భస్మమాయె"నని కథను ముగించి బేతాళుఁ డిట్లనియె. "మహా

రాజా! ముప్వురయం దెవరి ప్రేమ గాఢమైన దని ప్రశ్నింప విక్ర మాదిత్యుఁ డిట్లనియె. “మదనదాసు ప్రేమ సర్వోత్కృష్టమై నది. అనంగమంజరీ సుందరదత్తులు బాల్యమునుండియు పర స్పర ప్రేమ పాశముల బంధింపఁబడియుండిరి. అందువలన వారిర్వురి మరణమునందు విశేషము గాన్పింపదు. తన భార్య మరియొకని ప్రేమించియున్నదని యెరింగియు మదనదాసు చితియందు దూకి ప్రాణములు విసర్జించెను. కావున మదనదాసు ప్రేమ యత్యంత గాఢమైనదని నుడువుటకు సందియము లేదు.”

ఈ మాటలకు సంతసించుచు బేతాళుఁడు విక్రమాది త్యుని పట్టుదలను బరీక్షింపవలయునను దలంపున త్రుటిలో నెగిరి వృక్షశాఖను వ్రేలాడఁజొచ్చెను. విక్రమాదిత్యుఁ డణు మాత్రమైనను విసుఁగుఁజెందక పట్టినపట్టుసాధించి తీరవలయు నను సంకల్పమున వెనుకఁబోయి యా శవమును మోచి తెచ్చుచుండఁ గొంతదూరము జనునప్పటికి బేతాళుఁడు మరల నొక కథ నారంభించెను.

21-వ కథ

మహారాజా!

జయస్థల మను నగర మొండు గలదు. అందు విష్ణు స్వామియను పేరుగల బ్రాహ్మణ పండితుఁ డొకఁడు నివసించు చుండెను. ఆతనికి నల్వురు పుత్రులు. వారికి విద్యాబుద్ధులు శూన్యము. కాని దుర్మార్గ కార్యములయం దారితేరియుం డిరి. పెద్దవాఁడు జూదరి. రెండవవాఁడు వ్యభిచారి. మూఁడ వవాఁడు లజ్జావిహీనుఁడు. నాల్గవవాఁడు ఘోరనాస్తికుఁడు.

పుత్రుల దుశ్చేష్టలవలన విష్ణుస్వామి క్రుంగిపోవుచుండెను. కాని చేయునది యేమి?

ఒకనాడు పుత్రులఁబిలిచి విష్ణుస్వామి యిట్లనియె. "జూదరిని ముక్కుగోసి గాడిదమీఁద నెక్కించి శరీరము నిండ సున్నపుబొట్లుపొడిచి యూరినుండి వెడలఁగొట్టవలయునని శాస్త్రములు చెప్పుచున్నవి. యుధిష్ఠిరుఁడు జూదమాడి రాజ్యమును గోల్పోయి యరణ్యముల కేఁగి పలుబాములు పడియుండెను. నలమహారాజుగూడ జూదమువలన పడరాని పాట్లుపడి యుండెను. వ్యభిచారి కీర్తిప్రతిష్ఠల నశింపఁజేసికొని చివరకు సమస్తమును గోల్పోయి పరమ దుర్మార్గుఁడగును. కులగోత్రములు పుణ్యపాపములు మరచి స్వేచ్ఛగ వర్తించి నరకకూపమునఁబడి క్రుంగిపోవును. లజ్జావిహీనునిఁగూర్చి చెప్పునదేమి? వాఁడేకార్య మొనర్చుటకును వెనుదీయఁడు. పశుతుల్యుఁడు, నిందాస్తుతులు వానికి సమానములు. కావున వానికి ధర్మోపదేశములు వృథ యని వేఱుగఁ జెప్ప నవసరము కాన్పింపదు. ధర్మము దాసక్తిలేని ఘోరనాస్తికుఁ డేల జీవింపవలయును? అట్టివాఁడు మరణించుట శ్రేయముగాదా?

"సాధారణముగ దరిద్రులు సంతానము చిరకాలము వర్ధిల్లుచుండవలయు నని తలంచుట సహజము. కాని నే నట్లు కోరుట లేదు. మీజననియు గోరుట లేదు. మీరెప్పుడు మరణింతురా యని మే మిర్వురము భగవంతుని ప్రార్థించుచున్నాము. ఆత్మహత్య మహాపాతక మని శాస్త్రములయందున్నది. అందువలన యోచింపుచుంటిమిగాని, లేకుండిన ఇది

వరకే మేము మరణింపవలసి యుండెను.” అని పలువిధముల దూషించెను.

ఇట్లు తండ్రి మండిపడఁగా వారికందువలన నణుమాత్ర మగు తెలివి కలిగెను. జీవితమును వ్యర్థబుచ్చుచున్నా మని తలఁచి విద్యాభ్యాసమునకు బయలుదేరిరి. విదేశముల కేఁగి మిక్కిలి కృషిసల్పి పలువిద్యల నభ్యసించిరి. కాని యందు వారు ముఖ్యముగ నభ్యసించిన విద్య లివి. ఒకఁడు మృతజంతువుల యెముక లన్నియు నొక రాశిగఁ బోసిన వానిని విడఁదీసి యాయెముకలను యథాస్థానమం దుంచి యాజంతువునకు తొంటిరూప మును గల్పించు విద్యను నేర్చెను. రెండవవాఁడు మాంససంజనని విద్య నభ్యసించెను. దానిమూలమున మృతజంతువుల కంకాళ ములయందు మాంసమును సరిజేయవచ్చును. మూఁడవవాఁడు మృతజంతువు శరీరముమీఁద సరిగ చర్మమును గప్పుటను నేర్చుకొనెను. నాల్గవవాఁడు చచ్చినదానిని బ్రతికించు విద్య నార్జించెను.

ఆ నల్వురు నాల్గు విధము లగు విద్యల నభ్యసించి స్వదేశమునకు వచ్చుచు మార్గమందు చచ్చిపడియుండిన పులినిఁ గాంచిరి. దాని చర్మ మొక దిక్కునను, మాంసము మరియొక దిక్కునను, ఎముకలు వేరొక దిక్కునను గుట్టలుగఁబడియుం డెను. మొదటివాఁడు ఎముకలను సరిగ నతికించెను. రెండవ వాఁడు దానికి మాంసము నాయా ప్రదేశములకు తగినటు లుంచి సవరించెను. మూఁడవవాఁడు చర్మమును గప్పెను. నాలుగవవాఁడు ప్రాణములు పోసెను. వెంటనే యది లేచి యా నల్వుర నొక్క నిముసమున భక్షించెను.

కథ పూర్తియైనంతనే బేతాళుఁడు ‘‘మహారాజా! ఆ నల్వురయందెవ్వఁడు మిక్కిలి మూఢుఁడు.’’ అనఁగా విక్రమాదిత్యుఁడు. ‘‘ప్రాణదానం బొసంగినవాఁడు.’’ అని నుడివెను. అందుల కెంతయు సంతసించుచు బేతాళుఁడు విక్రమాదిత్యుని ధైర్యస్థైర్యములు కార్యదీక్షయం దణుమాత్రమైనను దరుగకుండుటకు ఆశ్చర్యమొందుచు తిరిగి యా వృక్షము మీఁది కేఁగి వ్రేలాడఁజొచ్చెను. విక్రమాదిత్యుఁడు వెంటనే యేఁగి యా శవమును గైకొని వచ్చుచుండ బేతాళుఁడు మరల నొక కథ నారంభించెను.

22-వ కథ

మహారాజా! విష్ణుపుర మను పట్టణమందు నారాయణదేవుఁ డను నొక బ్రాహ్మణుఁ డుండెను. ఆతఁడు పండితుఁడు. ఎనుబది వత్సరములు నిండిన వృద్ధుఁడు. అతనికి సంసారభోగములయందు వైరాగ్యము కలుగకుండెను. అందువలన మంచము మీఁదఁగూర్చుండి యిట్లు తలపోయసాగెను.’’ వృద్ధుఁడ నైతిని. శరీరము దుర్బలమైనది. నాలుగడుగులు తిన్నఁగ నడువఁజాలను. అయినను ప్రయోజనంబేమి? సంసారభోగములమీఁద లేశమైనను విరక్తి కలుగలేదు. ఏమి చేయుదును? పరకాయ విద్య నెఱుంగుదును గదా? ఆ విద్యవలన జరాజీర్ణమగు నీ దుర్బల శరీరమును వీడి యే యువకుని శరీరమందో ప్రవేశించి సంసార భోగేచ్ఛను పూర్తిచేసికొనవచ్చును.’ కాని యాకస్మికముగ నీ శరీరమును వీడి మరియొక శరీరమందు ప్రవేశించినయెడల నా యుద్దేశము నెల్లరును గ్రహింతురు. చాల చిక్కులయందుఁ

దగుల్కొన వచ్చును. కావున యోగసాధన నెపమున బయలు దేరి యరణ్యముల కేఁగి పిమ్మట వీలు బట్టి ప్రవర్తించుట యుత్తమము" అని యనుకొని నారాయణ దేవుఁడు గృహ మును వీడి యరణ్యములకేఁగెను. కొంతకాల మచటనుండి యొక పురమందలి శ్మశానమును సమీపించి దహనమునకు సిద్ధముగ నున్న యువకుని శరీరమందు బ్రవేశించి విషయ సుఖముల ననుభవింపఁ జొచ్చెను.

కాని యా బ్రాహ్మణుఁడు స్వీయ దేహమును వీడు నప్పుడు మిక్కుటముగ దుఃఖించెను. యువకుని శరీరమందుఁ బ్రవేశించినంతనే నవ్వసాగెను.

కథను పూర్తిచేసి బేతాళుఁడు "మహారాజా! ఆ బ్రాహ్మణుఁడు నవ్వుటకును దుఃఖించుటకును కారణమేమి?" అని యడుగ విక్రమాదిత్యుఁ డిట్లనియె "బేతాళుఁడా! ఇన్ని దినములుగ నివసించుచుండిన నీ దేహముతోడ సంబంధము పూర్తియాయెనని దుఃఖించెను. యువకుని శరీరమందుఁ జేరి విషయభోగము లనుభవింపవచ్చునని సంతసించెను.

ఈ మాటలకు బేతాళుఁడు సంతసించుచు ఇంకను నీతని పరీక్షింపవలయునని తలఁచి తెప్పపాటు కాలములో వెనుకకుఁబోయి శిరీష వృక్షమున వ్రేలాడఁజొచ్చెను. విక్ర మాదిత్యుఁ డాశవమును శ్మశానమునకుఁ దీసికొని పోవలయు నను పట్టుదలతోడ తిరిగి యా వృక్షమును సమీపించి శవ మును మోసికొని కొంతదూరము నడచునప్పటికి బేతాళుఁ డీ క్రింది కథను చెప్పసాగెను.

23-వ కథ

మహారాజా! గోవిందుఁ డను బ్రాహ్మణుఁడు ధర్మపురమందు నివసించుచుండెను. ఆతని కిర్వురు పుత్రు లుండిరి. అందొకని పేరు భోజనవిలాసి, రెండవవాని పేరు శయ్యావిలాసి. భోజనపదార్థముల రుచి మొదలగువానిని గనిపెట్టుటయందు భోజనవిలాసుఁడు కడునేర్పరి. అందువలన భోజనపదార్థములయం దేమాత్రము లోప ముండినను నాతఁడు భుజింపలేకుండెను. శయనమం దేలోపమున్నను శయ్యావిలాసి నిదురింపకుండెను. గోవిందుని పుత్రు లిర్వురి విద్యలయం దసామాన్య లను విషయము దేశవిదేశముల యందును వ్యాపించెను. ఈ వృత్తాంతమును విని రాజాశ్చర్యాన్వితచిత్తుఁడై వారిద్వురఁ దీసికొని రావలయునని సేవకులఁ బంపెను. వా రేఁగి యా బ్రాహ్మణ కుమారు లిద్వురఁ దీసికొనిరాఁగా రాజు వంటవానిని బిలువనంపి పలువిధములగు పిండివంటలు మొదలగు వానిని సిద్ధము చేసి యాతనికి భోజనముం బెట్టుఁడని యాజ్ఞాపించెను. అటులే యాతఁడు భోజనపదార్థములను సంసిద్ధముచేసి భోజనవిలాసి సమ్ముఖమందు బంగారుపళ్లెరమందుఁ బెట్టిరి. భోజనవిలాసి చివ్వున లేచి రాజు సన్నిధికి వచ్చెను. రా జాతనిఁ గాంచి భుజించితివా? అని యడుగ భోజనవిలాసి యిట్లనియె. “మహారాజా! నేను భుజింపలేదు. ఏలయన, ఆ పదార్థములన్నియు అసహ్యముగ నున్నవి. శ్మశానమందు బండిన వరిధాన్యమును దంచిన బియ్యముతోడ అన్నము వండినాఁడు. అందుండి పీనుగల వాసన వచ్చుచున్నది. కావున నేను భుజింపలేదు.”

అను మాటలు విని పిచ్చివాఁడని పకపక నవ్వుచు, ఆ ధాన్య మెచ్చట బండినదియు కనుఁగొని రావలయు నని సేవకుల బంపెను. వారు విచారించి తిరిగి వచ్చి మహారాజున కిట్లు విన్నవించిరి. “అర క్రోసుదూరమం దొక గ్రామ మున్నది. ఆ గ్రామ శ్మశానము నానుకొనియున్న భూమియందు పండిన వరిధాన్యమును నగరపాలకుఁడు దెచ్చి నిల్వయుంచెను. ఆ ధాన్యమును దంచిన సన్నబియ్యమును పాకాధ్యక్షుఁడు వండి యున్నాఁడు.” అను వృత్తాంతమును విని భోజన విలాసుని ప్రజ్ఞకు రాజు మిక్కుటముగ సంతసించెను.

దివ్యసుందర మందిరమందు శయ్యనువేయించి శయ్యా విలాసుని శయనించుమనిరి. కాని యాతఁడు నిమేషకాలము దానిమీద శయనించి తిరిగి మహారాజును సమీపించి యిట్లనియె. “మహారాజా! నా శయ్యయందలి యేడవపొరలో వెంట్రుకయున్నది. అందువలన నాకు నిదురరాక లేచివచ్చితిని. అనఁగా రాజు సేవకులతో శయ్యను పరిశీలించి చూడవలయు నని చెప్పెను. వారు శయ్యను పరిశీలనచేసి యేడవపొర యందు వెంట్రుకయున్న దనఁగా రాజు సంతసించి వారిద్దరకు మంచి బహుమతు లిచ్చి పంపించెను.”

ఆ యిద్దరిలో మిక్కిలి ప్రశంసాపాత్రుఁడెవ్వఁడని బేతాళుఁడు విక్రమాదిత్యుని బ్రశ్నింప నాతఁడు “శయ్యావిలాసి.” అనియెను.

అనంతరము మహారాజు మరల శ్మశానములోని చెట్టు నుండి బేతాళుని తెచ్చుచుండఁగా ఆతఁడు నిట్లు వచించెను.

24-వ కథ

మహారాజా! కళింగ దేశమునం దొక గ్రామమున యజ్ఞశర్మయను బ్రాహ్మణుడు నివసించుచుండెను. అతడు తనకు సంతానము లేకుండుటకు వగచి పరమేశ్వరునిగూర్చి తప మాచరించెను. పిమ్మట పరమేశ్వరుని యనుగ్రహము వలన నాతని కొక పుత్రుడు పుట్టెను. అతడు క్రమ క్రమముగ వర్థిల్లిన కొలది వత్సరములలో నే సర్వశాస్త్ర పారంగతుడాయెను. కాని ప్రయోజన మేమి? పదునెనిమిదవ వత్సరముననే మరణించెను. ఆ దంపతుల దుఃఖమును వర్ణించుటెట్లు! ఆ శవమును శ్మశానమునకుం గొనిపోయిరి.

ఆ శ్మశానమం దొక వృద్ధుడు తపమాచరించుచుండెను. అతడీశవమునుగాంచి "నా శరీరము జరాజీర్ణమై యెందులకును పనికిరాకయున్నది. ఈ యువకుని శరీరమందు ప్రవేశింతును. అట్లొనర్చినయెడల యోగసాధనము చేయుటకు నాకు మిక్కిలి యవకాశ ముండును." అని తలచి భగవన్నామమును స్మరించుచు ఆ యువకుని శరీరమందు ప్రవేశించెను.

ఆ బ్రాహ్మణ కుమారుడు లేచి కూర్చుండగా యజ్ఞశర్మ పుత్రుని చూచి ప్రథమమున నవ్వెను. తర్వాత దుఃఖించెను."

అని కథను ముగించి బేతాళుడు విక్రమాదిత్యుని చూచి యిట్లనియె: "మహారాజా, యజ్ఞశర్మ ప్రథమమున నవ్వుటకును, తర్వాత దుఃఖించుటకును కారణ మేమి?" అన మహారా జిట్లనియె." మరణించిన కొడుకు బ్రతుకుటకు సంతసించెను. యోగి పుత్రుని శరీరమందు ప్రవేశించుటకు దుఃఖం



చెను." అను మాటలు విని బేతాళుఁడు "విక్రమాదిత్యుఁడసామాన్యప్రతిభాశాలి. సత్యవాది. ధర్మాసక్తుఁడు. నిరుపమాన

కార్యనిపుణుఁడు. అందువలననే గాఢాంధకారమగు నీ నిశీథిని బేతాళుఁడ నగు నన్నుఁ గాంచి యొకింతయైన చలింపక నా ప్రశ్నలకు సరియగు బ్రత్యుత్తర మిచ్చుచు, ఇరువదిమూడు మారులు వెనుకఁ బోయినను తిరిగి శవమును దీసికొని ప్రతిజ్ఞానుసారము శ్మశానమునకుఁ దీసికొని పోవలయు నని ప్రయత్నించుచున్నాఁడు. దుర్మార్గుఁ డగు యోగి తనకపకార మొనర్చుటకుఁ బ్రయత్నించు విషయము విక్రమాదిత్యుఁ డెరుఁగఁడు. అయినను నిర్భయముగ ప్రతిజ్ఞాపరిపాలనమునే ముఖ్యముగఁ బెట్టుకొని యాడినమాట తప్పకుండ శవమును దీసికొని పోయి పిమ్మట ప్రాణరక్షణ విషయమును చూచుకొనవచ్చు నని తలంచుచున్నాఁడు. నా కథలను విని నిర్మలాసక్తివలన మౌనము వీడుచున్నాఁడు. నే నాతనిమౌనభంగ మొనర్చుటకుఁ బ్రయత్నించియుంటిని, కాని యట్టి సత్యసంధుఁడగు మహారాజను [illegible] చుట తగదు. ఈతని ధైర్యోత్సాహముల యందేమి? [illegible] యందేమి? లోపమేమైనఁ గలుగునటుల తోపదు. అయినను [illegible] యొకమారు బ్రయత్నింతును. ఈ ప్రయత్నమునఁ గూడ [illegible] ధైర్యస్థైర్యములకు లోటు కలుగనియెడల విక్రమాదిత్యునకు సర్వవిధములఁ దోడ్పడుదును" అని తలంచి శింశుప వృక్ష శాఖల వ్రేలాడఁజొచ్చెను. విక్రమాదిత్యుఁడు అత్యంత సాహసుఁడు. అందువలన నణుమాత్రమైనను జంకక శవము [illegible] కొనిపోయి తీరవలయు నను సంకల్పమున వెనుకకు మరలి [illegible] శవమును దీసికొని బయలుదేరి వచ్చుచు మౌనముగ [illegible] మును సమీపించునప్పుడు బేతాళుఁడు నవ్వుచు "మహారాజా! నేనొక చిత్రమైన కథను జెప్పెదను." అని నుడివి యీ [illegible] కథను చెప్పెను.

25-వ కథ

మహారాజా! దక్షిణదేశమున ధర్మపుర మను నొక పట్టణ మున్నది. అది యా దేశమునకు రాజధాని. మహాబలుం డనువాం డా దేశమును పాలించుచుండెను. కాని యాకస్మికముగ మరియొక రాజు దండెత్తివచ్చి ధర్మపుర దుర్గమును ముట్టడించెను. శత్రు సైన్యములతోడ కొన్నిదినములు ఘోర యుద్ధముచేసెను. కాని ప్రయోజనమేమి? మహాబలుని సైన్యము రూపుమాసెను. అప్పుడు మహాబలుండు చేయునది లేక భార్యను పుత్రికను వెంట నిడుకొని కోటయందలి గుప్త ద్వారము మూలమున పలాయనమాయెను.

రాణియు, కుమార్తెయు క్రింద కాలుబెట్టియెఱుంగరు. అందువలన మహారణ్యమున కొంతదూరము నిర్గమించునప్పటికి మిక్కిలి యలసిరి. వారి పాదములు వాచెను. క్షుద్బాధలం బరితపింపంజొచ్చిరి. అప్పుడు రాజు వారి బాధను కని సహింపంజాలక వారిర్వుర నొక వటవృక్షమునీడం గూర్చుండంబెట్టి కందమూలఫలములను, జలమును దీసికొని వచ్చుటకేంగెను. కాని యెంతవడికిని మరలి రాకుండెను. రాణియు కుమార్తెయు ఆంకలికి పరితపింపంజొచ్చిరి. ఇంతలో సూర్యుండ స్తమించెను. చీకటిపడుచుండెను. గత్యంతర మేమని రాణి దుఃఖింపంజొచ్చెను. రాకుమారి భయపడసాగెను.

కుండిన నగరాధినాథుండగు చంద్రసేనుండు, పెద్ద కుమారునితోడ వేంటకు వచ్చెను. వారిర్వురు మహారణ్యమున స్త్రీల పదచిహ్నంబులంగాంచి యాశ్చర్యాన్వితచిత్తులై యాయడుగుల జాడనుబట్టి వటవృక్ష సమీపమునకు వచ్చిరి.

అచ్చట పరమసుందరులగు ఇర్వురు స్త్రీలు దుఃఖించుచుండుటను గాంచి వారిని సమీపించి పుట్టుపూర్వోత్తరములు వినఁగా చంద్రసేనుని హృదయము కరగెను. వారి నోదార్చి తన నగరమునకుఁ దోడ్కొని పోయెను. కొన్ని దినములు గడచిన పిమ్మట రాకొమరిని రాజు వివాహమాడెను. రాణిని యువరాజు వివాహమాడెను.

అంతటితో కథను ముగించి బేతాళుఁడు నవ్వుచు నిట్లనియె. "మహారాజా! వీరికి చెరియొక పుత్రుఁడు కలిగిన యెడల వారు పరస్పర మే మగుదురు?" అని ప్రశ్నింప విక్రమాదిత్యుఁడు నవ్వుచు ప్రత్యుత్తర మీయక శవమును మోసికొని ముందుకు పోవుచుండెను.

ఉపసంహారము.

బేతాళుఁడు తన కథను ముగించి యిట్లు తలఁచెను. "మహారాజును మిక్కుటముగ బాధించితిని. ఆతని మౌనవ్రతము నిరువదినాల్గు మారులు చెడఁగొట్టితిని. ఇరువదియైదవ మారు మౌనమును రక్షించుకొనుటకు నవ్వుచు ముందేఁగుచున్నాఁడు. ఇఁక నీతనిని బాధింపఁజనదు. ఆతని నవ్వునే ప్రత్యుత్తరముగఁ దలంచిన చాలదా! మహాపురుషుఁడును, సత్యవాక్యనిరతుఁడును, ధర్మపథగామియు, త్యాగశీలుఁడును, దయాసత్యశాంతాది సద్గుణభూషితుఁడును, శౌర్యసాహస విక్రమాది వీరలక్షణలక్షితుఁడు నగు నీ చక్రవర్తిని రక్షించి పరమదుర్మార్గుఁడగు నా యోగి నంతమొందింతును. విక్రమార్కున కండనై నిలుతును." అనుకొని యిట్లనియె. "మహారాజా! నీవు రాజ్యపీఠము నధిష్ఠించి ధర్మమును నాల్గుపాదముల నడ

పుచున్నావు. నీయందేవిధమగు లోపము కాన్పించినను నిన్ను సంహరింపవలయు నని పలు ప్రయత్నము లొనర్చితిని. పలు విధములం బరిశీలించి చూచితిని. కాని నీవు మహా పురుషుండవు. సింహాసనాసీనుండవై భూమండలమునంతయు నేలుటకు సర్వవిధముల నర్హుండవు. నీ స్థిరచిత్తమునకును, ధైర్యసాహసములకును, బుద్ధికుశలతకు నెంతయు సంతసించితిని. కావున నీ కొకమాట చెప్పెదను వినుము. నేను చెప్పినట్లు ప్రవర్తింపనిచో నీకు మృత్యువు దప్పదు."

అని యిట్లుపదేశించెను. "నిన్ను శవమును దీసికొని రావలయు నని చెప్పిన యోగి కుమ్మరి. ఆతని పేరు శాంతిశీలుండు. నీవు తీసికొని పోవుచున్న యీ శవము భోగవతి నగరాధినాథుండగు చంద్రభానునిది. శాంతిశీలుండు యోగబలమువలన చంద్రభానుని వధించెను. నిన్ను వధించినంగాని యాతని మనోవాంఛ సిద్ధింపదు. ఇప్పుడే నే నీశవమునుండి నిర్గమించెదను. నీ వేఁగినంతనే యాతఁడు సముచిత సంభాషణల మనోభావమును దెలియనీయక నన్నాహ్వానించును. నేను శవమునందు ప్రవేశింతును. నిన్ను సాష్టాంగప్రణామం బాచరింపు మని చెప్పును. అప్పుడు నీవు సాష్టంగపడినయెడల వెంటనే నీ తలను ఖండించి నాకు బలియొసంగి విద్యాధరులకు చక్రవర్తి యగును. కావున సాష్టాంగపడు మని నుడివి నప్పుడు నీవు "నేను మహారాజను; ఇదివర కెప్పుడును సాష్టాంగదండప్రణామం బాచరించి యెఱుంగను. కావున మీరు జూపింపుఁడు. అటులే సాష్టాంగప్రణామం బాచరింతును." అని నుడివినయెడల నాతఁడు నీకు చూపుటకుసాష్టాంగపడును. వెంటనే యాతని శిరమును ఖండించుము. పిమ్మట నా

రెండు శవములను కాళీదేవాలయమునకు పశ్చిమ దిక్కున కళ కళ కాగుచున్న నూనె గంగాళమున వేయుము. అప్పుడు నీకు బేతాళసిద్ధి యగును. సమ్రాట్టనగుదువు. చిరకాలము రాజ్య భోగముల ననుభవించి యాచంద్రార్కకీర్తిని గాంతువు."

అని నుడివి బేతాళుఁడు చంద్రభానుని శవమునుండి నిర్గమించెను. విక్రమాదిత్యుఁ డాశవమును గైకొని యోగిని సమీపింప శాంతిశీలుఁడు మిక్కుటముగ సంతసించి విక్ర మాదిత్యుని ధైర్యసాహసములు పొగడెను. వెంటనే యోగి యా శవమును బూజించి బేతాళు నాహ్వానించెను. బేతా ళుఁడు శవమునందుఁ బ్రవేశించెను. అప్పుడు శాంతిశీలుఁడు విక్రమాదిత్యుని చూచి యీ శవమునకు సాష్టాంగ నమస్కార మొనర్పు మని యచట నున్న ఖడ్గమును చేత ధరించెను. విక్రమార్కమహారాజు అణుమాత్రమైనను చలింపక శాంతి శీలుని చూచి యిట్లనియె. "యోగివరా! నేను మహారాజను, ఇంతవరకు సాష్టాంగప్రణామం బాచరించి యెరుంగను. కావున మీరు సాష్టాంగ నమస్కార మొనర్పుఁడు. పిమ్మట మీ రొనర్చినటుల ప్రణామం బాచరింతును." అన శాంతి శీలుఁడు ఖడ్గమును క్రిందఁబెట్టి శవమునకు సాష్టాంగ ప్రణామం బాచరించెను. వెంటనే విక్రమాదిత్యుఁడు ఒరలోని ఖడ్గ మును దీసి శాంతిశీలుని శిరమును ఖండించెను. ఈ యా ద్భుత సాహసమును గాంచుచున్న దేవతలు పుష్ప... గురిపించిరి. అప్పుడు దేవేంద్రుఁడు ...



స్త్ర కొ[illegible]దగినది యేమున్నది? అయినను ఆ చంద్రార్క
ముగ ఈ ఘటనము జగత్తునందుఁ బ్రచార మగుచుండు
త్రు వరమొసఁగుఁడు." అన దేవేంద్రుఁడు "తథాస్తు" అని
ని యంతర్హితుఁడాయెను.

పిమ్మట విక్రమాదిత్యుఁడు ఆ రెండు శవములను కళ
కళ కాగుచుండిన నూనె గంగాళమందుఁ బడవేయ నందుండి
తాళ బేతాళు లను నిద్దరు ఘోర రూపులు ప్రత్యక్షమై
ల్కిరి. 'మహారాజా! నీకేమి కావలయును? ఎట్టి దుష్కట
కార్యమునైనను త్రుటిలోన సాధింతుము. నీవు తలంచుకొన
ంత నే నీ కడకు వత్తుము.' అన విక్రమాదిత్యుఁ డిట్లనియె.
"తాళుఁడా! బేతాళుఁడా! ఇప్పుడు నా కెట్టి పని [illegible]
కావున నిర్గమింపుఁడు. కాని నేను తలంచుకొనిన [illegible]
నే వచ్చుచుండవలయును సుమా," అని నుడివి [illegible]
రంతర్హితులైరి.

విక్రమాదిత్యుఁడు దేదీప్యమానముగ వెలుఁగుచు రాజ
ధానికి వచ్చెను. పిమ్మట ధరాచక్రమునకు చక్రవర్తియై ధర్మముఁ
దప్పక రాజ్యపాలనం బొనర్చుచుండెను.

సంపూర్ణము.

Methodist Publishing House, Mad s—1920.

Sri Ramana from J.

for

to

Tel apende



మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA123B172
పుస్తకం పేరు	బేతాళ పంచవింశతి
తారీఖు	29/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	133
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	B, 144
లేని పేజీలు	51,52,61,62,75,76,77,78,81,82,107,108,115,116
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	[illegible]
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	KASIMBI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good